www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గ్యాస్ట్రిక్ సమస్యలకు క్యాప్సూల్ ఎండోస్కోపీ

ఏఐజీ ఆస్పత్రిలో 'రోబోటిక్ క్యాప్సూల్ ఎండోస్కోపీ టెక్నాలజీ'.. పైలట్ 14

చిన్న క్యాప్సూల్‌తో జీర్ణాశయ ఇబ్బందుల నిర్ధారణ

అల్సర్, పాలిప్స్, ఇన్‌ఫెక్షన్లు, క్యాన్సర్ల గుర్తింపు

ఎఫ్‌డీఏ అనుమతులతో పూర్తిస్థాయిలో సేవలు

శుక్రవారం | 20-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 262 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ. 10.49 తదుపరి షష్ఠి; నక్షత్రం: మఖ తె. 3.47 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ.2.53-4.36; దుర్ముహూర్తం: ఉ.8.55-9.39, మ.12.34-1.18; అమృతఘడియలు: రా.1.12-2.55; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 5.41

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పార్లమెంటు ఆవరణలో

బాహాబాహీ!

చరిత్రలో ఎన్నడూ చూడని దృశ్యం

మలుపు తిరిగిన అంబేడ్కర్‌పై షా వ్యాఖ్యల వివాదం

ఇండియా, ఎన్డీఏ ఎంపీల పోటాపోటీ నిరసనలు

మకరద్వారం వద్ద తోపులాట

ముఖేశ్ రాజ్‌పుత్‌ను రాహుల్ బలంగా తోసేశారు

ఆయన ప్రతాప్ సారంగిపై పడ్డారు

మా ఎంపీలకు గాయాలయ్యాయి

హత్యాయత్నం జరిగింది: బీజేపీ

బీజేపీ వాళ్లే అడ్డుకొని నన్ను, ఖర్గేను తోసివేశారు: రాహుల్ గాంధీ


నా మోకాలికి గాయమైంది: ఖర్గే

రాణాలో ఇరుపక్షాల ఫిర్యాదులు

రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

న్యూఢిల్లీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతదేశ పార్లమెంటు చరిత్రలోనే ఎన్నడూ కనీవినీ ఎరుగని దృశ్యం గురువారం ఆవిష్కృతమైంది. అధికార, విపక్షాల మధ్య ఇప్పటివరకూ జరుగుతున్న మాటల యుద్ధం గురువారం భౌతిక దాడులకు దారితీసింది. బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానించారని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు ఒకవైపు.. కాంగ్రెస్ పార్టీ అమిత్ షా మాటల్ని వక్రీకరించటమే కాక వారి హయాంలో

మిగతా 2వ పేజీలో...





నిరసనలో ప్రియాంక, బీజేపీ ఎంపీ హేమంగ్ జోషి; సారంగికి చికిత్స చేస్తున్న ... (caption partly illegible)

షాను కాపాడేందుకు బీజేపీ కుట్ర

రాహుల్‌పై బీజేపీ ఆరోపణలు అందుకే: ప్రియాంకాగాంధీ

రాహుల్ అనుచితంగా ప్రవర్తించారు: బీజేపీ ఎంపీ కొన్యాక్

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు ఫిర్యాదు 2

అమిత్‌షాపై ఖర్గే సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

మార్చి 21 నుంచి పది పరీక్షలు.. షెడ్యూల్ విడుదల 14



బుక్ ఫెయిర్‌లో రేవంత్, కోదండ

అనుకూల చరిత్ర రాయించుకున్నారు!

అదే నిజమైనదిగా భ్రమ కల్పించారు

దాంట్లో అమరులకు చోటు దక్కలేదు

కేసీఆర్ హయాంపై రేవంత్ వ్యాఖ్య

37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన సీఎం 14

ఔటర్ టెండర్‌పై సిట్

విచారణకు ఆదేశించిన రేవంత్

శాసనసభలోనే ప్రకటన

హరీశ్, కేటీఆర్ కోరిక మేరకే: సీఎం

భూ అక్రమాలపైనా సిట్! 13

పదేళ్లలో జరిగిన లావాదేవీలపై సమగ్ర విచారణకు సర్కారు యోచన

ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన

తెలియదు.. నాకు గుర్తులేదు..!

కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలకు స్మితాసబర్వాల్ సమాధానాలు

బ్యారేజీలు ఎప్పుడు ప్రారంభించారో తెలియదు: మాజీ సీఎస్ సోమేశ్

నేడు విచారణకు వెదిరె శ్రీరామ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం 14

కేటీఆర్ ఏ 1

ఏ2 అర్వింద్‌కుమార్.. ఏ3 చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి

ఫార్ములా ఈ రేసు కేసులో ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు

ఏసీబీకి ఫిర్యాదు చేసిన పురపాలక కార్యదర్శి దానకిశోర్

విచారణలో మరికొందరు అధికారులను చేర్చే అవకాశం

నిందితులకు తొలుత నోటీసులు.. తర్వాత అరెస్టులు!

'ఫార్ములా ఈ' నిర్వహణకు మూడు పార్టీల ఒప్పందం

ఇందులో హెచ్ఎండీఏ లేకున్నా దాని ఖాతా నుంచి రూ.54.88 కోట్ల చెల్లింపు

ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు

డాలర్లలో చెల్లించి ఆర్బీఐ అనుమతి తీసుకోని వైనం

ఎన్నికల కోడ్ ఉండగా అనుమతి తీసుకోకుండా ఒప్పందం

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఏసీబీ కేసు పెట్టింది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంది. అప్పటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను ఏ2గా, నాటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా పేర్కొంది. కేటీఆర్ తదితరులపై అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1),(ఏ) రెడ్ విత్ 13(2) సెక్షన్ 409, 120 బి ప్రకారం కేసు నమోదు చేశారు. మరి కొంత మంది అధికారులను సైతం ఎఫ్ఐఆర్‌లో చేర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం కేటీఆర్‌కు నోటీసు ఇచ్చి.. ఆ తర్వాత లేదా అదే రోజు అరెస్టు చేసే దిశగా ఏసీబీ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ కేసులో కేటీఆర్ ఏ1గా ఉండబోతున్నారని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పిన విషయం తెలిసిందే. ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ కొద్ది కాలం కిందట రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కోరిన విషయం తెలిసిందే. ఆయన నుంచి అనుమతి వచ్చిన తర్వాత దీనిపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించారు. కేసును ఏసీబీకి పంపాలని క్యాబినెట్‌లో నిర్ణయించారు. సంబంధిత పత్రాలను సీఎస్ శాంతికుమారి ఏసీబీకి పంపించారు. ఫార్ములా ఈ కారు రేసుకు సంబంధించిన సవివరమైన ఫిర్యాదును

మిగతా 12వ పేజీలో...



తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన నరేందర్‌రెడ్డి

అవినీతే లేదు.. ఏసీబీ కేసు ఏంటీ?

రేసు కోసమే నిర్వహణ సంస్థకు 55 కోట్లిచ్చాం.. ఆధారాలు ఉన్నాయి

ప్రభుత్వ అవగాహన లోపంతోనే నష్టం 12

ఫార్ములా-ఈ రేసు అంశంపై కేటీఆర్ నేడు హైకోర్టులో క్వాష్ పిటిషన్

తప్పు చేయకుంటే భయమేల?

తొలిసారి రేస్‌తో రూ.200 కోట్ల నష్టం


అందుకే ప్రమోటర్ మళ్లీ రాలే

తెలిసీ రూ.55 కోట్లిచ్చారు: పొన్నం

ఖర్గేను, నన్ను తోసేశారు

కర్రలు చేతబట్టి బీజేపీ ఎంపీలు సభలోకి వెళ్లకుండా మమ్మల్ని అడ్డుకున్నారు

- అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీ యత్నం
- బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనాసరళి ఎప్పుడూ రాజ్యాంగానికి, అంబేడ్కర్‌కు వ్యతిరేకం
- లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఆగ్రహం
- షా క్షమాపణ, రాజీనామాకు డిమాండ్
- నన్ను నెట్టారు.. బ్యాలెన్స్ తప్పి కిందపడ్డా
- రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే
- దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరిక


మీడియాతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ; చిత్రంలో ఖర్గే

న్యూఢిల్లీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని.. గురువారం పార్లమెంటులో చోటుచేసుకున్న ఘటనలు అందులో భాగమేనని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. గురువారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు అదానీ లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైందని.. దానిపై చర్చించాలని తాము కోరామని, కానీ ఆ చర్చ జరగకుండా సమావేశాలు మొదలైనప్పటి నుంచీ బీజేపీ ఇదే పనిచేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనాసరళి ఎప్పుడూ రాజ్యాంగం, అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఉంటుందని.. అందుకే ఆయన జ్ఞాపకాలను చెరిపివేయాలని కోరుకుంటున్నాయని రాహుల్ మండిపడ్డారు. "కేంద్ర హోంమంత్రి తన వ్యాఖ్యల ద్వారా తన ఆలోచనా తీరును బయటపెట్టుకున్నారు. ఆయన క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని మేం డిమాండ్ చేశాం. కానీ ఆ రెండూ జరగలేదు. ఇవాళ వాళ్లు ఒక కొత్త గత్తరకు తెరతీశారు. మేం అంబేడ్కర్ విగ్రహం నుంచి పార్లమెంటు హౌస్‌కు వెళ్తున్న సమయంలో.. బీజేపీ ఎంపీలు చేతుల్లో కర్రలు పట్టుకుని మెట్ల వద్ద నిలబడి, మమ్మల్ని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు"అని తెలిపారు. "నేను పార్లమెంటులోకి వెళ్తుంటే బీజేపీ ఎంపీలు నన్ను అడ్డుకుని, తోసేస్తూ బెదిరించారు" అని ఆవేదన వెలిబుచ్చారు. ఖర్గే, ప్రియాంకను కూడా తోసేశారా? అని మీడియా ప్రశ్నించగా.. "అది కూడా జరిగింది. కానీ, ఈ తోపులాటలకు మేం బెదరం"అని రాహుల్ స్పష్టంచేశారు. పార్లమెంటు మకర ద్వారాన్ని చూపుతూ.. "ఇది పార్లమెంటులోకి ప్రవేశించే ద్వారం. లోపలికి వెళ్లడానికి మాకు హక్కుంది. బీజేపీ సభ్యులు మమ్మల్ని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా.. అందుకు క్షమాపణ చెప్పి, రాజీనామా చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రధాని మన దేశాన్ని అదానీకి తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు.

అంతా వాళ్లే చేసి..

అంబేడ్కర్‌పై షా వ్యాఖ్యలను మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా ఖండించారు. "తాను తప్పు చేసినట్టు ఒప్పుకోవడానికి ఆయన (అమిత్ షా) నిరాకరిస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశాం. ఆయన్ను పదవి నుంచి తొలగించాలని ప్రధాని మోదీని కోరాం. అదీ జరగలేదు. అందుకే రాహుల్, ప్రియాంక సహా మా పార్టీ నేతలందరం నిరసన తెలిపాం. బీజేపీ ఈ అంశాన్ని పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తోంది"అని ఖర్గే అన్నారు. ఆ కుట్రలో భాగంగానే బీజేపీ ఎంపీలు తమపై దాడి చేశారన్నారు. "మేమెంతో క్రమశిక్షణతో ఒక వరుసలో వస్తున్నాం. వాళ్ల(బీజేపీ) మనసులో ఏముందో నాకు తెలియదు. మకర ద్వారం వైపు వచ్చి మాకు అడ్డు తగిలారు. పార్లమెంట్ లోపలికి వెళ్లాలని మేం అనుకున్నాం. కానీ వారు తలుపుల వద్ద మమ్మల్ని ఆపేశారు. పురుష ఎంపీలు కండబలాన్ని చూపించారు. మాతో వస్తున్న మహిళా ఎంపీలను సైతం అడ్డుకున్నారు. ఉద్దేశపూర్వకంగానే మాపై దాడి చేశారు. వారు నన్ను నెట్టేసరికి నేను కిందపడిపోయాను"అని ఖర్గే తెలిపారు. "ఇదంతా వాళ్లే చేసి.. మేమే వాళ్లను తోసేసి, వారి గాయాలకు కారణమయ్యామంటూ మాపై ఆరోపణలు చేస్తున్నారు. మమ్మల్ని చూసి హేళన చేస్తున్నారు" అన్నారు. అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారని, దీనిపై దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని తెలిపారు. "తిన్నది లేదు తాగింది లేదు.. 12 అణాల గ్లాస్ పగలగొట్టాడు"అని హైదరాబాద్‌లో అంటుంటారని..బీజేపీ వాళ్లు చేస్తున్నది అలాగే ఉందని ఖర్గే అన్నారు.

ఇదిలా ఉండగా.. అంబేడ్కర్‌పై అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యల వీడియోను డిలీట్ చేయాలంటూ 'ఎక్స్'కు కేంద్రం తాఖీదునిచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది. కేంద్రం ఇలా అడుగుతోందంటూ 'ఎక్స్' నుంచి తమకు ఒక ఈ మెయిల్ వచ్చిందని ఆ పార్టీ సోషల్ మీడియా అండ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ చైర్‌పర్సన్ సుప్రియ తెలిపారు. అయితే.. 'ఎక్స్' ఆ వీడియోలను తొలగించలేదని ఆమె చెప్పారు.

నేనెప్పుడు తెల్లటి టీ-షర్టులే వేసుకొంటాను. పారదర్శకతకు, దృఢత్వానికి, సరళత్వానికి తెలుపు దనం ప్రతీక.. మొన్న జూన్ 19న తన 54వ పుట్టిన రోజు సందర్భంగా ఈ మాటలు చెప్పిన రాహుల్ గురువారం హఠాత్తుగా నీలిరంగు టీ-షర్టులో కనిపించి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. అంబేడ్కర్‌కు నచ్చినది దళిత జాతికి గుర్తింపు తెచ్చినదీ నీలిరంగే. రాజ్యాంగం, అంబేడ్కర్ అంశాలపై రాజకీయ రచ్చ నేపథ్యం లో రాహుల్ ఇలా నీలిరంగు టీ-షర్టుకు మారిపోవడం ప్రాధాన్యం ఉన్న పరిణామమే!

షాను కాపాడే కుట్రలో భాగమే: ప్రియాంక

బీజేపీ ఎంపీని రాహుల్‌గాంధీ తోసేశారంటూ బీజేపీ చేస్తున్న ఆరోపణలు అమిత్‌షాను కాపాడేందుకు ఆ పార్టీ పన్నిన కుట్రగా ప్రియాంకా గాంధీ అభివర్ణించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విపక్ష ఎంపీలను పార్లమెంటులో ప్రవేశించకుండా అడ్డుకునేందుకు అధికారపార్టీ ఎంపీలు గూండాగిరీకి పాల్పడుతున్నారని ఆమె మండిపడ్డారు. బీజేపీ ఎంపీ ప్రతాప్‌చంద్ర సారంగిని రాహుల్ తోసేశారన్న బీజేపీ ఆరోపణను ఆమె తోసిపుచ్చారు. రాహుల్.. అంబేడ్కర్ చిత్రపటాన్ని పట్టుకుని 'జై భీమ్' అని నినదిస్తూ శాంతియుతంగా పార్లమెంటులోకి వెళ్తుండగా ఆయన్ను అడ్డుకున్నారని పేర్కొన్నారు. తన కళ్ల ముందే వారు ఖర్గేను తోసేస్తే ఆయన కింద పడిపోయారన్నారు. అంబేడ్కర్‌పై బీజేపీ అసలు ఆలోచనలు.. అమిత్‌షా వ్యాఖ్యల రూపంలో బయటపడ్డాయన్నారు. "దేశానికి రాజ్యాంగాన్ని, కోట్లాది మంది దళితులు, అణగారినవర్గాల ప్రజల జీవితాలను మార్చేసిన అంబేడ్కర్‌ను బీజేపీ తన ఆలోచనలు, చర్యలతో అవమానిస్తోంది"అని ప్రియాంక ట్వీట్ చేశారు.

ప్రతిపక్ష నేతగా రాహుల్ తగరు

కండబలం చూపిస్తారా?: బీజేపీ

న్యూఢిల్లీ, డిసెంబరు19: పార్లమెంట్ ప్రాంగణంలో కాంగ్రెస్ చేపట్టిన నిరసనల్లో రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు ప్రతిపక్ష నేతగా ఆయన తగరని నిరూపించిందని బీజేపీ ఆరోపించింది. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పీయూష్ గోయల్, అనురాగ్ సింగ్ ఠాకూర్ విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ తోయడంతో తమ పార్టీ ఎంపీలు ప్రతాప్ సింగ్ సారంగి, ముఖేశ్ రాజ్‌పుత్ గాయపడ్డారని చౌహాన్ ఆరోపించారు. పార్లమెంట్‌లో కండబలం చూపిస్తారా, గూండాలు పార్లమెంట్‌కు రావొచ్చా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ఎటువైపు తీసుకెళ్లాలనుకుంటుందని రాహుల్ ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న తీరు సరికాదని, పీయూష్ గోయల్ అన్నారు. తన తీరుపై రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'అంబేడ్కర్'పై అబద్ధాలు ఆపండి

అంబేడ్కర్ అంశంలో అబద్ధాలు ఆపాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కాంగ్రెస్‌కు సూచించారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అనేకసార్లు అవమానించిందన్నారు. అంబేడ్కర్‌ను నెహ్రూ ద్వేషించేవారని, రెండుసార్లు ఎన్నికల్లో ఓడిపోయేలా చేశారని ఆరోపించారు. తన మంత్రివర్గంలో అంబేడ్కర్ లేకపోవడం తనకు ఆనందాన్నిస్తోందని నెహ్రూ లేఖలు రాశారని గుర్తు చేశారు. అంబేడ్కర్ అంత్యక్రియలు జరిగిన ముంబైలోని చైతన్య భూమిని అప్పగిస్తామని కాంగ్రెస్ చేయలేదని, మోదీ ప్రభుత్వం 2015లో ఆ పని పూర్తి చేసిందని నడ్డా గుర్తు చేశారు.

రాహుల్ నాపట్ల అనుచితంగా ప్రవర్తించారు: మహిళా ఎంపీ

పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ తనను అసౌకర్యానికి గురిచేశారని బీజేపీ రాజ్యసభ మహిళా ఎంపీ ఫంగ్నోన్ కొన్యాక్ ఆరోపించారు. ప్లకార్డులు పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా రాహుల్ తనకు అతి సమీపంగా వచ్చారని ఆమె చెప్పారు. తనపై గట్టిగా అరుస్తూ అనుచితంగా ప్రవర్తించారని, ఒక మహిళగా అసౌకర్యానికి గురయ్యానన్నారు. రాహుల్ చర్యలతో తన గౌరవానికి భంగం కలిగిందని, తనకు రక్షణ కల్పించాలని రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌ను కోరారు.

పార్లమెంటు ఆవరణలో బాహాబాహీ!

(మొదటి పేజీ తరువాయి)

అంబేడ్కర్‌ను అవమానించారని పేర్కొంటూ అధికార పక్ష సభ్యులు మరోవైపు.. పార్లమెంట్ ప్రాంగణంలో పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. ఆ నిరసనలు తోపులాటకు దారితీసి ఉద్రిక్తత ఏర్పడింది. బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు గాయపడి ఆస్పత్రి పాలు కాగా, ఆ పార్టీకే చెందిన ఓ మహిళా ఎంపీ తన పట్ల రాహుల్‌గాంధీ అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. రాహుల్ గాంధీ తోసేయడం వల్లే తమ ఎంపీలు గాయపడ్డారని బీజేపీ ఆరోపించగా.. తొలుత వాళ్లే తనను నెట్టివేశారని, తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా తోసివేస్తే ఆయన మోకాలికి గాయమైందని రాహుల్ గాంధీ అన్నారు. తమ సభ్యులపై హత్యాయత్నం జరిగిందని బీజేపీ ఎంపీలు అనురాగ్ ఠాకూర్, బాన్సురీ స్వరాజ్ రాహుల్‌గాంధీపై పార్లమెంట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. 84 ఏళ్ల ఖర్గే పట్ల బీజేపీ ఎంపీలు అనుచితంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్ ఎంపీలు దిగ్విజయ్ సింగ్, ముకుల్ వాస్నిక్ తదితరులు అదే స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు పార్టీల నేతలు పరస్పరం నిందించుకుంటూ, జరిగిన ఘటనపై దర్యాప్తు జరిపించాలంటూ ఉభయ సభల అధ్యక్షులకు లేఖలు రాశాయి. ఇరు వర్గాలూ తమ కథనాలను సమర్థించుకుంటూ వీడియోలు విడుదల చేశాయి. ఈ మొత్తం ఉదంతం ఉభయ సభలను కుదిపివేయడంతో గందరగోళం, నినాదాల మధ్య ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండా శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

మకరద్వారం వద్ద ఉద్రిక్తత

గురువారం ఉదయం పార్లమెంటు కార్యకలాపాలు ప్రారంభం కావటానికి ముందే ఎన్‌డీఏ, ఇండియా ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసనకు దిగారు. అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, సుప్రియా సూలేతో పాటు కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, ఎస్పీ, ఎన్సీపీ (శరద్‌పవార్), వామపక్షాలు తదితర పార్టీల సభ్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్‌కు సంకేతంగా పలువురు ఎంపీలు నీలి రంగు టీషర్టులు ధరించారు. నిరసన అనంతరం ఊరేగింపుగా.. పార్లమెంటులోకి ఎంపీల ప్రవేశద్వారమైన మకర ద్వారం నుంచి లోపలికి వెళ్లేందుకు అక్కడికి చేరుకున్నారు. అయితే, ఆ సమయంలో మకరద్వారం వద్ద అధికారపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో అంబేడ్కర్‌కు అవమానం జరిగిందని, దానికి ఆ పార్టీ క్షమాపణ చెప్పాలంటూ వారు నినాదాలిచ్చారు. ప్రతిపక్ష ఎంపీలు అటువైపు రావటంతో.. ఇరు వర్గాలు పోటాపోటీగా నినాదా లు చేయటం ప్రారంభించాయి. దీనితో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ సభ్యులు కర్రలతో కూడిన ప్లకార్డులను పట్టుకొని, ఆ కర్రలతో తమ మీద దాడి చేశారని, తాము పార్లమెంట్ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాహు లే తమ మీద దాడి చేసి తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలను గాయపర్చారని బీజేపీ సభ్యులు ఆరోపించారు. ముఖేశ్ రాజ్‌పుత్ అనే ఎంపీని రాహుల్ బలంగా తోసివేశారని, ఆయన ప్రతాప్ సారంగి అనే మరో ఎంపీపై పడ్డారని, ఇరువురూ గాయపడటంతో వారిని ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందని తెలిపారు. రాహుల్ కారణంగానే తాను గాయపడ్డానని 69 ఏళ్ల ప్రతాప్ సారంగి ఆరోపించారు. తనను రాహుల్ తోసి వేశారని ముఖేశ్ చెప్పారు. కాగా, ఇతర ఎంపీలను కొట్టేందుకే మీరు కరాటే, కుంగ్‌ఫూ నేర్చుకున్నారా అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ.. రాహుల్‌ను ప్ర శ్నించారు. కాగా, తానెవరినీ తోసేయలేదని రాహుల్ గాంధీ చెప్పారు. తాను పార్లమెంట్ లోపలికి వెళ్తుండగా బీజేపీ ఎంపీలే తనను బెదిరించి తోసేశారని ఆరోపించారు. తమ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా తోసేశారని చెప్పారు. దీనిపై ఖర్గే కూడా స్పందించారు. బీజేపీ ఎంపీలు తనను నెట్టివేస్తే కూలబడ్డానని, తన మోకాలికి గాయమైందని, కుంటుకుంటూ సభలోకి వెళ్లానని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ఈ దాడిపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ పార్లమెంటులోకి రాకుండా బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారని కాంగ్రెస్ ఎంపీలు ఓం బిర్లాను కలిసి ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారని పేర్కొంటూ, ఆయన మీద రాజ్యసభ చైర్మన్‌కు ప్రతిపక్ష నేత ఖర్గే సభాహక్కుల ఉల్లంఘన నోటీసు సమర్పించారు. మరోవైపు.. తాము ఊరేగింపుగా వెళ్తుండగా బీజేపీ ఎంపీలే అడ్డుకున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఓ వీడియో విడుదల చేయగా.. బీజేపీ మరో వీడియో విడుదల చేసింది. గాయపడి నేల మీద కూర్చున్న బీజేపీ ఎంపీ సారంగి వద్దకు రాహుల్ రావటం, రాహుల్‌ను ఉద్దేశించి 'మీకు సిగ్గు లేదా! మీరు గుండాలా వ్యవహరిస్తున్నారు' అని మరో బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే వ్యాఖ్యానించటం ఆ వీడియోలో కనిపించింది. సారంగే తనను తోసివేశారని రాహుల్ అంటున్నట్లుగా ఆ వీడియోలో ఉన్నది.


పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న ఎన్‌డీఏ ఎంపీలు

సారంగికి బైరెడ్డి శబరి ప్రథమ చికిత్స

తలకు గాయమైన ప్రతాప్ సారంగికి టీడీపీ ఎంపీ, స్వయంగా డాక్టరైన బైరెడ్డి శబరి వెంటనే ప్రథమ చికిత్స చేస్తే మరో టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దగ్గరుండి ఆస్పత్రికి తీసుకెళ్లారు. రాహుల్‌గాంధీ వ్యవహరించిన తీరు సరైంది కాదని శబరి వ్యాఖ్యానించారు. 69 ఏళ్ల వృద్ధుడని చూడకుండా రాహుల్ గాంధీ తోసేశారని, రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్నదంటున్నవారు ఇలాగేనా ప్రవర్తించేది అని ఆమె ప్రశ్నించారు.

గేట్ల వద్ద ఆందోళనలు చేయొద్దు: స్పీకర్

పార్లమెంట్ ప్రాంగణంలో తోపులాట నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్‌కు సంబంధించిన గేట్ల వద్ద ఆందోళనలు, నిరసనలు చేపట్టవద్దని ఎంపీలకు సూచించారు. అన్ని ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

ఎంపీలకు మోదీ పరామర్శ

తోపులాటలో ఒడిసాలోని బాలాసోర్ ఎంపీ ప్రతాప్ సారంగి (69), యూపీలోని ఫరూఖాబాద్ ఎంపీ ముఖేశ్‌లోధా రాజపుత్ (56)లకు గాయాలు తగలడంతో చికిత్స కోసం వారిని రాంమనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు. ఇరువురికీ తలకు గాయాలయ్యాయని ఆస్పత్రి సూపరింటిండెంట్ అజయ్ శుక్లా చెప్పారు. సారంగి తలకు లోతుగా గాయమైందని.. కుట్లు వేయాల్సి వచ్చిందన్నారు. కాగా ప్రధాని మోదీ ఇద్దరు ఎంపీల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, శివరాజ్ సింగ్ చౌహాన్, ధర్మేంద్ర ప్రధాన్ ఆస్పత్రికి వచ్చి పరామర్శించారు. కాగా, కాంగ్రెస్, బీజేపీలు పార్లమెంటుస్ట్రీట్‌లోని పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. తమ పార్టీ ఎంపీ ప్రతాప్ సారంగి మీద రాహుల్ దాడి చేశారంటూ బీజేపీ ఎంపీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాహుల్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

తగ్గనున్న అమెరికా వీసా కష్టాలు

- యూఎస్ వీసా జారీ నిబంధనల్లో మార్పు

న్యూఢిల్లీ, డిసెంబరు 19: నూతన సంవత్సరంలో అమెరికా వెళ్లాలనుకునే భారతీయులకు శుభవార్త. వీసా కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన అవసరం ఇంక ఎంతమాత్రం లేదు. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా జారీ విధానాలను సరళీకరిస్తూ బైడెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్చిన నిబంధనలు 2025, జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నిబంధనల ప్రకారం వీసా అపాయింట్‌మెంట్ షెడ్యూల్, రీ షెడ్యూల్ మరింత సులభమవుతుంది. అలాగే దానికోసం ఎదురు చూడాల్సిన సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈమేరకు భారత్‌లోని యూఎస్ ఎంబసీ ఓ ప్రకటన చేసింది. 'ప్రతి ఒక్కరూ వీసా అపాయింట్‌మెంట్ సమయం పొందడానికి, వేచి ఉండాల్సిన సమయాన్ని తగ్గించడానికి అనుగుణంగా పలు మార్పులు చేశాం. నూతన నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు వారి అపాయింట్‌మెంట్‌ను ఎలాంటి అదనపు రుసుము లేకుండా నచ్చిన వీసా కేంద్రానికి మార్చుకొని, ఒకసారి రీ షెడ్యూల్ చేసుకోవచ్చు. ఒకవేళ రీ షెడ్యూల్ చేసుకున్న సమయానికి వీసా ఇంటర్వ్యూకి వెళ్లలేక, మరోసారి రీ షెడ్యూల్ చేసుకోవాలని భావిస్తే కొత్త అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవాలి' అని ఎంబసీ తన ప్రకటనలో పేర్కొంది.

కెనడాలో శాశ్వత నివాసానికి దరఖాస్తులు

- 1,085 మందికి అవకాశం కల్పించిన ట్రూడో ప్రభుత్వం
- భారతీయ నిపుణులకు భారీ లబ్ధి చేకూరే అవకాశం

న్యూఢిల్లీ, డిసెంబరు 19: తమ దేశానికి వలసల సంఖ్యను పెంచడానికి కెనడా సిద్ధమైంది. ప్రొవిన్షియల్ నామినీ ప్రోగ్రామ్ (పీఎన్‌పీ) కింద విదేశీ పౌరులు శాశ్వత నివాస హోదా పొందేందుకు ట్రూడో ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనికోసం ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టమ్ (ఈఈఎస్) ద్వారా మొత్తం 1,085 మంది నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖ(ఐఆర్‌సీసీ) ఈ నెల 16న ప్రకటన విడుదల చేసింది. ఇదే కార్యక్రమం కింద ఈ నెల 2న 672 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించింది. తాజా నిర్ణయంతో కెనడాలో శాశ్వత నివాసం పొందాలని భావించే భారతీయ వృత్తి నిపుణులకు బారీ లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. విదేశీ పౌరులు నిర్దిష్ట ప్రావిన్స్‌లో నివసించడానికి, పనిచేయడానికి పీఎన్‌పీ అనుమతిస్తుంది.

2030 నాటికి చైనా వద్ద వెయ్యి అణ్వాయుధాలు!

- ఈ ఏడాది ఇప్పటికే 100 తయారు.. 'పెంటగాన్' వెల్లడి

వాషింగ్టన్, డిసెంబరు 19: చైనా అణ్వాయుధాల తయారీలో వేగం పెంచింది. ఈ ఏడాది ఇప్పటికే కనీసం 100 అణ్వస్త్రాలను తయారు చేసింది. ఇదే వేగం కొనసాగిస్తే 2030 నాటికి చైనా అమ్ములపొదిలో 1,000 అణ్వాయుధాలు సమకూరనున్నాయి. చైనా మిలిటరీకి సంబంధించి అమెరికా రక్షణశాఖ కార్యాలయం పెంటగాన్ తాజాగా రూపొందించిన వార్షిక నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. ప్రస్తుతం చైనా వద్ద 600కు పైగా అణ్వాయుధాలు ఉన్నాయని నివేదిక పేర్కొంది. 2019లో వీటి సంఖ్య 400 మాత్రమేనని, 2023 మే నాటికి ఆ సంఖ్య 500కు పెరిగిందని తెలిపింది. ఈ ఏడాది వాటిసంఖ్య ఏకంగా 20% పెరిగి 600కు చేరడం గమనార్హం. తమ జాతీయ భద్రతకు సరిపడా అణ్వాయుధాలు ఉంచుకొంటామని ఇప్పటికే చైనా తేల్చిచెప్పింది. కాగా, 2023 నాటికి అమెరికా వద్ద దాదాపు 3,748 అణ్వాయుధాలు ఉన్నాయి. చైనా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు ఆ దేశ అణు సామర్థ్యాన్ని మరింత పెంచాయని పెంటగాన్ నివేదిక తెలిపింది. చైనా రక్షణ వ్యయాన్ని భారీగా పెంచేసినట్టు వివరించింది.

శబరిమలలో మండల పూజకు సిద్ధం

- 22న అరన్ములలో తంగఅంకి కార్యక్రమం
- 25న శబరిమలకు రథం చేరిక
- 26న మండల పూజ

శబరిమల, డిసెంబరు 19: శబరిమలలో అయ్యప్ప స్వామి మండల పూజకు సర్వం సిద్ధమైంది. నవంబరు 16న ప్రారంభమైన మండల పూజ సీజన్ ఈ నెల 26న సన్నిధానంలో జరిగే ప్రత్యేక పూజలతో ముగియనుంది. మండల పూజల్లో అత్యంత కీలకమైన ఘట్టం తంగఅంకి కార్యక్రమం. అరన్ములలోని పార్థసారథి ఆలయం నుంచి ఈ నెల 22న ఉదయం 7గంటలకు ప్రారంభంకానున్న తంగఅంకి రథం.. 25న సాయంత్రానికి శబరిమల సన్నిధానాన్ని చేరుకుంటుంది. ఇక గురువారం నుంచి భక్తుల రద్దీ పెరిగిందని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) అధికారులు తెలిపారు. గురువారం శరణ్‌గుత్తి నుంచి పంపావైపు కిలోమీటరు దూరంలో ఉన్న ట్రీక్లస్టర్ వరకు స్వాములు క్యూలైన్‌లో నిలబడ్డారని, రద్దీని నియంత్రించడానికి మారకుట్టం వద్ద క్యూలైన్‌ను 2-3 గంటలపాటు నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో కేరళీయులు కూడా మండలపూజకు వచ్చే అవకాశాలున్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అరుణ్ నాయర్ నేతృత్వంలో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో నిర్ణయించారు. "ఎక్కడికక్కడ ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరిస్తాం. అదనపు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తాం. తెలుగు, తమిళం, హిందీ సహా పలు భాషల్లో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశాం. వృద్ధులు, చిన్నారుల సౌకర్యార్థం నడపందల్ వద్ద ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి వారికి శీఘ్ర దర్శనానికి అనుమతిస్తున్నాం" అని ఆయన వివరించారు. కాగా అటవీ మార్గంలో విష కీటకాల వల్ల భక్తులకు ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతో.. నల్ల త్రాచు, త్రాచు, రక్తపింజర వంటి పాములను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు మోహరించాయి. పంపానదిలో కూడా పాముల బెడద ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా.. తిరువనంతపురానికి చెందిన బిజోయ్ అనే వ్యక్తి కుమారులు.. అభినవ్, అద్వైత్‌లు సన్నిధానం వద్ద 504 రూబిక్స్ క్యూబ్‌లతో అయ్యప్ప ప్రతిరూపాన్ని రూపొందించారు. ఈ చిత్రం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ చిన్నారులిద్దరూ అయ్యప్ప దీక్ష తీసుకుని.. మొదటిసారి శబరిమలకు రావడం గమనార్హం.!


రూబిక్స్‌క్యూబ్‌లతో అయ్యప్పను రూపొందిస్తున్న చిన్నారులు అభినవ్, అద్వైత్

వాట్సా‌ప్‌లోనూ చాట్‌జీపీటీ

- 18002428478 నంబరుతో చాట్ చేయొచ్చు
- వేరే యాప్, ఖాతాతో పనిలేకుండా వాడొచ్చు
- అందుబాటులోకి తీసుకొచ్చిన ఓపెన్ ఏఐ..!
- అయితే ప్రస్తుతానికి అమెరికా, కెనడాల్లోనే



న్యూఢిల్లీ, డిసెంబరు 19: ఇటీవలి కాలంలో విస్తృతంగా ప్రజాదరణ పొందిన కృత్రిమ మేధ వేదిక (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ప్లాట్‌ఫామ్) చాట్ జీపీటీ. దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మద్దతున్న ఓపెన్ ఏఐ రూపొందించిన ఈ చాట్ బాట్ మరింత అందుబాటులోకి రానుంది. ఇప్పటిదాక దీనిని వాడాలంటే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. ఇప్పుడు మాత్రం వాట్సాప్‌లోనూ చాట్ జీపీటీ సేవలను పొందే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రపంచవ్యాప్తంగా సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది ఓపెన్ ఏఐ. దీనికోసం ఇతర యాప్, ప్రత్యేక ఖాతా నంబరుతో పనిలేకుండా మనం కోరుకున్న సమాచారాన్ని తెలుసుకునేందుకు 18002428478 నంబరుతో చాట్ చేయొచ్చు. అయితే, దీనికి నిర్దిష్ట పరిమితి ఉంది. 18002428478 నంబరుకు కాల్ చేసి కూడా సేవ లు పొందే అవకాశం ఉంది. కానీ, ప్రస్తుతానికి ఈ సౌలభ్యం అమెరికా, కెనడాలకు మాత్రమే పరిమితం. ఇప్పటికే మెటా.. వాట్సాప్‌లో ఏఐ చాటాబాట్ సేవలను అందిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి పోటీగా ఓపెన్ ఏఐ కూడా రంగంలోకి దిగింది. 2024 సంవత్సరం మరొక 12 రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో.. '12 డేస్ ఆఫ్ ఓపెన్ ఏఐ అనౌన్స్‌మెంట్'లో భాగంగా గురువారం చాట్‌జీపీటీ వాట్సాప్ వినియోగాన్ని ప్రకటించింది.

కింగ్ చార్లెస్-3కి ప్రధాని మోదీ ఫోన్

- ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ

న్యూఢిల్లీ, డిసెంబరు 19: బ్రిటన్ రాజు చార్లెస్-3తో గురువారం ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ జరిగినట్లు మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కింగ్ చార్లెస్-3తో మాట్లాడటం ఎంతో సంతోషంగా ఉందని, భారత్-యూకే మధ్య వ్యూహాత్మక సంబంధాలు, కామన్వెల్త్ దేశాలు, వాటి మధ్య సంబంధాల బలోపేతం, వాతావరణ సమస్యలు తదితర అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. అనంతరం చార్లెస్-3 ఆరోగ్యం పట్ల ఆరా తీశారు. కాగా, వచ్చే ఏడాది ప్రారంభంలో కింగ్ చార్లెస్-3, కెమిల్లా దంపతులు భారత్‌కు రానున్నట్లు సమాచారం. సింహాసనాన్ని అధిష్ఠించిన తర్వాత ఇదే తొలి భారత పర్యటన కానుంది. అటు నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కూఫ్‌తోనూ మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వివిధ రంగాల్లో రెండు దేశాల మధ్య తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయాలపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు ప్రధాని తెలిపారు.

ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదుల హతం

న్యూఢిల్లీ, డిసెంబరు 19: జమ్మూ- కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో ఉగ్రవాదులకు రక్షణ దళాలకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులు హతమవ్వగా, ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని బెహిబాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి భద్రతా దళాలు, పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు రక్షణ దళాలపై కాల్పులకు తెగబడ్డారు. దాంతో భద్రతాసిబ్బంది ఎదురు కాల్పులు జరిపారు. కాగా, మృతులలో హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రసంస్థ కమాండర్ ఫరూక్ అమహ్మద్ భట్ ఉన్నారు.

లోకం తీరు



ఉపరాష్ట్రపతిపై అభిశంసన నోటీసు తిరస్కరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 19: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను పదవి నుంచి తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇచ్చిన అభిశంసన నోటీసు తిరస్కరణకు గురయింది. దీన్ని తిరస్కరిస్తున్నట్టు రాజ్యసభ వైస్‌చైర్మన్ హరివంశ్ గురువారం సభలో ప్రకటించారు. ధన్‌ఖడ్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నందువల్ల ఆయనను అభిశంసిస్తామని పేర్కొంటూ 60 మంది సభ్యులు ఈ నెల 10న నోటీసు ఇచ్చారు. ఆ నోటీసును రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి మోదీ సభలో ప్రవేశపెట్టారు. దీనిని అందుకోగానే ధన్‌ఖడ్ దానిని వైస్‌చైర్మన్‌కు అందజేశారు. తన స్థానం నుంచి తప్పుకొన్నారు. ఈ నోటీసుపై హరివంశ్ వ్యాఖ్యానిస్తూ ఇది అనుచితమైనది, ధన్‌ఖడ్ పరువుకు భంగం కలిగించేలా హడావిడిగా ఇచ్చినదని పేర్కొన్నారు. లోపభూయిష్టంగా ఉందని, రాజ్యాంగ వ్యవస్థను దెబ్బతీసేదని తెలిపారు. ఇందులో వాస్తవాలు లేవని, ధన్‌ఖడ్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేశారని చెప్పారు. ఉపరాష్ట్రపతిని అప్రతిష్ఠ పాల్జేయడానికి ఇచ్చిన ఈ నోటీసు ఆందోళనకరమని, ఇది పార్లమెంటు, సభ్యుల ప్రతిష్ఠకు భంగకరమని అన్నారు. అందువల్ల తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ ధన్‌ఖడ్ వ్యవహార శైలిని ఎత్తిచూపుతూ తాను గతంలో ఆయనకు లేఖ రాశారని తెలిపారు. తాను ప్రస్తావించిన అంశాలకు ఆయన కూడా అంగీకరించారని చెప్పారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు.. ధాన్యం రవాణాపై పంచాయితీ!

- కర్ణాటక రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా
- తమ ధాన్యాన్ని రానివ్వకపోవడంపై అభ్యంతరం
- తెలంగాణ రైతులనూ అడ్డుకుంటామని హెచ్చరిక

మహబూబ్‌నగర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తున్నందున.. ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడికి వచ్చి విక్రయించకుండా చూసేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నారాయణపేట జిల్లాకు కర్ణాటకతో సరిహద్దు ఉంది. అక్కడి నుంచి వస్తున్న ధాన్యాన్ని అడ్డుకునేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి వస్తున్న ధాన్యం లారీలను పోలీసులు సీజ్ చేస్తున్నారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య పంచాయితీగా మారింది. వాస్తవానికి కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల నుంచి కర్ణాటకలోని రాయిచూర్ వ్యాపారులు ఏటా ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఈ


కర్ణాటక సరిహద్దులోని శక్తినగర్ వద్ద ధర్నా చేస్తున్న రైతు నాయకులు

జిల్లాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరణ కంటే కర్ణాటక వ్యాపారులే అధిక మొత్తంలో కొంటారు. ఈ వానాకాలం ధాన్యం సేకరణ ఆలస్యం కావడంతో కర్ణాటక వ్యాపారులు కల్లాల వద్దే ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళ్లారు. రైతులకు ధర నచ్చి విక్రయిస్తుండడంతో ఇక్కడి అధికారులు కూడా అడ్డు చెప్పలేదు. అయితే ఆ కొనుగోలు చేసి తీసుకెళ్లిన ధాన్యం తిరిగి స్థానిక కొనుగోలు కేంద్రాల్లో రైతుల పేరుతో విక్రయిస్తున్నట్లు తెలియడంతో అధికారులు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇటీవల కృష్ణా మండలంలో 8 లారీలను సీజ్ చేశారు. ఆగ్రహించిన కర్ణాటక రైతు సంఘం నేతలు కృష్ణా బ్రిడ్జిపై కర్ణాటక సరిహద్దు శక్తినగర్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. తెలంగాణ నుంచి వచ్చే ధాన్యాన్ని తాము కూడా అడ్డుకుంటామని కర్ణాటక రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు చమరస పాటిల్ హెచ్చరించారు. గత నెల 29న రాయచూర్ నుంచి సోనామసూరి వడ్లు తీసుకొచ్చి రాయికోడ్ కొనుగోలు కేంద్రంలో అన్‌లోడ్ చేసి, తర్వాత నర్వ పీఏసీఎస్ బిల్లుతో లారీలో లోడ్ చేసి అక్కడే కొనుగోలు చేసినట్లుగా పత్రాలు సృష్టించి రైస్‌మిల్లుకు తరలించారు. ఈ నేపథ్యంలోనే అప్రమత్తమైన అధికారులు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేశారు. కానీ, కర్ణాటక రైతు సంఘం నేతలు మాత్రం తాము రైస్‌మిల్లులకు పంపిస్తున్నామని చెబుతున్నారు.

సీఎం బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవాలి : మాజీ మంత్రి ఎర్రబెల్లి

హనుమకొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేయడంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో కక్ష సాధింపులో భాగంగా బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. 2023లో దేశంలో అనేక నగరాలను కాదని హైదరాబాద్‌ను ఫార్ములా ఈ రేస్ కోసం ఎంచుకోవడం తెలంగాణకు గర్వకారణమన్నారు. ఈ రేస్ నిర్వహించిన ప్రముఖ నగరాల్లో న్యూ యార్క్, లండన్, బెర్లిన్, బీజింగ్ వంటి నగరాల సరసన హైదరాబాద్‌ను నిలబెట్టింది కేటీఆరేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ రేస్‌ను రద్దు చేసి కేటీఆర్‌పై అక్రమ కేసులు నమోదు చేసి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం రేవంత్‌రెడ్డి దుర్మార్గపు పాలనకు నిదర్శన మన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి డైవర్షన్ రాజకీయాలకు సీఎం తెరలేపినట్లు దయాకర్‌రావు ప్రకటనలో తెలిపారు.

ఈపీఎస్-95 పెన్షనర్లకు ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి: రాంరెడ్డి

హనుమకొండ టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం 95 (ఈపీఎస్) పెన్షనర్లకు రూ.7500 డీఏ చెల్లించాలని, దీనితో పాటు వారి జీవిత భాగస్వామికి ఉచిత ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని తెలంగాణ న్యాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామ రాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. దేశ వ్యాప్తంగా 78 లక్షల పెన్షనర్లు కేవలం రూ. వెయ్యితో దుర్భర జీవితాన్ని గడుపుచున్నారని, 10 ఏళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వం ఆశ చూపెడుతున్నా.. ఆచరణలో మాత్రం నెరవేరకపోవడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఆచరణ లేకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పెన్షనర్లను ఏకీకృతం చేసేందుకు ఈ నెల 26న హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో పెన్షనర్ల కేంద్ర సంఘ నేత అశోక్ రావత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పెన్షనర్ల మహాసభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా మధుమూర్తి

ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్‌కు బాధ్యతలు

అమరావతి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఎన్ఐటీ వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె.మధుమూర్తి పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. దీనిపై శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయనుంది. తొలినుంచీ జాతీయ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారి పేర్లనే ఉన్నత విద్యామండలి కోసం ప్రభుత్వం పరిశీలించింది. ఇటీవల రెండు పేర్లు తుది పరిశీలనకు రాగా వివిధ కారణాలతో పక్కనపెట్టారు. చివరికి మధుమూర్తి నియామకానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

గొల్లకురుమలను మోసగించిన కాంగ్రెస్

కవాడిగూడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గొర్రెలు, మేకల పెంపకందారులకు రూ.2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి గొల్ల కురుమలను మోసం చేశారని గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కిల్లె గోపాల్, ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ఆరోపించారు. ఎన్నికల్లో గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కువద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసినట్లే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు రూ.2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తమ మేనిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీని అమలు చేయడంలేదని తెలిపారు. అవినీతి సాకుతో ప్రభుత్వం గొర్రెలు ఇవ్వకుండా డీడీ డబ్బులు వెనక్కి ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలన్నారు.

సర్వేల్ గురుకులం ప్రిన్సిపాల్ సస్పెన్షన్

- వేడి రాగి జావ పడి ఇద్దరు విద్యార్థులు
- గాయపడిన ఘటనలో కలెక్టర్ చర్యలు

సంస్థాన్‌నారాయణపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గురుకుల పాఠశాలలో వేడి రాగి జావ మీద పడి ఇద్దరు విద్యార్థులకు గాయాలైన ఘటనలో ఆ గురుకులం ప్రిన్సిపాల్ వెంకటేశంపై సస్పెన్షన్ వేటు పడింది. విద్యార్థులకు అల్పాహారం అందించే విషయంలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం, పర్యవేక్షణాలోపం ఉందని భావిస్తూ ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం నాటి ఘటనపై సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, బీజేపీతోపాటు విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ ఐ, ఏఐవైఎఫ్, బీఆర్ఎస్వీ గురువారం పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించాయి. పాఠశాల లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం, తోపులాట జరిగి కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఆందోళనకారులు పాఠశాల ప్రధాన ద్వారంఎదుట బైఠాయించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థికి, వంట మనిషికి రూ.50లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఈ ఘటనపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారని, బాధ్యులపై చర్యలు తీసుకుంటారని ఆర్డీవో హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

నాగారం గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

- 33 మందికి వాంతులు, కడుపునొప్పి

కీసర రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు 33 మంది గురువారం అస్వస్థతకు గురయ్యారు. వారిని ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వారికి ఉదయం బోండా, మధ్యాహ్నం చికెన్‌కూరతో భోజనం పెట్టారు. సాయంత్రం స్నాక్స్ కింద బొప్పాయి ఇచ్చారు. కాసేపటికే విద్యార్థినులు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడడంతో పాటు వాంతులు చేసుకున్నారు. 9 మంది విద్యార్థులు మరీ నీరసంగా ఉండటంతో వారిని ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. మిగతావారిని చికిత్స అనంతరం హాస్టల్‌కు పంపించారు.

చిన్నారుల ప్రాణాలకు 'పెద్ద' ముప్పు!

పెద్దాపూర్ గురుకులంలో మళ్లీ పాము కలకలం.. 3నెలల క్రితం ఆరుగురు విద్యార్థులకు పాముకాటు.. ఇద్దరి మృతి

- తాజాగా మరో ఇద్దరు పిల్లల అస్వస్థత.. పాముకాటనే అనుమానం
- కోరుట్ల ఆస్పత్రిలో చికిత్స.. గురుకులం చుట్టూ పారిశుధ్య చర్యలు

జగిత్యాల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అసలేం జరుగుతోంది? పిల్లలు విష పురుగుల బారిన పడి మృతిచెందిన ఘటనలు వరుసగా జరుగుతున్నా యంత్రాంగంలో చలనం లేదెందుకు? మంచి చదువు అబ్బుతుందనే ఆశతో ఉన్న ఇంటిని.. కన్న తల్లిదండ్రులను వదిలేసి గురుకులానికి వస్తే ప్రాణాలే పోయేట్టున్నాయంటూ పిల్లలు భయం భయంగా ఉంటున్నారు. అటు..తల్లిదండ్రులు కూడా తమ పిల్లల గురించి ఎప్పుడెలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మూడు నెలల క్రితం ఆరుగురు విద్యార్థులు పాముకాటుకు గురవగా, వారిలో ఇద్దరు ప్రాణాలు విడిచారు. తాజాగా మరో ఇద్దరు పిల్లలు అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యారు. ఈ ఇద్దరినీ పాము కరిచి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత జూలై 27న పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి రాజారాం గుణాదిత్య (13)కి పాము కరవడంతో మృతిచెందాడు. అదే రోజు మరో ఇద్దరు విద్యార్థులు గణేశ్ (13), రాపర్తి హర్షవర్ధన్ (14) కూడా అస్వస్థతకు గురైనా చికిత్స అనంతరం కోలుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విద్యాసాగర్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేశారు. తర్వాత ఆగస్టు మొదటివారంలో ఆరో తరగతి విద్యార్థి ఎడమల అనిరుధ్ రెడ్డి (12), హేమంత్, మోక్షిత్ అనే విద్యార్థులను పాము కరిచింది. ముగ్గురినీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆగస్టు 9న అనిరుధ్ మృతిచెందాడు. చికిత్స అనంతరం


చికిత్స పొందుతున్న విద్యార్థి ఓంకార్ అఖిల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య ప్రసాద్

హేమంత్, మోక్షిత్ కోలుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాల జగిత్యాల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మహిపాల్ రెడ్డిలను కలెక్టర్ సత్య ప్రసాద్ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మెమోలు ఇచ్చారు. ఆగస్టు 14న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాఠశాలను సందర్శించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. తాజాగా బుధవారం పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మెట్‌పల్లి కి చెందిన ఓంకార్ అఖిల్ (14) అస్వస్థతకు గురయ్యాడు. పాముకాటుకు గురైనట్లు వైద్యులు అనుమానించి యాంటీవీనమ్ ఇంజెక్షన్లు ఇచ్చారు. కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మర్నాడు గురువారం అదే గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతున్న యశ్వంత్ (14) కూడా అస్వస్థతకు గురయ్యాడు. హుటాహుటిన యశ్వంత్‌ను కోరుట్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆ అబ్బాయి కూడా పాముకాటుకు గురైనట్లు వైద్యులు అనుమానించి యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు ఇచ్చి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అఖిల్, యశ్వంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాఠశాలను సందర్శించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ప్రిన్సిపల్ మాధవీలతను సస్పెండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం తోనే ఇద్దరు పిల్లలు అస్వస్థతకు గురయ్యారంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి-కోరుట్ల జాతీయ రహదారిపై బైఠాయించారు.

చుట్టూ చెత్తాచెదారం తొలగింపు

పెద్దాపూర్ గురుకులం ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు, గడ్డి, చెత్తాచెదారాన్ని తొలగించారు. పాడుబడ్డ బావిని, పెద్ద గుంతను పూడ్చివేశారు. పాఠశాల, కళాశాల, వసతి గృహాలు, బాత్ రూమ్‌లు మిగతా చోట్ల ఉన్న చెత్తను, గడ్డిని తీసివేయించారు. వినియోగంలో లేని రెండు రేకుల షెడ్డులను కూల్చివేశారు. అయితే అప్పట్లోనే గురుకులంలో అత్యవసర మందులు, పారామెడికల్ సిబ్బంది కోసం విద్యార్థుల వసతి గృహం వద్ద కాకుండా కొద్ది దూరంలో గల పాడుబడ్డ కట్టడం కేటాయించడంతో పిల్లలకు సత్వర సేవలు అందడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆగస్టు 13న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాఠశాలను సందర్శించారు. మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీనిచ్చారు. పాఠశాలలో అత్యవసర పనులకు రూ. 50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యాన్ని సహించం

- ఆస్తిపన్ను వసూళ్లలో శ్రద్ధ ఇతర విషయాలపై లేదు
- జీహెచ్ఎంసీ కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హైకోర్టు తేల్చిచెప్పింది. టోలిచౌకీ యూసుఫ్ టేక్డి నిజాం కాలనీలోని ఓ అక్రమ నిర్మాణానికి సంబంధించి అధికారులు సరిగా స్పందించకపోవడంపై జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రత్యక్షంగా హాజరుకావాలని హైకోర్టు గతంలో ఆదేశాలు జారీచేసింది. దాంతో.. జీహెచ్ఎంసీ కమిషనర్ గురువారం ప్రత్యక్షంగా జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. "ఆస్తిపన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ ఇతర విధులపై ఉండడం లేదు. రోజురోజుకూ జీహెచ్ఎంసీపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. వేలల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే.. కోర్టులకు వెళ్లినప్పుడు 'చూద్దాం లే' అన్నట్లు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. ప్రజలు ఫిర్యాదు చేసినా.. స్పందించడం లేదు" అంటూ ధర్మాసనం ఆక్షేపించింది. అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే పట్టించుకోని అధికారులను బాధ్యులను చేస్తూ.. వారిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సూచించింది. దిగువ కోర్టుల్లో జీహెచ్ఎంసీ తరఫున న్యాయవాదులు సరిగా ప్రాతినిధ్యం వహించకపోవడం వల్లే ఎక్స్‌పార్టీ ఆర్డర్లు జారీ అవుతున్నాయని పేర్కొంది. సుప్రీంకోర్టు, హైకోర్టుల నుంచి దిగువ కోర్టులకు మార్గదర్శకాలున్నాయని, దాంతో అంత తేలిగ్గా అక్రమ నిర్మాణదారులకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చే అవకాశాలు లేవని స్పష్టం చేసింది. 15 రోజులకోసారి క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహించి, అక్రమ నిర్మాణలపై సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించింది. నిర్లక్ష్యాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని.. అలా జరిగితే తప్ప.. అక్రమ నిర్మాణాలను అడ్డుకోలేమని అభిప్రాయపడింది. "అక్రమ నిర్మాణాలపై నామ మాత్ర చర్యలు తీసుకుంటున్నారు. నిర్మాణాలకు రెండు రంధ్రాలు పెట్టి, వెళ్లిపోతున్నారు. దీన్ని కూల్చివేత అంటారా?" అని ప్రశ్నించింది. అక్రమ నిర్మాణాలపై తీసుకుంటున్న చర్యలపై వచ్చేనెల 22 నాటికి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌కు ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

మణికొండలో హైడ్రా కూల్చివేతలు!

అపార్ట్‌మెంట్‌లో దుకాణాల నేలమట్టం.. అపార్ట్‌మెంట్ వాసుల ఫిర్యాదుతో హైడ్రా యాక్షన్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ(హైడ్రా) మణికొండలో అక్రమ కట్టడాలపై యాక్షన్‌లోకి దిగింది. నివాస క్యాటగిరీలో అనుమతులు తీసుకున్న ఓ అపార్ట్‌మెంట్‌లో.. వాణిజ్య పరంగా వాడుతున్న దుకాణాలను గురువారం స్థానిక మునిసిపల్ అధికారులతో కలిసి, కూల్చివేసింది. స్థానిక అల్కాపురి కాలనీలో 'అనుహర్ మార్నింగ్ రాగా' అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని మడిగెల్లో పలు వాణిజ్య దుకాణాలు కొనసాగుతున్నాయి. ఈ అపార్ట్‌మెంట్‌కు సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, ఐదంతస్తులకు నివాస క్యాటగిరీలో హెచ్ఎండీఏ అనుమతులున్నాయి. అయితే.. బిల్డర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో షెట్టర్లు ఏర్పాటు చేసి, దుకాణాలకు అద్దెకిచ్చాడు. ఇలా ఈ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఓ బ్యాంకు, ఇతర వాణిజ్య దుకాణాలున్నాయి. వీటి ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. వీటి వల్ల పార్కింగ్, ఇతర సమస్యలు ఎదురవుతున్నాయంటూ అపార్ట్‌మెంట్‌లోని 32 ఫ్లాట్ల యజమానులు మణికొండ మునిసిపాలిటీ, హెచ్ఎండీఏ, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మునిసిపల్ అధికారులు.. బిల్డర్‌కు నోటీసులు ఇచ్చారు. వాటికి సమాధానం రాకపోగా.. మడిగెల అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో హైడ్రా, మునిసిపల్ అధికారులు గురువారం ఉదయం రంగంలోకి దిగి, వాణిజ్య దుకాణాలను కూల్చివేశారు. పాత నిర్మాణాల జోలికి వెళ్లబోమని ఇటీవలే పేర్కొన్న హైడ్రా మణికొండలో ఏకపక్షంగా వ్యవహరించిందంటూ కూల్చివేతల సమయంలో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. కూల్చివేతకు గురైన ఓ దుకాణంలో కూరగాయలు విక్రయించే మహిళ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. దుకాణానికి ఆస్తిపన్ను, విద్యుత్తు బిల్లులను వాణిజ్య క్యాటగిరీలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. తమకు నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు జరిపారని ఆరోపించారు. కాగా, మణికొండ కూల్చివేతలపై వస్తున్న ఆరోపణలపై హైడ్రా కమిషనర్ స్పందించారు. "పరిశీలన జరిపి అక్రమ నిర్మాణాలని నిర్ధారించుకున్నాకే కూల్చివేశాం." అని వివరించారు.



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

రంగనాథ్ ఇంటి సమీపంలో.. 70 ఇళ్లకు నోటీసులు

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇంటికి సమీపంలో (అర కిలోమీటర్) ఉన్న పలు నివాసాలకు నోటీసులు జారీ అయ్యాయి. వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయం ఎదురుగా ఉన్న భూమిలోని నివాసాల యజమానులకు హైడ్రాలోని డిప్యూటీ సిటీ ప్లానర్ పేరిట హైడ్రా నోటీసులు అందాయి. ప్రభుత్వ స్థలం(యూసఫ్‌గూడ గ్రామం సర్వే నంబర్లు 45,46,47,48లోని 44.38 ఎకరాల భూమి)లో అక్రమంగా భవనాలు నిర్మించారన్న ఫిర్యాదుపై స్పందించిన అధికారులు 70 ఇళ్ల యజమానులకు నోటీసులిచ్చారు.

ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్‌కు ఒప్పుకోం

- కృష్ణా జలాల్లో వాటా తేలాకే 'అనుసంధానం' చేపట్టాలి.. కేంద్రానికి తెలంగాణ స్పష్టీకరణ
- త్వరలో రాష్ట్రాలతో టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ: కేంద్రం

హైదరాబాద్/అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి ఒప్పుకోబోమని తెలంగాణ స్పష్టం చేసింది. అక్కడ రిజర్వాయర్ కడితే సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం)పై ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం ఢిల్లీలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) వార్షిక సర్వసభ్య సమావేశం వర్చువల్ విధానంలో జరిగింది. ఆరు రాష్ట్రాలతో జరిగిన ఈ సమావేశానికి కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షత వహించగా ఆ శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఈఎన్‌సీ (జనరల్) జీ అనిల్ కుమార్, అంతరాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజనీర్ ఓరుగంటి మోహన్‌కుమార్, ఎస్ఈ సల్లా విజయకుమార్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం ప్రసాద్ పాల్గొన్నారు. ఇచ్చంపల్లి వద్ద రిజర్వాయర్ కట్టకుండా సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీలో 83 మీటర్ల పైన నిల్వ చేసిన నీటిని మాత్రమే, అదునా వానాకాలంలోనే తరలించాలని తెలంగాణ కోరింది. సమ్మక్కసాగర్ దిగువన ఉన్న ప్రాజెక్టులకు 152 టీఎంసీల అవసరాలు ఉన్నాయని తెలిపింది. అనుసంధానంలో తరలించే నీటిలో 50 శాతం (74 టీఎంసీల)ను కేటాయించాలని డిమాండ్ చేసింది. బెడ్తి-వారాదా (కర్ణాటక)లింకు కింద తరలించే 18 టీఎంసీల్లో 9 టీఎంసీలను కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. కర్ణాటక తన వాటా 16 టీఎంసీలను ఆల్మట్టి నుంచి తరలించడాన్ని ఒప్పుకోబోమని కూడా తెలంగాణ స్పష్టం చేసింది. కృష్ణా జలాల పంపిణీపై మరో ఆరు నెలల్లో తీర్పు వెలువడే


సమ్మక్క సాగర్ (ఫైల్)

అవకాశం ఉన్నందున అప్పటి దాకా అనుసంధానంపై ముందుకు వెళ్లరాదని కోరింది. అనుసంధానం కోసం సమ్మక్క కన్వేయర్ (నీటి తరలింపు వ్యవస్థ)ను వినియోగించాలని, గొట్టిముక్కల వద్ద రెండు రిజర్వాయర్లు కట్టించాలని కోరింది. ఈ సమావేశానికి కీలకమైన ఛత్తీస్‌గఢ్ దూరంగా ఉండిపోయింది. కాగా, గోదావరి-కావేరి అనుసంధానం వల్ల తమ రాష్ట్రానికి కలిగే ప్రయోజనమేమిటో స్పష్టంచేయాలని కర్ణాటక డిమాండ్ చేసిం ది. ప్రయోజనం పొందే తమిళనాడు మాత్రం త్వరగా ప్రారంభించాలని కోరింది. ఎంవోయూపై తమిళనాడు, పుదుచ్చేరి సంతకం చేశాయి. ఏపీ తరఫున పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతుండగా సాంకేతిక లోపం తలెత్తడంతో రాష్ట్రం వైఖరి కేంద్రానికి చేరలేదు. రాష్ట్రాలు అభిప్రాయాలను లిఖితపూర్వకంగా రెండ్రోజుల్లో అందజేయాలని పాటిల్ సూచించారు. గోదావరి జలాలను ఇచ్చంపల్లి నుంచి కావేరికి తరలించడం కాకుండా పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి తీసుకెళ్లాలని ఏపీ స్పష్టం చేయనుంది. త్వరలోనే ప్రభావిత రాష్ట్రాలతో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని పాటిల్ తెలిపారు.

లంచం తీసుకున్నా పని చేయట్లేదు!

- ఆర్ఐపై ఆర్డీవోకు రైతుల ఫిర్యాదు
- నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లిలో ఘటన

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ భూముల వివరాలు ధరణి పోర్టల్‌లో తప్పుగా నమోదు కావడంతో సరి చేయాలంటూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఆశ్రయిస్తే.. లంచం తీసుకోని కూడా ఆయన ఆ పని చేయడం లేదంటూ కొందరు రైతులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గురువారం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. తహసీల్దార్ కార్యాలయానికి దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి రాగా.. ఆయన సమక్షంలోనే ఆర్ఐ శీలం క్రాంతిని డబ్బుల విషయమై రమావత్ పాండుతోపాటు మరికొంత మంది రైతులు నిలదీశారు. ఎర్రగుంటతండాకు చెందిన రమావత్ పాండు భూమి వివరాలు మిస్సింగ్ సర్వేగా నమోదు కావడంతో.. ధరణి పోర్టల్‌లో అప్లై చేసుకొని ఆర్ఐ క్రాంతిని సంప్రదించాడు. అయితే భూ రికార్డులు సరి చేసేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసిన క్రాంతి.. చివరకు రూ.50 వేలు తీసుకొని పని చేసేందుకు అంగీకరించారు. దీంతో 2022 నుంచి విడతల వారీగా రూ.50 వేలను పాండు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. ఇటు మరో రైతు రమావత్ మకీలా వద్ద కూడా భూమి వివరాలు సరి చేసేందుకు రూ.5 వేలు క్రాంతి తీసుకున్నారు. అయినా ఆ రైతుల పని పూర్తి చేయలేదు. దీంతో ఆయన చుట్టూ తిరిగి విసిగి వేసారిన వారు మరి కొందరితో కలిసి ఆర్డీవో రమణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫోన్‌పే ద్వారా చెల్లించిన నగదు వివరాలను ఆయనకు చూపించారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తమకు న్యాయం చేసి క్రాంతిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

క్రికెట్ మేధావి

బ్యాటర్ బుర్రను చదివేసే మేధావి అతను. ఏ షాట్‌కు ఎలా వికెట్ పడగొట్టాలన్న ప్రణాళిక వేసుకునే ఇంజనీర్ అతను. బంతిపై పట్టు సాధించి వేళ్లతోనే మాయ చేసే మాంత్రికుడు. మొత్తంగా విభిన్నమైన అస్త్రాలతో ప్రత్యర్థి జట్టును కకావికలం చేయగల స్పిన్ యోధుడు. ప్రపంచ క్రికెట్‌లో అతికొద్ది మందికి మాత్రమే సాధ్యమయ్యే ఘనతలెన్నో అందుకున్న బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ ఆటను ముగించాడు. పద్నాలుగేళ్ల తన సుదీర్ఘ కెరీర్‌కు తెరదించుతూ ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగానే అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్టు ప్రకటించాడు.

అనిల్ కుంబ్లే రిటైరయ్యాడు.. హర్భజన్ సింగ్ కెరీర్ చరమాంకంలో ఉన్నాడు. మరి.. దశాబ్దాలుగా భారత బౌలింగ్‌కు ప్రధాన ఆయుధంగా ఉన్న స్పిన్ దళాన్ని ముందుకు నడిపించేదెవరు? కుంబ్లే, హర్భజన్‌ల వారసత్వాన్ని కొనసాగించేదెవరు? ఇలాంటి సందేహాలు ముసురుకున్న వేళ భారత జట్టులోకి వచ్చాడు అశ్విన్. ఆరంభంలో సాధారణ బౌలర్‌గానే కనిపించినా, రానురాను తన శైలిని అసాధారణంగా మార్చుకున్నాడు. తన అమ్ములపొదిలోని ఒక్కో అస్త్రాన్ని బయటకు తీస్తూ ముందుకు సాగాడు. ఒక ఓవర్‌లో ఆరు బంతులను ఆరు రకాలుగా వేయగలిగే నైపుణ్యాన్ని సంతరించుకొని బ్యాటర్లకు కఠిన పరీక్షలా నిలిచాడు. బంతిని మధ్యవేలితో పట్టుకొని సంధించే క్యారమ్‌బాల్‌తో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లను ముప్పుతిప్పలు పెట్టడం అశ్విన్‌కే చెల్లింది.

క్రీడాకారులు చిన్నప్పుడు ఆటలను కెరీర్‌గా ఎంచుకునే క్రమంలో చదువుపై అంతగా దృష్టి సారించరు. కానీ, అశ్విన్ అందుకు భిన్నం. క్రికెట్‌పై ఆసక్తి పెంచుకుంటూనే చదువులోనూ రాణించాడు. ఏకంగా ఇంజనీరింగ్ పట్టభద్రుడయ్యాడు. మొదట మీడియం పేసర్‌గా క్రికెట్‌లోకి అడుగుపెట్టినా, అమ్మ సూచనతో ఆఫ్ స్పిన్ బౌలింగ్‌కు మారడం, అతని కెరీర్‌కు ఎంతో దోహదం చేసింది. కెరీర్ ఆరంభంలో అశ్విన్‌కు మోకాలి నొప్పి సమస్యగా ఉండేది. ఆ సమయంలో అమ్మ..'పేస్ బౌలింగ్‌తో ఎక్కువగా ఎందుకు పరుగులు పెడతావు? కొన్ని అడుగులు వేసేలా స్పిన్ బౌలింగ్ వేయొచ్చు కదా' అని కుమారుడికి సలహా ఇచ్చింది. వెంటనే బౌలింగ్ తీరును మార్చుకొన్న అశ్విన్.. తర్వాతి కాలంలో స్పిన్నర్‌గా అత్యున్నతస్థాయికి ఎదిగిన తీరు అమోఘం. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో సిరీస్ ఆడుతున్న సందర్భంలో తన తల్లికి గుండెపోటు వచ్చిందని తెలియడంతో పరామర్శకు వెళ్లి వచ్చి మళ్లీ ఆడడం అశ్విన్ అంకితభావానికి నిదర్శనం.


'ప్రతి ఒక్కరికీ వీడ్కోలు సమయం వస్తుంది.. ఇప్పుడు నా వంతు' అని అశ్విన్ మీడియా సమావేశంలో హుందాగా వెల్లడించి ఆట నుంచి తప్పుకొన్నాడు. ప్రతి ఆటగాడు ఏదో ఒకరోజు గుడ్‌బై చెబుతాడు. ఇందులో విశేషమేమీ లేకపోవచ్చు. కానీ, తానెంచుకున్న ఆటపై అతని ప్రభావం ఎంత అనేదే ప్రధానాంశం. 106 టెస్టులాడిన అశ్విన్ 537 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు సాధించిన భారత బౌలర్ల జాబితాలో అనిల్ కుంబ్లే తర్వాత రెండోస్థానంలో ఉన్నాడు. ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన ఘనతను 37 పర్యాయాలు అందుకున్నాడు. టెస్టుల్లో పదకొండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నిసార్లు ఈ అవార్డు అందుకున్న ప్రథముడిగా శ్రీలంక దిగ్గజ బౌలర్ ముత్తయ్య మురళీధరన్‌తో సమంగా నిలిచాడు. స్పిన్నర్ అంటే తమకు అనుకూలమైన పిచ్‌లపై మాత్రమే ప్రభావం చూపగలరన్న ముద్రను చెరిపేసిన బౌలర్. బంతితోనే కాదు, బ్యాటుతోనూ సత్తాచాటిన ప్రతిభావంతుడు అశ్విన్. ఎన్నో సందర్భాల్లో తనదైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత జట్టు విజయాల్లో తోడ్పాటు అందించిన అతడు నాలుగువేలకు పైగా పరుగులు కూడా రాబట్టాడు. టెస్టుల్లో ఆరుసార్లు శతకాలు సాధించి ఆల్‌రౌండర్‌గానూ తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. ప్రత్యర్థి జట్టును జయించే క్రమంలో సారథి రచించే ప్రణాళికలు, వ్యూహాల్లో ఎన్నోసార్లు భాగస్వామి అయ్యాడు. ఆటను సునిశితంగా పరిశీలిస్తూ, వైవిధ్యమైన ఆలోచనలతో రాజుకు మంత్రి తరహాలో అండగా నిలవడంలోనూ అశ్విన్‌కు మరెవరు సాటిరారు. ఇలా తనకు అంది వచ్చిన ప్రతి పాత్రలో పూర్తిగా ఒదిగిపోయిన అతను ఆటకు వందశాతం న్యాయం చేశాడు. భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని లిఖించుకొన్నాడు. క్రికెట్ అభిమానుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయే ఆటను ప్రదర్శించి కెరీర్‌ను పరిపూర్ణంగా ముగించాడు.

మన రాజ్యాంగంలో భారతీయత...!

భారత రాజ్యాంగంలోని భారతీయత ఏమిటి? భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభలలో మన సంవిధానంపై జరిగిన చర్చ ఆ ఆసక్తికరమైన ప్రశ్నను పూర్తిగా ఉపేక్షించింది. పాలక పక్షానికే కాకుండా ప్రతిపక్షానికీ అది ఒక ఇబ్బందికరమైన ప్రశ్నే. లోక్‌సభ ఎన్నికలలో సొంత మెజారిటీని సాధించుకోలేకపోయిన నేపథ్యంలో ప్రస్తుత దశలో ఆ ప్రశ్నను లేవనెత్తడం అంత వివేకవంతమైన పనికాదని పాలక పక్షం తప్పక భావించి ఉంటుంది. ఈ కారణంగా భారతీయ జనతా పార్టీ తన భావజాల పరమైన ఉత్సాహాన్ని నియంత్రించుకుని రాజ్యాంగాన్ని ప్రశ్నించే పనిని పార్లమెంటు వెలుపల తన మేధో మద్దతుదారులు, సహ ప్రయాణీకులకు వదిలివేసింది; పార్లమెంటులో ప్రధానమంత్రి భారత రాజ్యాంగ పరిరక్షణకు తన నిబద్ధతను నొక్కి చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తిని పాటించడంలో తమ ప్రభుత్వం అద్వితీయంగా వ్యవహరిస్తోందని ఆయన వివరించిన తీరు ఒక నిరర్థక హాస్య సన్నివేశంగా పరిగణించాలి. ప్రతిపక్షాలకు ఆ ప్రశ్న సైద్ధాంతికంగా ఒక జటిల సమస్యగా, సాంస్కృతికంగా చమత్కారపూరితమైనదిగా అనిపించి ఉండవచ్చు. కనుకనే అవి ఆ ప్రశ్నను నిర్లక్ష్యం చేశాయి. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో సావర్కార్ గురించి ప్రస్తావించినప్పుడు ఆ ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు ఉద్యుక్తుడు అయినట్టు కనిపించాడు కానీ ఆయన దానిపై మనసు పెట్టలేదు. అలా ప్రస్తావించి ఇలా వదిలివేశారు. ఆ చర్చ యథావిధిగా రాజకీయ వాదోపవాదాలుగా, పరస్పరం బురదజల్లుకోవడంగా దిగజారింది.

పాలక ప్రతిపక్షాలు పట్టించుకోనంత మాత్రాన ఆ ప్రశ్న ప్రాధాన్యం కోల్పోతుందా? రాజ్యాంగం పట్ల భారతీయ జనతా పార్టీ కొత్త శ్రద్ధాసక్తులు, ప్రేమానురాగాలను చూసి మనం మోసపోకూడదు సుమా! మన రాజ్యాంగబద్ధ గణతంత్ర రాజ్యంపై కనిపించీ కనిపించకుండా జరుగుతున్న ఒక దాడి మధ్యలో మనం ఉన్నాం. మరి ఈ దాడికి రాజ్యాంగం న్యాయబద్ధతను ప్రశ్నించడం ఒక అనివార్యత. ఆ సంవిధాన భారతీయతను ప్రశ్నించడమనేది రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారి బలమైన ప్రధాన భావజాల అస్త్రం. సందేహం లేదు, అదొక ఆలోచనాత్మకమైన ప్రశ్న. నిబద్ధతతో దానిని తర్కించవలసి ఉంది. మన రాజ్యాంగాన్ని చాలవరకు మన వలసపాలకుల భాషలో ఆలోచించి రాయడం జరిగింది. ఆధునిక పాశ్చాత్య రాజ్యాంగవాద ఆలోచనాస్రవంతి నుంచి గ్రహించిన అంశాలతో భారత రాజ్యాంగ రచనా నిర్మాణం జరిగింది. ఆ రాజ్యాంగం 'భారతీయ సంప్రదాయానికి 'విరుద్ధమైనది'., 'విదేశీయమైనది' అని రాజ్యాంగ సభలోనే పలువురు సభ్యులు ఆక్షేపించారు. దాని 'భారతీయత' గురించి పలు ప్రశ్నలు అప్పుడే లేవనెత్తడం జరిగిందనే విషయాన్ని మనం మరువ కూడదు.

ఆధునికతావాద, విశ్వజనీన దృక్కోణం ఈ ప్రశ్నకు సబబైన సమాధానం కాబోదనే వాస్తవాన్ని కూడా అంగీకరిద్దాం. 'ఆధునిక భారత రాజ్యాంగం విధిగా భారతీయమైనదిగా ఎందుకు ఉండాలి?' అని ప్రశ్నించవచ్చు. అయితే ఇది ఆ ప్రశ్నకు మాటకు మాటమాత్రమే అవుతుంది. ఇటువంటి అనుచిత ప్రతినిందతో ప్రయోజనముండదు. ప్రతి రాజ్యాంగమూ తన సొంత సందర్భంలో సాంస్కృతిక వాస్తవికత అనే పరీక్షలో నిలబడాలి. ఈ ఆధునికతా ప్రతిస్పందన కూడా ప్రతికూలంగా పరిణమించవచ్చనే వాస్తవాన్ని విస్మరించకూడదు. ఆధునిక రాజ్యాంగ నిర్మాతలు గతం నుంచి పూర్తిగా వేరుపడడానికి తీవ్ర ఆసక్తి చూపారు. ఈ కారణంగానే అది భారతీయత నుంచి వేరుపడిందని, మన నాగరికతా విలువలకు పరాయిదిగా ఉన్నదనే భావన చాలా మందిలో ఏర్పడేందుకు దారితీసింది.



వలసపాలన అందించిన ఆధునికత ప్రభావంతో మన రాజ్యాంగం ఒక నవ్య సొంత భారతీయ ఆధునికతను నిర్మించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించింది. వివిధ లక్ష్యాల ఏకీకరణతో రూపొందిన ఒక కొత్త విశిష్ట మౌలిక శాసనమైన భారత రాజ్యాంగం మన దేశీయ ప్రతిభకు ఒక నిదర్శనం– అది చాలా ఆధునికమైనది, విలక్షణంగా భారతీయమైనది.

అసలు భారతీయత అంటే ఏమి కాదో మొదట చూద్దాం. భారత రాజ్యాంగం భారతదేశ గతం నుంచి ప్రభవించిందికాదు. రాజ్యాంగ నిర్మాతలు దానిని అలా ఉద్దేశించలేదు. 'విదేశీ'మైనది ఏదీ అంటకూడదు, సోకకూడదు అని కూడా వారు భావించలేదు దానితో ప్రభవించింది కానేకాదు. ఒక లిఖిత రాజ్యాంగం అవసరమైన ఆధునిక రాజ్య వ్యవస్థ సందర్భాన్ని వారు విస్మరించలేదు. ఈ రీత్యా భారత రాజ్యాంగం అనేది ఒక విరోధాభాస. అనూచానంగా వస్తున్న మన జీవనస్రవంతికి సంబంధించిన ఏదో ఒక లక్షణం ఉన్నంత మాత్రాన అది భారతీయమైనదని చెప్పడానికి వీలులేదు. రాజ్యాంగ లిఖిత ప్రతిపై భారతీయ ఇతిహాసాలు, పురాణ గాథలను చిత్రించిన బొమ్మలు దాన్ని భారతీయమైనది చేయలేదు. భారత శిక్షా స్మృతికి భారతీయ న్యాయసంహితగా పునః నామకరణం దాన్ని భారతీయమైనది చేయలేదు.



■ యోగేంద్ర యాదవ్

భారత రాజ్యాంగంలో భారతీయతకు అన్వేషణ రెండు రూపాలను తీసుకుంటుంది. ఒకటి మరో దానికంటే మరింత ఎక్కువగా మౌలికమైనది. అభ్యుదయ ఆకాంక్షాభరిత అవతారంలో ప్రామాణికతకు ఒక కొత్త నవీనత అవసరం.

భారతీయ తరహా రాజ్యాంగం అంటే పాశ్చాత్య దేశాల నుంచి స్వీకరించిన రాజనీతి చింతనను పూర్తిగా వదిలివేయవలసి ఉంటుంది. మన నాగరికతా వారసత్వం ప్రాతిపదికన రాజ్యాంగ సంస్థలను పూర్తిగా సరికొత్త రీతుల్లో నిర్మించుకోవలసి ఉంటుంది. గాంధీ తన 'హింద్ స్వరాజ్‌'లో కోరింది ఇదే. కనుకనే శ్రీమన్ నారాయణ్ లాంటి గాంధేయవాదులు భారత రాజ్యాంగం భారతీయ మేధాశక్తికి న్యాయం చేయలేదని వాపోవడానికి కారణమయింది. గత శతాబ్దిలో అమలులోకివచ్చిన ఏ కొత్త రాజ్యాంగమూ (ఇరాన్, బొలీవియాని మినహాయిస్తే) ఈ ప్రామాణికత పరీక్షకు నిలబడలేవు. ప్రత్యామ్నాయ రాజ్యాంగం కోసం అన్వేషణ సహేతుకమైన ఆకాంక్షే కావచ్చుగానీ, అటువంటి రాజ్యాంగానికి సుసంబంధమైన ముసాయిదా అనేది ఏదీ ఎవరి వద్దా లేదు. ఈ దృష్ట్యా సంవిధానపరమైన భారతీయత అనేది ఇంకా రూపుదిద్దుకుంటున్న గుణమే.

మరింత సాధ్యమైన వివరణ రచనాపరమైన మౌలికత. స్వీకరించి అంశాల పునర్ రూపకల్పనలో నవ్యదనం. భారత రాజ్యాంగ భారతీయతను ఈ దృష్ట్యా వివిధ గీటురాళ్లతో పరీక్షించవచ్చు: పాశ్చాత్య రాజ్యాంగ నిర్మాణ సంప్రదాయం నుంచి గ్రహించిన అనేక అంశాలను భారతీయ సందర్భానికి అనుగుణంగా ఎలా పునర్ సర్దుబాటు చేసి మార్చివేశారు? ఈ కొత్త ఏర్పాటు భారత నాగరికతా ప్రస్థాన ప్రశస్తతను ప్రతిబింబిస్తున్నదా? రాజ్యాంగానికి ప్రాతిపదికగా ఉన్న తాత్త్వికత మన మేధో సంప్రదాయాలతో ఏకీభవించేదిగా ఉన్నదా? ఈ రాజ్యాంగం పనిచేస్తున్న తీరు ఈ భావనలను ధ్రువీకరిస్తున్నదా?

ఈ సమంజసమైన, ఉపయుక్తమైన ప్రశ్నలను అడిగినప్పుడు భారత రాజ్యాంగంలోని భారతీయతను మనం చూడగలుగుతాము. మూడు సంవత్సరాల కంటే తక్కువ వ్యవధిలోనే రాజ్యాంగాన్ని రాసి ఉండవచ్చు. అయితే ఒక శతాబ్దికి పైగా సాగుతున్న ఆలోచనల ద్వారా అది రూపుదిద్దుకున్నది. సారాంశంలో రాజ్యాంగం 'ఆధునిక భారతీయ రాజకీయ చింతన' నుంచి రూపుదిద్దుకున్న మౌలిక శాసనం. ఆ సమున్నత ఆలోచనా స్రవంతి ఏ ఒక్క వాదం లేదా దృక్పథానికి పరిమితమైనది కానందున, భారత్ గురించిన విభిన్న పోటీదాయక దార్శనికతల మధ్య సమతుల్యతను మన రాజ్యాంగం ప్రతిబింబించింది. మన మేధో సంప్రదాయాల విభిన్న, బహుళ రీతుల పట్ల ప్రగాఢ అవగాహనతో అది పరిపుష్టమయింది. వలస పాలన అందించిన ఆధునికత ప్రభావంతో మన రాజ్యాంగం ఒక నవ్య సొంత భారతీయ ఆధునికతను రూపొందించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించింది. రాజ్యాంగ నిర్మాణాన్ని ప్రభావితం చేసిన సత్ సంకల్పమది. గత 75 సంవత్సరాలుగా న్యాయశాస్త్ర మీమాంస, న్యాయవివాదాల పరిష్కార అనుభవాలు భారత ప్రజలు– రాజ్యాంగం గురించి వినని వారితో సహా – ఈ భారతీయ రాజ్యాంగ నైతికతా స్పృహను కలిగి ఉన్నారని, దానికి నిబద్ధులయి ఉన్నారని చూపుతున్నాయి.

భారత రాజ్యాంగ భారతీయతా గుణం మీకు కనిపించదు. సుపరిచితాలు అయిన వివిధ లక్ష్యాలు, రీతి రివాజులను ఒక కొత్త విశిష్ట మౌలిక శాసనపత్రాన్ని రూపొందించేందుకు కలిపివేయబడ్డాయి. ప్రామాణిక సమాఖ్య రాజ్యానికి బదులుగా 'యూనియన్ ఆఫ్ ఇండియా'గా రూపకల్పన చేయడం ఆధునిక యుగ పూర్వపు రాజ్య వ్యవస్థ బహుళ అంతస్థులకు అనుగుణంగా ఉంది. యూరోపియన్ శైలిలో 'జాతి–రాజ్యం'గా కాకుండా 'రాజ్య–జాతి' (స్టేట్–నేషన్)గా జరిగిన నిర్మాణం సాంస్కృతిక, సామాజిక వైవిధ్యాన్ని సంపూర్ణంగా గౌరవించిన మన ప్రాచీన సంప్రదాయాన్ని ప్రతిబింబించింది. భారత రాజ్యాంగ లౌకికవాద లక్షణాలు అమెరికన్ లేదా ఫ్రెంచ్ తరహా లౌకికవాదానికి ప్రతిరూపాలు కావు; 'సూత్రబద్ధ దూరం'ను పాటించే భారతీయ తరహా లౌకికవాదం మైత్రీ సంప్రదాయం నుంచి స్ఫూర్తి పొందింది. సర్వ ధర్మ సంభవ అనే భావం ఆదర్శానికి అది సన్నిహితంగా ఉన్నది. భారత రాజ్యాంగ 'సామ్యవాద' లక్షణాలు కరుణ లేదా క్రియాశీల దయ అనే సూత్రానికి కొనసాగింపు. అవును, కుల వ్యవస్థ, అస్పృశ్యత దురాచారాల తిరస్కృతి సుదీర్ఘ సామాజిక, మత సంస్కరణల సంప్రదాయాల ప్రాతిపదికన జరిగింది.

భారత్‌లో పరంపర అనేది గతాన్ని పరిరక్షించుకోవడం గురించి కాదు, అది మన వర్తమానాన్ని పునర్ చైతన్యపరచుకుని, పునశ్శక్తిమంతం చేసుకోవడం గురించి. ముందటి తరాల నుంచి గ్రహించిన వివేకంలోని మంచిని స్వీకరించి, దానికి కొత్త గుణాత్మక రూపమివ్వడం, చెడు లేదా కాలం చెల్లిన దాన్ని త్యజించడం ఆధారంగా జరిగడమే పరంపర పరమార్థం. ఇదే మన రాజ్యాంగం చేసింది. భారత రాజ్యాంగ భారతీయత బ్రెడ్ పకోడా లాంటిదని చెప్పవచ్చు. విదేశీ తెల్ల రొట్టెను ప్రామాణికమైన భారతీయ ఆహారంగా మార్చివేసింది. లేదా, గ్రహించిన సాంకేతికతను భారతీయ స్ఫూర్తి, విలువలను ప్రతిబింబించే ఒక కళారూపాన్ని నిర్మించేందుకు ఉపయోగించే భారతీయ సినిమా లాంటిది. బ్రెడ్ పకోడా లేదా భారతీయ సినిమాలా భారత రాజ్యాంగమూ మన దేశీయ ప్రతిభకు ఒక నిదర్శనం– అది చాలా అధునికమైనది, విలక్షణంగా భారతీయమైనది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

బలమున్నా, లేకున్నా తగ్గేదిలేదు!

పార్లమెంటులో 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా ఎన్డీయే ప్రభుత్వం, ముఖ్యంగా బీజేపీ... అటు విపక్షాలకు, ఇటు మిత్ర పక్షాలక్కూడా తగ్గేదేలేదనే సంకేతం ఇస్తున్నది. మోదీ నేతృత్వంలో బీజేపీ మూడోసారి ప్రభుత్వం ఏర్పరిచినా, గత రెండు దఫాల మాదిరి పూర్తి మెజారిటీ దక్కక, మిత్రపక్షాలపై ఆధారపడిన పరిస్థితి. అయినా తన ఆత్మవిశ్వాసంలో ఏ మాత్రం తేడా రాలేదని చెప్పడానికి అన్నట్లు కేబినెట్ ఈ బిల్లుని ఆమోదించడం, పార్లమెంటుకి పంపించడం చకచకా జరిగిపోయాయి. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అన్నది బీజేపీ మ్యానిఫెస్టోలో ముఖ్యాంశం. కానీ దానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు జరపడానికి రెండింట మూడొంతుల సభ్యుల మద్దతు కావాలి. ఈ అంశంపై తన మిత్రపక్షాలకే ఏకాభిప్రాయం లేని స్థితిలో ప్రభుత్వం దీన్ని తలకెత్తుకుంటుందని సాధారణంగా ఎవరూ అనుకోరు. అయితే 'బలమున్నా, లేకున్నా తగ్గేదేలే' అని కమలం పార్టీ బలమైన సందేశం ఇవ్వడమే మంచిదని భావించింది. చూడాలి.. హిట్ అవుతుందో, లేదో?

జమిలి విధానంలో ఎన్నో సంక్లిష్టతలున్నాయి. లోతుగా ఆలోచించాల్సిన విషయాలున్నాయి. మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీ నివేదిక ఈ విధానానికి అనుకూలంగా ఉంది. అనుకూల వాదనల్లో ముఖ్యమైంది తక్కువ ఖర్చు. రెండోది మాటిమాటికీ ఎక్కడో ఒకచోట జరుగుతున్న ఎన్నికల వల్ల పాలనకు పడుతున్న బ్రేకులు. అయితే తక్కువ ఖర్చు అన్నదానికి బలమైన ఆధారాలు లేవు. మొదలైతేనే కదా అసలు లెక్కలు పైకి వస్తాయి. ప్రస్తుతానికి అంచనాలే. ఎన్నికల కమిషన్ 2029లో ఈ జమిలి విధానం పాటిస్తే అందుకు ఏడువేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు సమాచారం. అలాగే మాటిమాటికీ ఏదోచోట ఎన్నికల వల్ల ప్రభుత్వం పాలనపై ఫోకస్ పెట్టలేకపోవడం కూడా అధిగమించలేని అవరోధం కాకపోవచ్చు. కేంద్రంలో పాలక పక్షం ప్రతీ ఎన్నికా తమ ప్రతిష్ఠకు సవాలుగా భావించకుండా ఆయా ప్రాంతాల నాయకత్వానికి వదిలేస్తే సమస్యే కాదు. మిగతా పక్షాలకు పాలనతో ఎటూ సంబంధం ఉండదు.

ఇక ప్రతికూల వాదనలో ముఖ్యమైనది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని. ఖచ్చితంగా కాకపోయినా జమిలి విధానంలో రాష్ట్రాల కన్నా, కేంద్రం బలంగా మారే అవకాశాలు ఉన్నాయి. జాతీయ అంశాలు ప్రాధాన్యత పొంది, ప్రాంతీయ అంశాలు వెనక్కుపోతాయి. అది జాతీయ పార్టీలకు మేలు చేస్తుంది. భిన్న సంస్కృతుల, ప్రాంతాల నేపథ్యంలో కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య అధికారాల విభజన చక్కగా చెయ్యడం ద్వారా రాజ్యాంగం సమాఖ్య స్ఫూర్తిని చూపింది. అటు కేంద్రం మిథ్య అన్న భావం రాకుండా, ఇటు రాష్ట్రాలు కేవలం విడిభాగాలు అన్నట్టు కాకుండా... రెంటికీ ప్రాధాన్యత ఇస్తూ బ్యాలెన్స్ చేసింది. జమిలి ఎన్నికల విధానం వల్ల త్రాసు కేంద్రం వైపే మొగ్గుతుంది. ఇంకో భయం ఏమిటంటే రాష్ట్రంలో ఎవరికీ మెజారిటీ లేనప్పుడు స్థిరమైన గడువు వల్ల ప్రభుత్వాన్ని నిలుపుకోడానికి లేదా లాక్కోడానికి పార్టీల్లో అనైతికత పెరగొచ్చు అన్నది.

ఏది ఏమైనా ఈ అంశంపై పార్లమెంటులోనే కాకుండా పౌర సమాజంలో, వీధుల్లో విస్తృతంగా చర్చ జరగాలి. అన్ని కోణాల్ని స్పృశించాలి. ఒకే దేశం–ఒకే ఎన్నిక విధానం (టైమ్) కన్నా, ఎన్నికల విధానమే (క్వాలిటీ) సంస్కరింపబడాలి. డబ్బు, మద్యం సహా అడ్డదారులన్నీ మూసుకుపోయినప్పుడే నిజమైన ప్రజాభిప్రాయం వ్యక్తమౌతుంది. సరైన ఎన్నిక ద్వారానే ప్రజాస్వామ్యం శోభిల్లుతుంది.

– డి.వి.జి. శంకరరావు

రైతాంగ సమస్యలకు పరిష్కారాలు కనుగొందాం

1964లో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల, పశువైద్య కళాశాల; బాపట్లలోని వ్యవసాయ కళాశాల; తిరుపతిలోని వ్యవసాయ, పశువైద్య కళాశాలలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. 1990 దశకంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు. ఆ తరువాత కాలంలో ఈ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గృహ విజ్ఞాన, ఉద్యాన కళాశాలలు ఏర్పడ్డాయి. మరికొంత కాలం తరువాత మరికొన్ని వ్యవసాయ, పశువైద్య కళాశాలలు వచ్చి చేరాయి. ఆ తరువాత కాలంలో పెరుగుతున్న అవసరాలు, ఆకాంక్షల మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలుగా, వేటికవిగా మూడుగా విభజించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ఈ మూడు ఆరు అయ్యాయి.

విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు దేశ పరిపాలన రంగం మొదలుకుని బ్యాంకింగ్, వ్యవసాయం అనుబంధ రంగాల్లో విద్య, పరిశోధన, విస్తరణ రంగాల్లో తమదైన ముద్ర వేశారు. పలు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు, డీజీపీలు మొదలుకుని అన్ని సివిల్ సర్వీస్ విభాగాల్లో తామేంటో నిరూపించుకున్నారు. ఇక బ్యాంకింగ్ రంగంలో నాబార్డ్ చైర్మన్ నుంచి ఎస్‌బిఐ చైర్మన్ వరకు అత్యున్నత పదవుల్లో చరిత్ర సృష్టించారు. అంతర్జాతీయంగా శాస్త్ర, పరిశోధన రంగాల్లో ఆకాశమే హద్దుగా ఎదిగారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలో ఇక్కడి విద్యార్థుల ప్రతిభకు తిరుగే లేదు. ఇంకా ఎంతో మంది విద్యార్థులు వారి జీవన గమనంలో రాజకీయాల్లో ప్రవేశించి శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులయ్యారు. మంత్రి పదవులు నిర్వహించారు.

అంతులేని సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, విస్తరణవాదం కారణంగా ప్రపంచ భూసారం తగ్గి కనీస పోషకాలు లేని పంటలతో ప్రపంచ దేశాల ప్రజలు రోగనిరోధక శక్తిని కోల్పోతున్నారు. గత మూడు దశాబ్దాలలో ఐదు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యల పాలయ్యారు. సమాజంలో అనేక జీవన రంగాలలో అసహజ మరణాల పాలవుతున్నారు. వారిలో విద్యార్థులు, నిరుద్యోగులు కూడా గణనీయంగా ఉన్నారు. ఈ సమాజం మన అందరం జీవించడానికి, అసహజ మరణాల పాలు కాకుండా ఉండడానికి ఏమిచేయాలో మనందరం కలిసి ఆలోచించాలి. ఒక్క వాయు కాలుష్యం కారణంగా ఏటా 16 లక్షల మంది చనిపోతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ విషాదాల నివారణకు నడుం బిగించాల్సింది మనమే.

చదువు లక్ష్యం ప్రజలకు సేవ చేయడంగా ఉండాలి. సమాజానికి బాధ్యత వహించడం, మెరుగైన సమాజం నిర్మాణానికి కృషి చేయడం లక్ష్యం కావాలి. క్షీణిస్తున్న పర్యావరణం, మారుతున్న వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకుని మన రాష్ట్ర, దేశ రైతాంగానికి ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు సేవలు అందించాలి.

– పూర్వ విద్యార్థులు

అందుకో దండాలు అంబేడ్కరా!

'ట్రై నాట్ టు స్పిట్ ఆన్ సెవెన్'అంటూ ఈ రోజు ఉదయం మా ఇంటి ముందు ఒక పదేళ్ళ అమ్మాయి, అబ్బాయి ఒకరి తరువాత ఒకరు బిగ్గరగా ఉచ్చరిస్తూ కనిపించారు. పిల్లలకు దాని అర్థం తెలుసో తెలియదో.. కానీ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను దేశ ప్రజలు పదే పదే ప్రస్తావిస్తూ, ఆయన రచనలు, ఆలోచనలు, ఉద్యమాలు, ఆచరణ గురించి కొన్ని సంవత్సరాలుగా ఎక్కువగా మాట్లాడుతున్నారు. బాబాసాహెబ్ అంతరాల నిచ్చెనమెట్ల వ్యవస్థ దౌర్జన్యాలపై అవిశ్రాంత పోరాటం చేసిన యోధ. కరుణ! ప్రజ్ఞ! సమతలను సమాజం అవలంబించాలన్న నవ బౌద్ధుడు. బాబాసాహెబ్ అనుభవించిన అంటరానితనం, వివక్ష, తిరస్కారం, సంఘజీవన బహిష్కారం వందేళ్ళ నుంచీ మారలేదు. వివిధ రూపాల్లో కరుడుగట్టుకుపోయింది. పాలనా రంగం మతం ఊబిలో దిగబడి క్రూరంగా వ్యవహరిస్తోంది. రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చి తమ ధర్మం, మతం అంటూ దేశ ప్రజలను ఒత్తిడికీ, అలజడికీ గురిచేస్తున్నది. ఓట్ల కోసమైతే సమతా రాగం.. ఏరు దాటిన తరవాత వికృతమైన పరిహాసాలతో ప్రజలను పదే పదే అవమానించడం. ఎవరికి ఎక్కువ ప్రాధాన్యత జన సమూహాలు ఇస్తున్నాయో ఆ వ్యక్తులపై అసూయతో పాలకులు రగిలిపోతున్నారు. లౌకిక ప్రజాస్వామ్య స్ఫూర్తితో నడవలసిన రాజకీయ జనజీవన స్రవంతిని సమూలంగా కలుషితం చేసి, దారి మళ్ళించాలని కుట్రలు పన్నుతున్నారు.

అత్యున్నతమైన మన రాజ్యాంగాన్ని రచించిన మేధావి, అధ్యయనశీలి, ఆర్థికవేత్త, న్యాయశాస్త్ర కోవిదుడు, రచయిత బాబాసాహెబ్ అంబేడ్కర్. ఆయన పట్లా అక్కసేనా? అంత వెరుపా? దేశ ప్రజల మనోభావాలు ఎంతగా దెబ్బతింటున్నాయో పట్టించుకోరా.. నీచమైన మీ వికారాలు ఎంత రోత పుట్టిస్తాయో పట్టించుకోరా? అధికార బలం ఉందికదా అని తప్పుడు మాటలు మాట్లాడినా, ఆకాశాన్ని చూసి అంత ఎత్తా అని పైకి రాయి విసిరినా, ఏం జరుగుతుందో వివేకంతో ఆలోచించండి! మహాత్మా పూలేను తన గురువుగా భావించిన భారతరత్నపై మీ లోపల ఏ భావాలు ఉన్న నోరు పారేసుకుంటూ కన్నెత్తి చూసే దుస్సాహసానికి పూనుకొని మీ తలకు మీరే కొరివి పెట్టుకోకండి.

అందుకో దండాలు బాబాసాహెబ్ అంబేడ్కరా!

– అనిశెట్టి రజిత

కులగణన జరగాలి, వివరాలు తెలియాలి!

మాజీ డీజీపీ అరవిందరావు ఆంధ్రజ్యోతిలో కులగణనను వ్యతిరేకిస్తూ ఒక వ్యాసం రాశారు ('ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?' నవంబర్ 23, 2024). కులగణన చేయడం భారతీయ సమాజాన్ని విడగొట్టే కుట్రగా ఆయన అభివర్ణించారు. ఇది బ్రిటిష్ పాలకులు భారతీయ సమాజాన్ని విభజించటానికి వాడిన ఎజెండా లాంటిదని అన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, కులగణన జరిగితే సమాజంలో అల్లకల్లోలం ఏర్పడుతుందని అక్కసు వెళ్లగక్కారు. తన వాదనను సమర్థించుకోవడానికి అబద్ధాలు వల్లె వేశారు.

అరవిందరావు వర్ణవ్యవస్థ అనాదిగా ఉందని, అదేమీ భారతదేశ ప్రత్యేకత కాదని, ఇలాంటి వ్యవస్థలు ప్రపంచమంతా ఉన్నాయనీ అన్నారు. ఆయన చెప్పింది పాక్షిక సత్యమే. బ్రిటీషువారు వచ్చాకే భారత దేశంలో వర్ణవ్యవస్థ ఉనికిలోకి వచ్చిందనడం, బ్రిటిష్ వారు రాకముందు అస్పృశ్యత లేదనడం, చరిత్రను వక్రీకరించడమే.

బ్రిటీష వారికి నల్ల జాతీయులంటే చులకన భావన ఉండొచ్చు. దేశ సంపద కొల్లగొట్టి ఉండొచ్చు. ఉద్యమాలను అణచివేసి ఉండొచ్చు; కాని వారు తమ అవసరార్థం ఈ దేశ ప్రజలకు ఉపయోగపడే సంస్కరణలు అనేకం చేశారన్నదీ వాస్తవమే. వేల ఏండ్లుగా సాగుతున్న బ్రాహ్మణిజాన్ని, దాని ఆధిపత్యాన్ని దెబ్బతీసే విధంగా మూఢాచారాలను నిషేధించారు. 'సతీసహగమనం' రద్దు చేశారు. వర్ణాశ్రమ ధర్మానికి భిన్నంగా విద్యను ప్రజలందరికీ అందించే ప్రయత్నం చేశారు. విద్య అంటే మత గ్రంథాలు, పురాణాలు వల్లె వేయడం కాదని; లోకజ్ఞానాన్ని పెంచే లెక్కలు, సైన్సు, చరిత్ర, భూగోళం, సామాజిక శాస్త్రం వంటి వాటిని బోధనాంశాలుగా చేశారు. ఫలితంగానే పూలే, పెరియార్, అంబేడ్కర్ లాంటి మహనీయులు నాటి భారతీయ సమాజం నుంచి అంకురించిన విషయం అరవిందరావుకు తెలియనట్లు ఉంది.

కులవ్యవస్థ ఇస్లాం వచ్చాకో, క్రైస్తవం వచ్చాకో ప్రారంభమయినట్లు చెప్పడం మోసకారితనం. ఈ విషయంపై స్వామి వివేకానంద ఏమి చెప్పారో వినండి: "అస్పృశ్యులు అనబడే ప్రజలను ఈనాటి అధ్వాన్న స్థితికి దిగజార్చింది ఎవరు? ఎవరు దీనికి బాధ్యులు? దీనికి ఆంగ్లేయులు మాత్రం కారణం కాదు. అనేక పారమార్థిక, వ్యవహారిక సిద్ధాంతాలను కనిపెట్టిన హిందూమతంలోని కుటిలులే ఇందుకు కారణం". రామకృష్ణ మఠం ప్రచురించిన 'స్వామి వివేకానంద' పుస్తకంలోని 16వ పేజీలో ఈ విషయం స్పష్టంగా ఉంది.

వర్ణవ్యవస్థగా చెప్పబడేది కేవలం సమాజ అవసరాల కోసం, సౌలభ్యం కోసం ఏర్పడ్డ వృత్తుల విభజన మాత్రమేననీ; ఆ వృత్తులు వంశ పారంపర్యం కాదనీ; అక్కడ ఉచ్చం నీచం అంటరానితనం అంటూ తారతమ్యాలు లేవనీ; ఒక వృత్తి నుండి మరే వృత్తికైనా మారే స్వేచ్ఛ వుండేదనీ; ఎలాంటి వివక్షలు లేవనీ అరవిందరావు వాదన. ఆయన నిజంగానే ఆ వాదనను నమ్మేవారయితే మనుస్మృతినీ; రామాయణ మహాభారతాల్లో వర్ణవ్యవస్థకు అనుకూలంగా ఉన్న అంశాలను విమర్శించేవారు. మన సమాజంలోని వర్ణకుల వ్యవస్థకూ గ్రీస్ ఇంకా మరికొన్ని ప్రాచీన నాగరిక దేశాలకు చెందిన బానిస వ్యవస్థలకూ మౌలిక తేడాలున్నవి. ప్రధాన తేడా ఏమిటంటే అక్కడ దోపిడీ బానిసల పేరిట జరిగేది. ఇక్కడ వర్ణం, కులం ముసుగులో దోపిడీ జరిగింది. ఈ వ్యవస్థలను నిలబెట్టడానికి, దీర్ఘకాలిక ప్రయోజనాలను బలపర్చుకోవడానికి ఒక సైద్ధాంతిక, తాత్విక మత చట్రం నిర్మితమైంది. బయటి ప్రపంచ దేశాలలో కుల వివక్ష, అంటరానితనం, మైల సిద్ధాంతం వగైరాలేవు. అవి ఆర్థిక అవసరాల కొరకు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నిర్బంధ చట్టాలు మాత్రమే.

సామాజిక న్యాయం కావాలని, కులగణన జరగాలని జరుగుతున్న ఉద్యమాలు అరవిందరావు లాంటి వారిని కలవరపెడుతున్నాయి. కాబట్టే అబద్ధాలను అక్షరీకరిస్తున్నారు. కులగణనను ఆపడం ద్వారా ఆయా కులాలవారీ వివరాలు, వారి పరిస్థితీ తెలియకుండా చేయాలని అగ్రకుల సంపన్న వర్గాలవారు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక ఉద్యమకారులు, వామపక్ష వాదులు ఈ ప్రమాదాన్ని గుర్తించాలి.



దేవుడి నోటి నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని హిందువులు పవిత్రంగా భావించే గ్రంథాలన్నీ చెపుతాయి. శూద్రుల పట్ల వివక్ష పాటించాలని, దళితులను అంటరాని వారిగా చూడాలని, మహిళలను అణిచిపెట్టాలని చెపుతాయి. ఇతర వ్యవస్థలలో ఇది మనకు కనపడదు. కాని అరవిందరావు రెంటినీ ఒకే గాట కట్టి మాటల మాయ చేస్తున్నారు. యూరప్‌లో కూడా కులవ్యవస్థ ఉన్నట్లు, అది పారిశ్రామిక విప్లవం ద్వారా అంతమైనట్లు ఆధారం లేని వాదనలు చేస్తున్నారు.

కులగణన ద్వారా ప్రస్తుత ఆధిపత్య వర్గాలకు ప్రయోజనకారిగా ఉన్న వర్ణ, కుల వ్యవస్థలు నిర్వీర్యమవుతాయన్నది అరవిందరావు ఆందోళన. ప్రస్తుత నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియులకు ఎలాంటి ఇబ్బందులూ లేవు. చదువు, సంపదలు కింది కులాలకు నిషేధించి తాము సమాజంపై పెత్తనం చేస్తూ సుఖ సౌఖ్యాలు అనుభవించారు, ఇప్పటికీ అనుభవిస్తున్నారు. వారు ఈ సౌకర్యాలు కొనసాగాలనుకోవడం సహజం. మన సమాజంలో కులం కొందరికి వరమైతే, కోట్లాను కోట్ల మందికి అది శాపం! సంపన్నులంతా దాదాపు అగ్రకులాల నుండే ఉన్నారు. పేదలంతా దాదాపు ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల నుండే ఉన్నారు. కులం ప్రభావితం చేయని రంగమంటూ లేదు. ఒక ఉదాహరణ చూస్తే ఇదెంత వాస్తవమో గమనించవచ్చు. ఈ సంవత్సరం విడుదలైన ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం– భారతదేశంలోని వందమంది కోటీశ్వరులలో 88శాతం అగ్రకులస్థులే. జనాభాలో 15శాతం కూడా లేని అగ్రకులాలకు చెందినవారే సంపన్నుల్లో 88శాతం ఉన్నారు. మిగతా కులాలన్నింటి నుండి ఉన్న సంపన్నులు కేవలం 12శాతం మాత్రమే.

గత మూడు, నాలుగు తరాల నుండే బహుజన కులాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల వారు చదువుకొని విజ్ఞానవంతులవుతున్నారు. ఆర్థికంగా మధ్య తరగతి వర్గాలలోకి చేరగలుగుతున్నారు. చైతన్యవంతులు కాగలుగుతున్నారు. తరతరాలుగా తమ పూర్వీకులకు జరిగిన అన్యాయాలను గుర్తిస్తున్నారు. ఇప్పటికీ తాము అన్ని రంగాల్లో వెనుకబడిన విషయాన్ని గమనించగలుగుతున్నారు. జనాభాలో తాము ఎంత శాతం ఉన్నామో అంత మేరకు అన్ని రంగాలలో వాటా కావాలంటున్నారు. అనేక రూపాల్లో ఆ ఉద్యమాలు సాగుతున్నాయి. కులగణన జరిగితే వాస్తవాలు బయటికొస్తాయి.

సామాజిక న్యాయం కావాలని, కులగణన జరగాలని జరుగుతున్న ఉద్యమాలు అరవిందరావు లాంటి వారిని కలవరపెడుతున్నాయి. కాబట్టే అబద్ధాలను అక్షరీకరిస్తున్నారు. ఎవరూ కోరకున్నా పాలకులే ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం కులగణన చేపడుతున్నారని ఆక్రోశిస్తున్నారు. ప్రస్తుత సామాజిక వ్యవస్థ పట్ల అందరూ సంతృప్తికరంగా ఉన్నారని అవాస్తవాలు చెపుతున్నారు. ఎంత చదివినా, ఎంత పెద్ద పదవులు నిర్వహించినా తాము పుట్టిన సామాజిక, ఆర్థిక పునాదులు వదులుకోవడం ఎంతో కష్టమని అరవిందరావు గారి వ్యాసం చూశాక అర్థమవుతుంది.

వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లను కొనసాగించవద్దని, తీసివేయాలని అగ్రకుల సంపన్న వర్గాలవారు ఎప్పటి నుండో తమకున్న ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. కులగణనను ఆపడం ద్వారా ఆయా కులాలవారీ వివరాలు, వారి పరిస్థితీ తెలియకుండా చేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక ఉద్యమకారులు, వామపక్ష వాదులు ఈ ప్రమాదాన్ని గుర్తించాలి. ఈ కుట్రలను తిప్పికొట్టి బలమైన ఉద్యమాన్ని నిర్మించాలి.

● జి. రాములు
గౌరవాధ్యక్షులు, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం

అంబేడ్కర్‌పై 21 వారాల ప్రసంగాలు

సామాజిక చలనాలను గుర్తించడం, వాటిని అవగాహనలోకి తెచ్చుకోవడం, సమాజ సాహిత్యాల పరస్పర ప్రమేయాలను విశ్లేషించుకోవడం ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) ఆచరణలో ముఖ్యమైన అంశం. గత పదహారేళ్లుగా వివిధ మార్గాలలో ఆ పని జరిగింది. ఇప్పుడు అంబేడ్కర్ ఆలోచనల అధ్యయనం కోసం ప్రరవే సంకల్పించింది. అంబేడ్కర్ ఆలోచనల ప్రతిఫలంగా మనకి మిగిలిన వేల పేజీల రచనలు, వందల గంటల ఉపన్యాసాల నుంచి, వర్తమాన ప్రాసంగికతను కూడా దృష్టిలో పెట్టుకుని, 38 ప్రసంగ అంశాలను రూపొందించాం. ప్రారంభ, ముగింపు సభల్లో నేపథ్య, సారాంశ ప్రసంగాలు పది. ఇలా మొత్తంగా 48 ఉపన్యాసాలను 21 వారాల్లో వినబోతున్నాం. ఆలోచనాపరులు, అధ్యయనశీలురు అయిన 48 మంది వక్తలు అంబేడ్కర్ ఆలోచనల మీద సమగ్ర అవగాహనని కలిగించి, కొత్త చూపుని ప్రసరించడానికి సిద్ధమవుతున్నారు. డిసెంబర్ 22, 2024 నుంచి మే 18, 2025 వరకూ ప్రతీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచీ మధ్యాహ్నం 1 గంట దాకా అంతర్జాల మాధ్యమం ద్వారా ఈ అంబేడ్కర్ ఉపన్యాసాల సిరీస్ జరగనున్నది. మిత్రులందరినీ ఈ పరంపరలో భాగం కమ్మని కోరుతున్నాము. ఈ ప్రసంగాల సిరీస్‌లో భాగంగా– అంబేడ్కర్ ప్రాసంగికత, అంబేడ్కర్ జీవితం – వ్యక్తిత్వం, ఆచరణశీలి అంబేడ్కర్, జాతీయోద్యమ ఘట్టాల్లో అంబేడ్కర్ ఆలోచనలు, పూనా ఒడంబడిక, రాజ్యాంగం – రాజ్యాంగ సంస్కరణలు-అంబేడ్కర్, అంబేడ్కర్ చిన్న రాష్ట్రాలు, ముస్లిం మైనార్టీల గురించి అంబేడ్కర్... తదితర అంశాలపై ప్రసంగాలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
శుక్రవారం 20 డిసెంబరు 2024

ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు

- బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వలలో యువత
- అవసరాల కోసం రుణ యాప్‌లపై పేదల మొగ్గు
- అవసరాల కోసం ఉచ్చులో పడుతున్న జనం
- బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- మెసేజ్, లింక్‌లకు స్పందించొద్దని సూచన
- మోసపోతే 1930ను సంప్రదించాలని సలహా

7

జీవితాలతో 'సెల్'గాటం!





ప్రస్తుతం సెల్‌ఫోన్ మానవుడి దైనందిన జీవితంలో ఒక భాగమైంది. సెల్‌ఫోన్ లేనిదే గడపలేని పరిస్థితి నెలకొంది. చేసే పనిలో కొంత విరామం దొరికినా.. లేదా కాలక్షేపం కోసమైనా సెల్ ఫోన్ చూసుకునే రోజులున్నాయి. ఈ క్రమంలో కొందరు ఆన్‌లైన్‌లోకి తొంగిచూస్తున్నారు. బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, లింకులు, ఇన్వెస్ట్‌మెంట్, మోసపూరిత ఉద్యోగ ప్రకటనలపైకి దృష్టి మరల్చి జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. కొంతమంది యువత తల్లితండ్రులకు తెలియకుండానే వారి ఖాతాల్లోని డబ్బులను బెట్టింగ్, గేమింగ్‌లు, ఇన్విస్ట్‌మెంట్, ఉద్యోగం వస్తుందేమోననే ఆశతో మోసపూరితమైన ప్రకటనలకు ఆకర్షితులమవుతున్నారు. అందులో విడతల వారీగా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని తెలుసుకొని జరిగిన నష్టాన్ని పూడ్చలేక విగత జీవులుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో లింక్‌లు, యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. డబ్బు పోయిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. రూ.10 లక్షలకు పైగా మోసపోతే కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో, ఆలోపు అయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లలోనే ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు.

- వరంగల్ క్రైం

మూగబోయిన జానపద ఝరి

బలగం మొగిలయ్య కన్నుమూత

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. భార్యకు ఆర్థిక సాయం
- దుగ్గొండిలో ముగిసిన అంత్యక్రియలు

ఆయన గొంతెత్తితే గాన మాధుర్యమే.. జానపదాలు చెబితే గంటల తరబడి రెప్పవాల్చకుండా చూడాల్సిందే.. పద్యం అందుకుంటే గుండెలు గిల్లుమనాల్సిందే.. ఆయనే.. బుడిగ జంగాల సామాజిక వర్గానికి చెందిన పస్తం మొగిలయ్య. సంచలన విజయం సాధించిన బలగం సినిమాలో పతాక సన్నివేశంలో మానవ సంబంధాల ఔనత్యాన్ని వివరిస్తూ చేసిన ఆయన గానం ప్రేక్షకుల కంట తడిపెట్టించింది. బలగం సినిమాకు ఆ సన్నివేశమే హైలైట్‌గా నిలిచింది. దీంతో మొగిలయ్య పేరు తెలుగువారందరికీ సుపరిచితమైంది. అంతలా ప్రేక్షకులతో కన్నీరు పెట్టించిన మొగిలయ్య అనారోగ్యంతో గురువారం కన్ను మూశారు. స్వస్థలం దుగ్గొండిలో అంత్యక్రియలు ముగిశాయి.

- దుగ్గొండి

7





సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాట్ చైర్మన్ శివసేనారెడ్డి

నిష్ణాతులైన కోచ్‌లు తయారు కావాలి..

- ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచేలా క్రీడాకారులకు తర్ఫీదునివ్వాలి
- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడలు
- వర్చువల్‌గా పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒలంపిక్స్‌లో క్రీడల్లో పతకాలను తీసుకవచ్చే క్రీడాకారులను తయారుచేసే ప్రతిభ కలిగిన కోచ్‌లు రాష్ట్రం నుంచి అందుబాటులోకి రావాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) చైర్మన్ శివసేనారెడ్డి కోరారు. గురువారం హనుమకొండ జేఎన్‌ఎస్ క్రీడా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ సీఎం కప్ క్రీడాపోటీల ప్రారంభ కార్యక్రమానికి శివసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్య శారదతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం శివసేనారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి నిష్ణాతులైన కోచ్‌లను తయారు చేసి వారి ద్వారా క్రీడాకారులకు శిక్షణ ఇప్పించి ఒలంపిక్స్‌లో పతకాలను సాధించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలోని మాణిక్యాలను వెలికితీసి క్రీడల్లో రాణించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలను రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. సీఎం కప్ క్రీడాపోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన 10మంది క్రీడాకారులను ప్రత్యేక క్యాంపునకు ఎంపిక చేసి శిక్షణ అందించి ఏషియన్ గేమ్స్‌కు పంపిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలవైపు ప్రోత్సహించడంవల్ల చెడు అలవాట్లకు దూరమవడమే కాకుండా క్రమ శిక్షణ పెంపొందుతుందన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన జివాంజీ దీప్తి పారా ఒలంపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించి ఉన్నత శిఖరాలను చేరుకుందని గుర్తు చేశారు. ప్రతీ మండల, జిల్లా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో క్రీడా మైదానాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందించే విధంగా ప్రయత్నాలు చేపడుతామన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ములుగులో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తామని శివసేనారెడ్డి పేర్కొన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడానికి సీఎం కప్ వేదికగా మారిందన్నారు. ముంబయికి చెందిన క్రీడా నిపుణుల బృందం జేఎన్‌ఎస్‌ను సందర్శించి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ ఆధారంగా వారికి సలహాలు, సూచనలు, మెళకువలు నేర్పిస్తుందన్నారు. డీవైఎస్‌వో అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని జిమ్నాస్టిక్స్‌హాల్‌లో రాష్ట్రస్థాయి బాల బాలికల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి దస్రూ, డీఎస్‌ఏ కోచ్‌లు, పీటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్‌గా పాల్గొన్న ప్రజాప్రతినిధులు

హనుమకొండ జేఎన్‌ఎస్ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ సీఎం కప్ క్రీడాపోటీల ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే వర్చువల్‌గా పాల్గొన్నారు. మైదానం లో ఏర్పాటు చేసని స్ర్కీన్‌లో వర్చువల్‌గా వీడియో ద్వారా మాట్లాడారు. రెవెన్యూ, హౌజింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. క్రీడల వల్ల నాయకత్వపు లక్షణాలు పెంపొందుతాయన్నారు. పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. సీఎం కప్ క్రీడలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఓరుగల్లులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారని కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న జిమ్నాస్టిక్స్ పోటీల్లో 200మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారన్నారు. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి దోహపడుతాయన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం..

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ
- ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతుల స్వీకరణ

6



ఆజంజాహీ స్థలం కార్మికులకే చెందేలా చూస్తా..

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు
- యూనియన్ కార్యాలయ స్థలంలో పనుల నిలిపివేత

6



కార్మిక భవనం వెంటనే నిర్మించాలి

- కబ్జాదారులకు అండగా అధికార పార్టీ నేతలు
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



కార్మిక భవనానికి శంకుస్థాపన చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
- అనుమతుల రద్దు కోసం కమిషనర్‌కు నేతల వినతి

రైల్వే స్టేషన్‌లో పనులు వేగవంతం చేయాలి

- సికింద్రాబాద్ డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్
- వరంగల్‌లో రైల్వే అధికారుల క్వార్టర్లు ప్రారంభం



వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైల్వే ఉద్యోగుల క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం

గిర్మాజిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమృత్‌భారత్ అభివృద్ధిలో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ భరతేష్ కుమార్ జైన్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన విజయవాడ - కాజీపేట రైల్వే మార్గంలోని వివిధ అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులను డీఆర్‌ఎం తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక రైలులో వరంగల్‌కు చేరుకున్న డీఆర్‌ఎం.. వరంగల్ రైల్వేస్టేషన్‌లో రూ.4కోట్లతో నిర్మించిన తొమ్మిది రైల్వే అధికారుల క్వార్టర్లను రాత్రి ప్రారంభించారు. ఆర్పీఎఫ్ బ్యారక్ వెనుక నిర్మించిన టైప్ 2 క్వార్టర్లు 4, టైప్ 3 క్వార్టర్లు నాలుగింటిని ప్రారంభించారు. అక్కడే కొన్ని మొక్కలు నాటారు. అలాగే పీడబ్ల్యూఐ అధికారి టైప్ 4 క్వార్టర్‌ను ప్రారంభించారు. నాలుగో ప్లాట్‌ఫామ్ నుంచి నిర్మిస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మొదటి ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన జనరల్ ప్రయాణికుల విశ్రాంతి మందిరాన్ని పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న కోచ్ రెస్టారెంట్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి సత్వరం ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా పనులు వేగవంతం చేయాలని చెప్పారు.

అనంతరం డీఆర్‌ఎం జైన్ మాట్లాడుతూ.. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను మే నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైల్వేస్టేషన్‌లోని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసుస్టేషన్లను ప్లాట్‌ఫామ్ లెవెల్‌కు పెంచి నూతనంగా నిర్మించనున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులు అలస్యం కాకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఆర్‌ఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీఈఎన్ (సౌత్) దినకర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వై.బాలాజీ కిరణ్, వరంగల్ సీసీఐ రాజ్‌గోపాల్, ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్సైలు వెంకటేశ్వర్లు, మోహినుద్దీన్, వివిధ విభాగాల రైల్వే అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

హసన్‌పర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు హాస్టల్స్ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రైవేటు హాస్టల్స్ యజమానులకు సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా హనుమకొండ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక భీమారం శుభం కల్యాణ వేదికలో హనుమకొండలోని ప్రైవేటు హాస్టల్స్ యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా హాస్టల్‌కు వచ్చిపోయే వారి వివరాలను ఎప్పటికప్పుడు నోట్ చేసుకోవాలని, అంతేకాకుండా హాస్టల్స్‌లో ఉండే వారి దినచర్యపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వారిని బయటికి వెళ్లేందుకు అనుమతించవద్దని, వీరి కోసం వచ్చే వారి గురించి తగిన సమాచారం తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో సమస్యలు ఉంటే ఈ నెల 31 వరకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి నుంచి హాస్టల్స్ ముమ్మరంగా తనిఖీలు చేస్తామన్నారు. పోలీసుల సూచనలు పాటించని హాస్టల్స్‌పై చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ భట్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సతీష్, సుంకరి రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

- వరంగల్‌లో ప్రజాసంఘాల మండిపాటు
- బల్దియా ఆవరణలో నిరసన



బల్దియా ఆవరణలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ పార్లమెంట్ సాక్షిగా అనుచిత వాఖ్యలు చేసిన దేశ హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వామపక్ష కార్మిక ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా దేశంగా రాజ్యాంగబద్ధంగా కొనసాగే పార్లమెంట్‌లో రాజ్యాంగ రచనకు ప్రాణం పోసిన అంబేద్కర్‌కు గౌరవం ఇవ్వని అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టాలని బీజేపీ ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో...

ఆ స్థలం మిల్లు కార్మికులకే చెందేలా చూస్తా..

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు
- యూనియన్ కార్యాలయ స్థలంలో పనుల నిలిపివేత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండా మురళీధర్‌రావు

వరంగల్‌సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూని యన్ కార్యాలయం స్థలంలో వస్త్ర వ్యాపారి చేయిస్తున్న పనులను వెంటనే నిలిపివేయించి ఆ భూమిని మిల్లు కార్మికులకే చెందేలా చూస్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు స్పష్టం చేశారు. గురువారం ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు వస్త్ర వ్యాపారి కాసం ఓంనమశ్శివాయ ఫోన్ చేసి పూజా కార్యక్రమానికి ఆహ్వానించారన్నారు. ముందు అంతా టెంట్లు వేయడంతో స్థలాన్ని సరిగ్గా గుర్తించలేకపోయానన్నారు. మరుసటి రోజు కార్మికుల భూమి అని కార్మికవర్గాలు ఆందోళన చేస్తుంటే.. ఏం జరిగిందని ఆరా తీశానన్నారు. దీంతో వారు కాగితాలను చూపించారని చెప్పారు. ఆ కాగితాల్లో ఎక్కడ కార్మికులదిగా కనిపించలేదని, అయినా తాను కార్మికుల పక్షాన ఉండే వాడిని కాబట్టి వాళ్లకు న్యాయం చేయడం తన బాధ్యత అని అన్నారు. ఈ మేరకు సర్వే చేయాలని తహసీల్దార్ ఎక్బాల్‌కు తెలిపామన్నారు. సర్వేలో ఎలా వచ్చినా.. అవసరమైతే తాను కొనుగోలు చేసైనా ఆ భూమిని కార్మికులకు చెందేలా చూస్తానని కొండా మురళి హామీ ఇచ్చారు. ఆ భూమిలో ఎలాంటి పనులు జరుగకుండా నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ ఎక్బాల్‌కు చెప్పారు. దీంతో తహసీల్దార్ మిల్లు కార్మికుల యూనియన్ కార్యాలయ స్థలంలో ఎలాంటి పనులు జరుగకుండా నిలిపివేయించారు.

'అజాంజాహి' వివాదంలో కీలక మలుపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



యూనియన్ కార్యాలయ స్థలంలో వస్త్ర వ్యాపారి చేయిస్తున్న పనులను నిలిపివేయించిన తహసీల్దార్

వరంగల్‌సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజులుగా తీవ్ర చర్చనీయాంశమైన వరంగల్‌లోని అజంజాహి మిల్లు కార్మిక భవనం వివాదంలో కీలక మలుపు తిరిగింది. 75 ఏళ్ల నుంచి మిల్లు కార్మికులు నిర్మించుకున్న యూనియన్ కార్యాలయ భవనం, స్థలంలో ఓ వస్త్ర వ్యాపారి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పూనుకున్నారు. ఆ భూమి పూజా కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురలీధర్‌రావు పాల్గొనడం రాజకీయ దుమారాన్ని రేపింది. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి కార్మికుల పక్షాన నిలిచి.. 'నాడు తప్పు.. నేడు ఒప్పు.' 'ఓరుగల్లులో అజంజాహి రగడ' కార్మికుల స్థలంలో భూమి పూజ, ఆ భూమి కార్మికులదే అంటూ.. వరుస కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నిఘా విభాగంతో మిల్లు భూమికి సంబంధించిన నివేదికను తెప్పించుకున్నారని.. ఆ తర్వాత సీఎం ఆదేశాల మేరకు కొండా మురళీధర్‌రావు యూ టర్న్ తీసుకున్నారని తెలుస్తోంది. అందులో భాగంగానే గురువారం ఓసిటీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి కార్మికులకే ఆ స్థలం దక్కేలా చూస్తానని, ఆ స్థలంలో వస్త్ర వ్యాపారి చేయి స్తున్న పనులను వెంటనే నిలిపివేయించి ఆ భూమిని మిల్లు కార్మికులకే చెందేలా చూ స్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు స్పష్టం చేశారు. తాను హైదరాబాద్‌లో ఉన్నప్పు డు ఫోన్ చేసి పూజా కార్యక్రమం ఉంది రమ్మంటే వెళ్లానే తప్ప వ్యాపారికి ఏదో లాభం చేకూర్చాలని కా దని చెప్పారు. ఏదేమైనా తాను కార్మికుల పక్షాన ఉండే వ్యక్తినని, వారికి న్యాయం చేయడం తన బాధ్యతన్నారు. వెంటనే సర్వే చేయాలని తహసీల్దార్‌కు చెప్పామని, సర్వేలో ఎలా వచ్చినా.. అవసరమైతే తాను కొ నుగోలు చేసైనా ఆ భూ మిని కార్మికులకు చెందేలా చూస్తానని స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ నాయ కులు కూడా 'ఆంధ్రజ్యోతి' అక్షర కృషి ప్రశంసించారు.

'ఆంధ్రజ్యోతి'కి కార్మికుల సలాం

మిల్లు కార్మికుల యూనియన్ స్థలంలో ఓ వస్త్ర వ్యాపారి అక్రమంగా భవన నిర్మాణ పను లు చేపడుతున్న క్రమంలో తమ పక్షాన 'ఆంధ్రజ్యోతి' అక్షరపోరాటం చేసిందంటూ కార్మికులు అభినందనలు తెలిపారు.

కార్మిక భవనానికి శంకుస్థాపన చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



బల్దియా కమిషనర్ అశ్వినికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ శ్రేణులు



మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

మిల్స్‌కాలనీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అజాంజాహి మిల్లు కార్మికుల స్థలంలో కార్మిక భవనానికి శంకుస్థాపన చేయిస్తేనే మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాటలు విశ్వసిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు స్పష్టం చేశారు. గురువారం ఓసిటీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు న్యాయం చేస్తానని మురళీ చెప్పడం సంతోషమే అయినా రెండు మూడు రోజుల్లో అదే స్థలంలో కార్మిక భవనం నిర్మాణానికి నిధులు తెప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల స్థలంలో భూమి పూజ చేసిన వ్యాపారి తప్పుడు పత్రాలను రద్దు చేయాలన్నారు. ఆ భూమిపూజలో కొండా మురళి పాల్గొనడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికైనా మంత్రి సురేఖ కార్మిక భవనానికి నిధులు సమకూర్చి స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. అనంతరం బీజేపీ నాయకులు మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాజేస్తున్న వారికి వంతపాడటం సబబు కాదన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని రక్షించేందుకు కార్పొరేషన్, కుడా, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులకు అనుమతులిస్తున్న కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు తీరును తప్పుబట్టారు. కార్మికులు, ప్రజలకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, నాయకులు రామగళ్ల పరమేశ్వర్, వంగాల సమ్మిరెడ్డి, బైరి మురళీకృష్ణ, కాసు శిల్ప, సిద్ధం నరేష్, రఘునారెడ్డి, రంజిత్‌కుమార్, మహేష్, మార్టిన్ లూథర్, నాగరాజు, అజయ్, రాజు, సురేష్, శ్రీనాథ్, క్రాంతి, హరీష్, శ్రీనివాస్, నాగార్జునపాల్గొన్నారు.

షాపింగ్ మాల్ అనుమతులు రద్దు చేయాలి

అజంజాహి మిల్లు కార్మికుల స్థలంలో షాపింగ్‌మాల్ నిర్మాణం కోసం ఇచ్చిన అనుమతులు సత్వరమే రద్దు చేయాలని బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బీజేపీ శ్రేణులతో కలిసి గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మిక యూనియన్ భవన్ కూల్చివేసి షాపింగ్‌మాల్ నిర్మాణం చేయడాన్ని తప్పుబట్టారు.

అక్రమార్కులు, భూకబ్జాదారులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రావుల కిషన్, కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, చాడ స్వాతి, జలగం అనిత, బైరి లక్ష్మి, రావుల కోమల, గుజ్జుల వసంత, ఆడెపు స్వప్న, గందె కల్పన తదితరులు పాల్గొన్నారు.

'అజాంజాహి'లో కార్మిక భవనం నిర్మించాలి

కార్మికులకు బీఆర్ఎస్ మద్దతు : మాజీ ఎమ్మెల్యే నరేందర్

కరీమాబాద్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): అజాంజాహి మిల్లు స్థలంలో కార్మిక భవనం నిర్మించాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. అజాంజాహి స్థలంలో కార్మిక భవనం నిర్మించాలని, కార్మికులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. కొంతమంది భూకబ్జాదారులకు అధికార పార్టీ నాయకులు అండగా ఉంటున్నారని ఆరోపించారు. అజాంజాహి స్థలాన్ని కబ్జా చేసి అమ్మకానికి పెట్టారని, నగరంలోని ఓ వస్త్ర వ్యాపారి ఆ స్థలాలను కొనుగోలు చేయగా, అధికార పార్టీ నాయకులు భూమి పూజకు హాజరవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మళ్లీ.. తమకు ఏం తెలియదంటూ అమాయకంగా సమావేశాలు ఏర్పాటు చేసి కార్మిక పక్షపాతిగా చెప్పుకోవడం విస్మయానికి గురిచేస్తోందన్నారు. ఈ స్థలాల విషయంలో గతంలో కబ్జాకు పాల్పడుతున్నానని తనపై బురద జల్లారన్నారు. నరేష్‌రెడ్డి అనే వ్యక్తి నగరంలో పలు చోట్ల కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. నరేష్‌రెడ్డి వద్ద గత సంవత్సరం నగరంలోని ఓ వస్త్రవ్యాపారి అజాంజాహి స్థలాలను కొనుగోలు చేశారన్నారు. రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకులు కబ్జాదారులతో కలిసి తతంగమంతా నడిపిస్తున్నారన్నారు. వెంటనే అజాంజాహి మిల్లు స్థలంలో కార్మిక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు కొంతం మోహన్, కుందారపు రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.రమేష్ బాబు, గోరంట్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బల్దియా ఇచ్చిన అనుమతులు రద్దు చేయండి

కమిషనర్‌కు వరంగల్ ప్రజాసంఘాల వినతి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అజంజాహి మిల్లు కార్మిక సంక్షేమ సంఘం భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించడానికి బల్దియా కార్యాలయం టౌన్‌ప్లానింగ్ నుంచి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని వరంగల్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో వరంగల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి, జిల్లా నాయకుడు కుమార్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు నలిగంటి రత్నమాల, పౌరహక్కుల సంఘం నాయకుడు కాంపెల్లి ప్రవీణ్, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసి) నాయకులు సుమన్, సీపీఐ యూ (ఎంఎల్) నాయకుడు జగదీశ్వర్, గంగుల దయాకర్, ఐఎఫ్‌టీయూ నాయకుడు తిరుమల శ్రీనివాస్, ఐతం నరేష్‌లు ఉన్నారు.

దేశప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

(5వ పేజీ తరువాయి)

చూస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ కపట నాటకాలు ప్రజలు చూస్తున్నారని అన్నారు. మనువాదులకు వ్యతిరేకంగా అంబేద్కర్‌వాదులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బల్దియా జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదపుటంచులో ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఏకమైతే తప్ప రిజర్వేషన్ ఫలాలు అందుకోలేమని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ప్రజాస్వామ్య ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్ఎస్ జిల్లా నాయకుడు కుమార్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు నలిగంటి రత్నమాల, మున్సిపల్ జేఏసీ నాయకులు ఏల్పుల ధర్మరాజ్ యాదవ్, పౌరహక్కుల సంఘం నాయకుడు కాంపెల్లి ప్రవీణ్, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) నాయకులు సుమన్, సీపీఎం నాయకుడు సింగారం బాబు, సీపీఐ నాయకులు పనాస ప్రసాద్, జాక్ నాయకుడు బాచీ, టీఎమ్మార్పీఎస్ నాయకులు బొక్క ఏలియా, సీపీఐ యూ (ఎంఎల్) నాయకుడు జగదీశ్వర్, గంగుల దయాకర్, ఐఎఫ్‌టీయూ నాయకుడు తిరుమల శ్రీనివాస్, ఐతం నరేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- హనుమకొండ కలెక్టరేట్‌లో 135 వినతులు స్వీకరణ



కమిషన్‌కు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపిస్తున్న పంబాల కుల వృత్తి కళాకారుల సంఘం నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలు, విన్నపాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్డ్ కులాల్లో వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతులు, అభ్యర్థనలు వచ్చాయన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కుల సంఘాల అభ్యర్థనలు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేసి న్యాయం చేస్తామన్నారు.

స్వాగతం పలికిన ఇన్‌చార్జి కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్న ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సత్యశారదా దేవి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఘనంగా సన్మానించారు. వంరగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల నుంచి ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర, ఉమ్మడి జిల్లా కమిటీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయాలని వినతులు అందజేశారు. జాతీయ మాల మహానాడు నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయొద్దని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా అత్యంత వెనుకబడిన పంబాల కులాన్ని ఎస్సీ ఏ గ్రూపులో చేర్చి జనాభా ప్రాతిపదికన కాకుండావ వెనుకబాటు ప్రాతిపదికన ఎక్కువ రిజర్వేషన్ కల్పించాలని పంబాల కులవృత్తి కళాకారుల సంఘం నాయకులు కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అడిషినల్ డైరెక్టర్ శ్రీధర్, వరంగల్ ఉమ్మడి జిల్లా డీఎస్సీ డీఓ, ఎస్‌డబ్ల్యూఓలు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఈవీ శ్రీనివాస్‌రావు, పలువురు జిల్లా అధికారులు, వివిధ ఎస్సీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె ఉధృతం

మద్దతు తెలిపిన వరంగల్ జిల్లా ఎంఈవోలు



ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న ఎంఈవోలు

హనుమకొండ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష(ఎస్ఎస్) కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె దీక్షలు ఉధృతంగా సాగుతున్నాయి. బాలసముద్రం ఏకశిలా పార్కు వద్ద చేస్తున్న దీక్షలు గురువారం 13వ రోజుకు చేరాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రతీ రోజు ఆయా జిల్లాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి వినూత్న రీతిలో నిరసన దీక్షలు చేస్తున్నారు. గురువారం వరంగల్ జిల్లా మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు సైతం దీక్షలో కూర్చుని సంఘీభావం తెలిపారు. దీక్షల నిర్వాహణకు ఎంఈవోలు రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెగ్యులైజ్ చేసే వరకు మినిమం టైం స్కేల్ ఇచ్చి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు.

ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలి

పీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల దీక్షలను సందర్శించి ఇచ్చిన హామీని, ఇపుడు సీఎం అయిన తరువాత ఎందుకు ఇవ్వటం లేదని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ప్రశ్నించారు. గురువారం ఆయన దీక్షలను సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. కేంద్రం సమగ్రశిక్ష ద్వారా విద్యాశాఖకు అందిస్తున్న నిధులకు అనుగుణంగా రాష్ట్రం వాటా ఇస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రం వాటా ఇవ్వకుండా కేంద్రనిధులపై ఆధారపడటం వల్ల విద్యావ్యవస్థ కుంటుబడుతోందన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైక్రోబయోలజీ సబ్జెక్టులో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు ఎంపికకు డిసెంబరు 20న శుక్రవారం ఉదయం 10.30గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55శాతం మార్కులున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. అయితే పీహెచ్‌డీ, నెట్, స్లెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు నేరుగా ఒరిజినల్స్ ధృవపత్రాలతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఆర్‌వోఆర్-2024 చట్టంతో ప్రజలకు మేలు

ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి

రాంనగర్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఓఆర్-2024 చట్టంతో ప్రజలకు చాలా మేలు జరగనుందని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి అన్నారు. భూ హక్కుల కల్పన ద్వారా చాలా సమస్యలు పరిష్కారమవుతాయని, గ్రామ కంఠం, ఆబాది భూములకు చట్ట బద్ధత కల్పించి రుణాలు పొందేవిధంగా తీసుకొచ్చిన చట్టాన్ని గౌరవిస్తున్నామన్నారు. ప్రతీ గ్రామానికి ఒక రెవెన్యూ ఉద్యోగిని నియమించే పాత పద్ధతిని పునరుద్ధరించడం సంతోషదగ్గ విషయమన్నారు. రెవెన్యూశాఖ బలోపేతంతోపాటు ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా రెవెన్యూ సేవలను తీసుకోస్తున్నందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్.ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్, టీయూవీ రీఇన్‌లాండ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో వివిధ ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, టెన్త్, ఐటీఐ, డిప్లొమా, డీఫార్మసీ, బీఫార్మసీ, బీటెక్, డిగ్రీల్లో ఉత్తీర్ణులైనవారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు.

అర్హత, ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఉదయం 10.30 గంటలకు ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 7093168464 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6012	3000
పల్లికాయ (పచ్చిది)	5200	4500
కందులు	-	-
పెసళ్లు	5212	4000
పత్తి	7020	5800
పసుపు (కాడి)	10469	9823
పసుపు (గోల)	10336	9834
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16100	12000
తేజ ఏసీ	15500	14000
వండర్‌హాట్ ఏసీ	14000	13000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆన్‌లైన్ మోసాలపై 1930ను సంప్రదించాలి

ఆన్‌లైన్ ద్వారా చేసే ప్రతీ పనిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మన పని మనం చేసుకుంటుండగానే మోసపూరితమైన లింక్‌లు, మెసేజ్‌లు వస్తుంటాయి వాటి జోలికి వెళ్లకూడదు. మోసం జరిగినట్లు గ్రహిస్తే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ పని చేస్తోంది. ఫిర్యాదుల ద్వారా చాలామందిని కాపాడగలిగాం. ఏ ఒక్కరూ ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, లోన్ యాప్‌లు, ఒకటికి రెండింతలు డబ్బులు ఇస్తామనే మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. ముఖ్యంగా పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దు.

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



జీవితాలతో సెల్‌గాటం!

ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు

బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

వరంగల్ క్రైం, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక రంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. దానిని సరిగ్గా వినియోగించుకునే వారు లక్షల్లో వేతనాలు పొంది విలాసవంతంగా జీవిస్తుంటే.. దానిని దుర్వినియోగం చేసుకునే వారి జీవితాలు రోడ్డున పడుతున్నాయి. తద్వారా వచ్చే మానసిక ఒత్తిళ్లను తట్టుకోలేక బలవన్మరణం పొందుతూ కుటుంబాలకు శోకం మిగుల్చుతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ వేదికగా ఒకటికి రెండింతలు డబ్బులు ఇస్తామని ప్రసారమయ్యే మోసపూరిత ప్రకటనలను ఆకర్షితులై చట్టబద్ధత కానీ యాప్‌లు, లింక్‌ల ద్వారా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని లబోదిబోమంటున్నారు. మరికొంతమంది లోన్‌యాప్‌ల ద్వారా రుణాలు పొంది వాటిని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లపై పెట్టుబడిగా పెట్టి ఆ తర్వాత డబ్బులు కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఆ నష్టాన్ని పూడ్చలేక అడ్డదారులు తొక్కి చివరికి ఆ సమస్య నుంచి బయటపడలేక మానసిక ఒత్తిళ్లతో అర్థంతరంగా తనువు చాలిస్తున్నారు.

ఆశ చూపి వలలోకి..

సైబర్ దొంగలు వివిధ మార్గాల్లో ప్రజలను తమ వలలోకి దింపి జేబులు లూటీ చేస్తున్నారు. ఉద్యోగం, ఇన్వెస్ట్‌మెంట్, కొరియర్ పేరిట ముందుగా ఆకర్షించి ఆ తర్వాత నట్టేట ముంచుతున్నారు. ఆన్‌లైన్‌లోని మోసాలకు ఎలాంటి తారతమ్యం లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారాలు, గృహిణులు, చిన్నా, పెద్ద తేడా అందరూ ఆకర్షితులై డబ్బులు సమర్పించుకుంటున్నారు. రుణయాప్ ద్వారా లోన్ తీసుకున్న వారు తిరిగి చెల్లించలేక, నిర్వాహకులు పెట్టే వేధింపులు భరించలేక కొంతమంది ప్రాణాలు తీసుకుంటున్నారు. లోన్ యాప్ నిర్వాహకుల నుంచి రుణం పొందితే సకాలంలో డబ్బులు తిరిగి చెల్లించకున్నా.. ఆలస్యం చేసినా.. రుణగ్రహీతలు ఫొటోలను మార్ఫింగ్ చేసి వారి బంధువులకు, ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్స్‌కు పంపిస్తున్నారు. అలాంటి సమయంలో రుణ గ్రహీతలు అవమాన భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

అత్యాశకుపోయి.. ఉన్నది పోగొట్టుకుని..

ఈ మధ్యకాలంలో వాట్సాప్‌కు వచ్చే లింక్ మెసేజ్‌లను నొక్కి అటు నుంచి గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు వస్తాయనే ఆశ చూపగానే విడతల వారీగా డబ్బులను పంపించి నష్టపోతున్నారు. ఈ రకమైన మోసాల బాధితులే అత్యధికంగా పోలీసులు ఆశ్రయిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుల్లో రోజుకు ఒకటి, రెండైనా ఇలాంటివి ఉంటున్నాయి. మీరు పెట్టే డబ్బులు రెట్టింపు అవుతాయనగానే ఆలోచించకుండా డబ్బులు వేసి ఆ తర్వాత లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు పరిగెత్తుకుంటూ వెళుతున్నారు.

సైబర్ క్రైం కేసులు

వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఉన్న సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌తో పాటు మూడు జోన్‌లలో ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్‌లలో సైబర్ క్రైంకు గురైన బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో 142 కేసులు నమోదు కాగా, కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో 173 కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ నుంచి సమారు రూ.32 లక్షలకు పైగా బాధితులకు ఇప్పించగా, పోలీస్‌స్టేషన్ల నుంచి రూ.కోటి 30 లక్షల వరకు రీఫండ్ చేయించగలిగారు.

యాప్ మోసాలకు బలి..

- ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా రూ.1,60,000 కోల్పోయిన శాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజుపల్లికి చెందిన ఆవుల దిలీప్.. పురుగుల మందు తాగి ఈ ఏడాది మే 31న ఆత్మహత్య చేసుకున్నాడు.
- లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల కారణంగా ఈ ఏడాది ఆగస్టు 31న విఎల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్ జన్మభూమి జంక్షన్ ప్రాంతానికి చెందిన విద్యార్థి కంభంపాటి విష్ణువర్ధన్ చీరతో ఉరి వేసుకొని బలవన్మరణం పొందాడు.
- భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు చెందిన రేషన్ డీలర్ గొడిశాల పైడయ్య ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో రుణం తీసుకొని ఈఎంఐ చెల్లించలేదు. లోన్ యాప్ నిర్వాహకులు ఒత్తిడి పెంచడంతో ఈ ఏడాది జూన్ 27న రేషన్‌షాపులోనే ఉరి వేసుకొని మరణించాడు.
- వర్ధన్నపేట కడారిగూడెంకు చెందిన బీటెక్ విద్యార్థి బత్తిని గణేశ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం స్నేహితుల వద్ద అప్పు చేసి తీర్చలేక ఈ ఏడాది అక్టోబర్ 23న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ 29న హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో మరణించాడు.
- డిసెంబర్ 16న వర్ధన్నపేట మండలం బండౌతాపురానికి చెందిన మరుపట్ల హనూక్ (26) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.6లక్షలు పోగొట్టుకొని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.





అడ్డదారులు తొక్కి కటకటాల్లోకి..

బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, వ్యక్తిగత అవసరాల కోసం ఆన్‌లైన్ లోన్‌యాప్‌లు ఆశ్రయించి రుణాలు తీసుకొని వాటిని తీర్చలేక కొందరు అడ్డదారులు తొక్కుతూ చివరికి చోరీలకు పాల్పడుతున్నారు. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలానికి చెందిన కొండపల్లి ధర్మారాజు.. బిర్యానీ సెంటర్ నడిపి నష్టపోయాడు. అనంతరం హనుమకొండ రెవెన్యూకాలనీకి మకాం మార్చి అద్దె ఇంట్లో ఉన్నాడు. నష్టపోయిన డబ్బును తిరిగి పొందేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా సంపాదించాలని ప్లాన్ వేశాడు. వాటి ద్వారా ఇంకా నష్టపోయాడు. దీంతో దొంగగా మారి చోరీలు చేయడం ప్రారంభించాడు. ఇలా 13 చోరీలు చేసి చివరికి కేయూ పోలీసులకు చిక్కి జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు.



అలెర్ట్

లింకు నొక్కారో.. కాసులు కల్లాస్!

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- అవగాహన లేక కొందరు.. ఆశతో మరికొందరు
- ఇప్పటికే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న వాళ్లు కోకొల్లలు
- స్వీయ జాగ్రత్తలతోనే సైబర్ నేరాల నియంత్రణ

లింగాలఘణపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మీ బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయింది. మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ బ్యాంకు అధికారుల పేరుతో తెలియని వ్యక్తులు కాల్ చేస్తుంటారు. మరికొందరికేమో మీరు లక్కీ డ్రాకు ఎంపికయ్యారు.. మేమడిగే అతి సులభమైన రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పండి.. ఆతర్వాత మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పండి.. క్షణాల్లో ఇక లక్కీ డ్రా డబ్బులు మీ సొంతల్ అంటూ బురిడీ కొట్టిస్తారు. ఇటీవల ఇలాంటి ఫేక్ కాల్స్ ఎక్కువయ్యాయి. పొరపాటున వారి మాటలు నమ్మి ఓటీపీలు చెప్పారో.. నిజంగానే బ్యాంకులో ఉన్న మీ కాసులు కల్లాస్ అవ్వాల్సిందే. ఏం జరిగిందో తెల్సుకుని తేరుకునేలోపే సైబర్ నేరగాళ్లు మన ఖాతాల్లో డబ్బులను మాయం చేస్తారు.. సైబర్ నేరగాళ్ల ఇటీవల కాలంలో ఒక అడుగు ముందుకేసి ఖాతాల్లో ఉన్న డబ్బులను మాయం చేయడమే కాకుండా బ్యాంకు ఖాతాలతో లింక్ అయిన మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్‌ను బ్లాక్ చేస్తున్నారు. రోజు రోజుకు సాంకేతిక అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇలాంటి సైబర్ నేరాల తీవ్రత కూడా అంతే స్థాయిలో పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఓ వైపు పోలీసులు, మరో వైపు స్వచ్ఛంద సంఘాలు సైబర్ నేరగాళ్ల చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా రోజుకొక్కటి చొప్పున నేరాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నిరక్ష్యరాస్యులు పడుతున్నారేమో అనుకుంటే పొరపాటే.. అన్నీ తెలిసిన చదువుకున్న వారే.. వీరిలో బ్యాంకుల ఉద్యోగులు కూడా ఉంటుండటం గమనార్హం.

అవగాహన లేక కొందరు.. అత్యాశతో మరికొందరు..

పెరుగుతున్న సాంకేతికత, అందరి చేతిలోకి స్మార్ట్ ఫోన్లు అందుబాటులో రావడం, వాటికి తగ్గట్టుగా తక్కువ ధరలకే ఇంటర్నెట్ సేవలు అందుతుండటంతో ఎటు నుంచి ఏ సైబర్ కేటుగాడు మోసానికి పాల్పడతాడో అర్థం కాని పరిస్థితి. మారుమూల పల్లెలోని చిరుదుకాణాల నుంచి కార్పోరేట్ స్థాయి షాపింగ్‌లు, సూపర్‌మార్కెట్లలో సైతం కొనుగోళ్లు అమ్మకాలకు చెందిన ప్రతీ లావాదేవీని యూపీఐ అకౌంట్ ద్వారా చేస్తున్నారు. అయితే ఆర్థిక లావాదేవీలు చేస్తున్న ప్రతీ యూపీఐ చెల్లింపులన్నీ ప్రైవేటుకు చెందింది కావడంతో మన వ్యక్తిగత సమాచారం మొత్తం వాళ్ల వద్ద ఉండిపోతోంది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్ల రెచ్చిపోతూ మోసాలకు తెరలేపుతున్నారు. మెసేజ్, వాట్సాప్‌ల ద్వారా తప్పుడు లింకులు షేర్ చేస్తున్నారు. తెలిసీ తెలియక వాటిని నొక్కిన వెంటనే మన ఖాతాల్లోని డబ్బంతా మాయమైపోతోంది. వీటితో పాటుగా కొంతమంది నకిలీ వెబ్‌సైట్లను క్రియేట్ చేస్తుండటంతో స్మార్ట్ ఫోన్లకు వచ్చే బల్క్ వెబ్‌సైట్లలో నకిలీవి ఏవో.. అసలువి ఏవో తెలియక ప్రజలు మోసాలకు గురవుతున్నారు. ఇలాంటి సైబర్ మోసంలో చిక్కుకునే వాళ్లలో కొంతమంది ఏం తెలియని వారుంటుండగా మరికొందరు అత్యాశతో రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా ఎదగాలని అత్యాశతో నిండా మునుగుతున్నారు. కొందరు ఆదాయ పన్ను నుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ మోసాల బారిన పడిపోతున్నారు. ఇంకొంతమంది యువత ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి ఖాతాలను గుల్ల చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ గేముల్లో మొదట గెలిచినట్టు అవకాశం కల్పించి రెట్టింపు డబ్బులు చెల్లించి పూర్తిగా నమ్మించిన తర్వాత ఖాతాలో ఉన్న డబ్బును మొత్తం మాయం చేస్తున్నారు. ఇలాంటి ఘటనే ఇటీవల లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో ఓ యువకుడుపెద్ద మొత్తంలో తన డబ్బును పోగొట్టుకున్నట్టు సమాచారం.

- జనగామ జిల్లాలో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు బలై రూ. లక్షల్లో మోసపోయాడు. అదేవిధంగా టీజీఎస్‌పీడీసీఎల్‌లో పనిచేసే ఓ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల మోసానికి రూ. 89వేలు పోగొట్టుకున్నారు. లింగాలఘణపురం మండలానికి చెందిన ఓ గ్రామపంచాయతీ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల కారణంగా తన ఖాతాలోని రూ. 40వేలు మాయం చేసుకున్నాడు.



సైబర్ మోసాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్మెట సీఐ అబ్బయ్య(ఫైల్)

అపరిచితులకు వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు



అపరిచిత వ్యక్తులు పంపే లింకులను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు. అదేవిధంగా ఎవరైనా ఫోన్ చేసి ఆధార్‌నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఓటీపీ అడిగితే ఎవరికి కూడా షేర్ చేయకూడదు. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు అనేక రూపాల్లో స్మార్ట్ ఫోన్‌ద్వారా మోసం చేసేందుకు సిద్ధంగా ఉంటారు. అటువంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి.

- శ్రీనివాస్‌రెడ్డి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, జనగామ రూరల్



సైబర్ అంబాసిడర్‌గా మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని(ఫైల్)

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కకుండా జాగ్రత్తలు ఇలా పాటించాలి..

- సైబర్‌క్రైం జరిగిన వెంటనే / 24 గంటల లోపు 1930కి ఫోన్ కాల్ చేసి సమాచారమివ్వాలి. లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలి.
- వెబ్‌సైట్‌లు అసలువా లేక నకిలీవా అని తెల్సుకునేందుకు http://www.getsafeonline.org లో నిర్ధారించుకోవాలి
- మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులు తొందరపడకుండా జాగ్రత్తగా గమనించి ఓపెన్ చేయాలి
- థర్డ్‌పార్టీ అప్లికేషన్లు ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు



- బహుమతి వచ్చిందని ఎస్ఎంఎస్‌లు వస్తే నవి మ్మమోసపోవద్దు
- అపరిచితులకు తమ ఖాతా నెంబర్లు, ఓటీపీలు ఇవ్వకుండా ఉండాలి
- యూపీఐల ద్వారా డబ్బులు చెల్లించే ఖాతాల్లో వీలైనంత మేరకు తక్కువ డబ్బులను ఉంచుకోవడం శ్రేయస్కరం.
- ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్లను ప్రభుత్వం నియమించింది. వారిని సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు



మొగిలయ్య భౌతిక కాయం



మొగిలయ్య(ఫైల్)

మూగబోయిన జానపద ఝరి

'బలగం' మొగిలయ్య కన్నుమూత

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. ముగిసిన అంత్యక్రియలు

దుగ్గొండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జానపద కళాకారుడు, 'బలగం' ఫేమ్ పస్తం మొగిలయ్య (67) కన్నుమూశారు. రెండేళ్లుగా రెండు మూత్రపిండాలు ఫెయిలై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కాగా, మొగిలయ్య స్వస్థలంలో మొగిలయ్య భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి రూ.50వేలు మొగిలయ్య భార్య కొమురమ్మకు అందించారు. అదేవిధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు టీపీసీసీ కార్యదర్శి బొమ్మెనపెల్లి అశోక్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి రూ.50 వేలు ఆర్థికసాయం చేశారు. బలగం సినిమాలో నటించిన రచ్చ రవి, బాలు సందర్శించి నివాళులర్పించారు. తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులైన యోచన, తాళ్ల సునిల్ నివాళుల ర్పించారు. స్థానిక నాయకులు, కళాకారులు సందర్శించి నివాళులర్పించారు. కాగా, మొగిలయ్యను చూడడానికి కులస్థులు, వివిధ గ్రామాలకు చెందిన పలువురు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం మధ్య క్రైస్తవ మతఆచారం ప్రకారం మొగిలయ్య అంత్యక్రియలు ముగిశాయి.



మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న రచ్చ రవి, బాలు

సంప్రదాయ కళతో..



వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య (67), కొమురమ్మ దంపతులు జానపదాలు, బుర్రకథలు చెబుతూ జీవనం సాగించారు. పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తున్న జానపద కళల్లో ఒకటైన బుర్ర కథలే వృత్తిగా ఎంచుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు గోదావరి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో బుర్ర కథలు చెప్పేవారు. నిరక్షరాసులైనా కళలో ప్రత్యేక గుర్తింపు పొందారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కేశవపురానికి చెందిన పస్తం వెంకటయ్య - లక్ష్మిలకు 10 మంది సంతానం. వీరిలో నలుగురు కుమా రులు, ఆరుగురు కుమార్తెలున్నారు. రెండో కుమారుడైన పస్తం మొగిలయ్య అదే గ్రామానికి చెందిన మేనమామ కడెం హన్మంతు-జానవ్వల కుమార్తె కొమురమ్మను 45ఏళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు సుదర్శన్ ఉండగా, తన సోదరుడైన పస్తం రవి కుమార్తె మొజేష్‌ను దత్తత తీసుకున్నారు. ఊరూరా తిరుగుతూ కథలు చెబుతూ మొగిలయ్య కుటుంబం కొన్నేళ్ల కిందట దుగ్గొండికి వలస వచ్చి స్థిరపడింది. ఇందిరమ్మ కాలనీకి చెందిన గృహాన్ని కొనుగోలు చేసి నివాసంగా ఉంటున్నారు. కుమారుడు సుదర్శన్ స్టీల్ సామాన్లు కొనుగోలు వ్యాపారం చేస్తున్నాడు. దత్త కుమార్తెకు వివాహం కావడంతో అత్త వారింట్లో ఉంటోంది.

అప్పటికపుడు కథలు, పాటలు

దంపతులిద్దరూ నిరక్షరాసులైనా కథలు, పాటలు అల్లుకుని పాడడం, చెప్పడం వారి ప్రత్యేకత, శకుంతల, దమయంతి, కాంబోజురాజు, అంజమ్మ తదితర కథలు చెప్పడంలో సిద్ధహస్తులు, ఏ ఊరికి వెళ్లినా ఆ ఊరిలో డేరాలు వేసుకొని కొన్ని రోజులు అక్కడే ఉంటూ కథలు చెబుతూ.. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబం నెట్టుకొచ్చేవారు.



మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

బలగం సినిమాతో ప్రత్యేక గుర్తింపు

మూడేళ్ల కిందట మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడలోని ఓ ఇంటి వద్ద మొగిలయ్య దంపతుల బుర్ర కథను విన్న రాజమౌళి అనే వ్యక్తి ఈ విషయాన్ని తన బంధువైన బలగం సినిమా దర్శకుడు యెల్దండి వేణుకు తెలిపారు. దీంతో వేణు కొత్తగూడకు చేరుకొని వారి కథను, పాటలను విన్నాడు. తాను తీస్తున్న బలగం సినిమా క్లైమాక్స్ లో పాట పాడేందుకు అవకాశం కల్పించారు. సినిమా విజయవంతం కావడంతో మొగిలయ్య దంపతులకు మంచి గుర్తింపు వచ్చింది.



మొగిలయ్య దంపుతులను సన్మానిస్తున్న బలగం సినిమా డైరెక్టర్ వేణు(ఫైల్)

ముగిసిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మూడు రోజులుగా జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వివిధ క్రీడాపోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు సాట్ చైర్మన్ శివసేనారెడ్డి హాజరై విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ సత్యశారద, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్, డీఎస్ఏ కోచ్‌లు, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఉత్తమ నాట్య గురువుగా హిమాన్సీ

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ అడ్వోకేట్స్ కాలనీకి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి కాట్రగడ్డ హిమాన్సీకి జాతీయ స్థాయిలో ఉత్తమ నాట్య గురువుగా చెన్నైలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకోవడం విశేషం. నగనలూరు సభ, ప్రియా ఆర్ట్స్ సొసైటీ సంయుక్తంగా బుధవారం చెన్నైలో నిర్వహించిన మార్గాజీ సీజన్ అన్యువల్ మ్యూజిక్ డాన్స్ అవార్డు ఫెస్టివల్‌లో దేశం నలుమూలల నుంచి సంగీతం, నృత్యం, వాయిద్య రంగాల్లో ఉత్తమ కళాకారులను వారి ప్రతిభా ఆధారంగా ఎంపిక చేసిన క్రమంలో తెలంగాణ నుంచి నృత్య రంగంలో హిమాన్సీ ఎంపికైంది. ఉత్తమ గురు, ఉత్తమ పెర్ఫార్మర్ అవార్డులను పద్మశ్రీ డాక్టర్ చిత్ర విశ్వేశ్వరన్, అనితగుహ లాంటి జాతీయ ప్రముఖ కళాకారుల చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఇటీవలి కాలంలో టెంపుల్ డాన్స్ స్కూళ్లు స్థాపించి ఎందరో విద్యార్థులకు హిమాన్సీ శిక్షణ ఇస్తుంది.

వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

వరంగల్ మెడికల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు గురువారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ క్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల డీఎంహెచ్‌వోలకు వినతి పత్రాలను అందజేశారు. 48 గంటల నిరసనలో భాగంగా వంటావార్పు చేసి, కార్యాలయం ముందే నిద్రించారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్ మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని రెండేళ్లుగా పోరాడుతున్నా పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం గతంలో త్రిసభ్య కమిటీ నియమించిందని, కమిటీ రిపోర్టు లేకుండా రాతపరీక్ష తేదీలు ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వం రాత పరీక్షను వాయిదా వేయాలని, లేకుంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ నాయకులు సుధాకర్, శ్రీనివాస్, సుజాత, సరోజ, చంద్రకళ, ప్రభావతి, సాంబలక్ష్మీ, మంజుల, పుష్పలత, విజయ, కవిత, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడికి మరో అలంకారం

▸▸ రూ.10 లక్షల నాగాభరణం బహూకరణ



వెండి నాగాభరణం అందుకుంటున్న ఆలయ ఈవో, ప్రధానార్చకులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలో కొలువై ఉన్న రుద్రేశ్వరుడికి ప్రత్యేక అలంకారంగా నాగాభరణం బహూకరించారు. గురువారం పంచమి తిథి వేళ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన హైదరాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు చైర్మన్ బొమ్మిడాల శ్రీనివాస్-వరలక్ష్మి దంపతులు రూ.10లక్షల 20వేల విలువ చేసే 10 కిలోల వెండి నాగాభరణాన్ని ఆలయ ఈవో వెంకటయ్య, ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మలకు అందజేశారు. ఏడు నాగముఖాలతో చేయించిన ఆభరణాన్ని ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, జలాధివాసం, రుద్రహోమం లాంటి వైదిక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆలయానికి బహూకరించడం విశేషం. ప్రముఖ వేద పండితులు గంగాధర ఫణిభూషణ శర్మ, గంగు వినోద్ శర్మల వేద పఠనంతో శాస్త్రోయుక్తంగా ఆగమానుసారం పూజలు నిర్వహించారు. బొమ్మిడాల శ్రీనివాస్ దంపతులను ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఘనంగా స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయంలో జరిగే విశేష పూజల్లో రుద్రేశ్వరుడికి నాగాభరణం ధరింపచేసి పూజలు నిర్వహించనున్నారు.

ఎస్సీ కాలనీలో ప్రజాభిప్రాయ సేకరణ

హసన్‌పర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి సుబ్బయ్యపల్లిలో గురువారం ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషనర్ జస్టిస్ డాక్టర్ షమీం పర్యటించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. వారి స్థితిగతులను, ఎంతమంది ఉన్నత చదువులు చదివారు.? ఎస్సీలలో ఉన్నటువంటి ఉమ్మడి రిజర్వేషన్ ఫలాలను ఎంత వరకు వినియోగించుకున్నారో వివరాలను సేకరించారు. అంతేకాకుండా విద్యా, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో ఎంత మంది ఉద్యోగులున్నారో తెలుసుకున్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఎంబీఏ, పీహెచ్‌డీ, ఇంజనీరింగ్ చదివినా తమకు రిజర్వేషన్ ఫలాలు అందడం లేదని తెలిపారు. ఆయన వెంట హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్, వరంగల్ డీసీడీవో భాగ్యలక్ష్మి, అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజ్, సోషల్‌వెల్ఫేర్ డీడీ శ్రీలత, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పుట్ట రవి, గోసంగి కుల రాష్ట్ర అధ్యక్షుడు సుచ్చు మల్లయ్య, ఎంఎస్పీ నేతలు భిక్షపతి, అరవింద్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్(టీజీ ఎంఎఫ్‌సీ) ద్వారా పేద, నిరుద్యోగ అర్హత కలిగిన, శిక్షణ పొందిన మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ మహిళాశక్తి పథకం కింద ఉచితంగా గృహ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఉచిత కుట్టు మిషన్లను అందజేసేందుకు లబ్ధిదారులు ఈ నెల 31 సాయంత్రం 5 గంటలలోపు తమ దరఖాస్తులను జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. మైనారిటీ కమ్యూనిటీకి చెందిన ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు, నిరుద్యోగ మహిళలు, పేదలు, వితంతువులు, అనాథలు, ఒంటరి మహిళలకు ఈ పథకంలో ప్రాధాన్యత ఇవ్వనునట్లు పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు లేదా ఆహార భద్రతా కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంరక్షకుడి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల లోపు, వయో పరిమితి 18 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలని ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 7330990322లో సంప్రదించాలని ఆయన కోరారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలి

▸▸ డీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



అంబేద్కర్ సర్కిల్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వడ్డెపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేయాలని, బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మను అంబేద్కర్ సర్కిల్‌లో దహనం చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కేంద్ర మంత్రి అమిత్‌షాపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సుబేదారి పోలీసు స్టేషన్‌లో డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మైనార్టీ విభాగం చైర్మన్ అజీజ్ ఉల్లాబేగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి విజయ్, నాయిని లక్ష్మారెడ్డి, డాక్టర్ శ్రవణ్, స్వేత, బాబు, అరూరి సాంబయ్య, ఆనంద్‌పాల్, మహేందర్, భాస్కర్, తాళ్లపెల్లి మేరీ, తాళ్లపెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● అంబేద్కర్‌ను అవమానపరుస్తూ పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పడంతో పాటు, పదవికి వెంటనే రాజీనామా చేయాలని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, అసైండ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో పెద్ద ఎత్తున నినాదాలు చేసి అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేశారు.

● దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య , హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు రేణిగుంట్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేసి నిరసన ప్రదర్శన చేశారు.

● కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు దూడపాక రాజేందర్, ముదుసు నారాయణ, గడ్డం అశోక్‌లు నిరసన ప్రదర్శన చేశారు.

మంత్రిపై కేసు నమోదు చేయాలి

కేయూ క్యాంపస్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. గురువారం కేయూ లైబ్రరీ ఎదుట అమిత్‌షా చిత్రపటాలను కాల్చివేసి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్, నాయకులు అజయ్, రవి, కిరణ్, సాయి, వెంకటేశ్, శివ, చంటి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు గర్హనీయం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు గర్హనీయమని డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ ఖండించారు. గురువారం కేయూ మొదటి గేటు వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మతో నిరసన చేపట్టి దహనం చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ జిల్లా నాయకులు రాజేశ్, అనిల్, సునిల్, సంజయ్, సూర్య, అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

● కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను పదవి నుంచి తప్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం కేయూ మొదటి వద్ద అమిత్‌షా దిష్టిబొమ్మను ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో దహనంచేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, కేయూ అధ్యక్షుడు పురుషోత్తం, సాయికిరణ్, ప్రదీప్, మల్లేశ్, భరత్, రాహుల్, సందీప్, శివ, వంశీ తదితరులున్నారు.

క్రీస్తు బోధనలు అనుసరించాలి

▸▸ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్



కేక్ కట్ చేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యేసు క్రీస్తు మార్గం మానవాళికి రక్షణ మార్గం, క్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరు అనుసరించాలని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేట బాపూజీ నగర్‌లో బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మినీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి ఈ వేడుకలకు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై కేక్‌కట్ చేసి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకే ఏకైక పండగ క్రిస్మస్ అని చెప్పారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పాస్టర్ జామవా క్రీస్తు సందేశం అందించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈవేడుకల్లో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నాయకులు నార్లగిరి రమేశ్, శిరుమల్ల దశరథం, గబ్బెట కరుణ్, దువ్వ కనుకరాజు, పాలడగుల శివకుమార్, సుంచు కృష్ణ, కాటాపురం రాజుతోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● కాజీపేట రైల్వేస్టేషన్ వద్ద గురువారం జీసస్ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సుమారు 50 మందికి అన్నప్యాకెట్‌లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు పాస్టర్ మరియదాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసునూరి మనోహర్, బట్టు సమోదర్, పాస్టర్ హోసయా తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ షెడ్‌లో అగ్నిమాపక ప్రదర్శన

కాజీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే డీజిల్ షెడ్‌లో గురువారం అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకునే జాగ్రత్తలపై పలు ప్రదర్శనలు చేశారు. షెడ్‌లో, రైల్వే పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పే విధానాన్ని, రైల్వే కార్మికులకు ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. రైల్వే విద్యుత్ తీగల ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ ఎన్వీ వెంకట్‌కుమార్, డీఎంఈ అనికేత్ గాంధీ, ఏడీఎంఈలు బాను ప్రకాశ్, శ్రీనివాసరావు, కార్యక్రమ ఇన్‌చార్జి గరిమిల్ల రాజేశ్వర్ రావు, అగ్నిమాపక సిబ్బంది యాకుబ్, గౌతం మునీ, రాజకుమార్, వంశీ, రామారావు పాల్గొన్నారు.

జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ వైస్‌చైర్‌పర్సన్‌గా అనితారెడ్డి



బాలసముద్రం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ వైస్ చైర్‌పర్సన్‌, అడ్వయిజర్‌గా డాక్టర్ కరుకాల అనితారెడ్డి నియామకమయ్యారు. సంస్థ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ రామానుజస్వామి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వినియో గదారులకు సేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. చైర్మన్ డాక్టర్ రామానుజస్వామి నమ్మకం మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. వినియోగదారుల చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తానన్నారు.

నేటి నుంచి ధ్యాన మహాసభలు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫులెనెస్ సంస్థల ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని అవోపా భవన్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ధ్యాన మహాసభలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్. శారద తెలిపారు. ప్రతీ రోజు సాయంత్రం 5 గంటల నుంచి 7గంటల వరకు ఉచిత ధ్యాన శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీని కలిసిన శాయంపేట ఎస్సై

వరంగల్ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో పోలీసులపై ఉన్న నమ్మకాన్ని నిజాయితీ ద్వారా నిలబెట్టుకోవాలని సీపీ అంబర్‌కిషోర్‌ఝా సూచించారు. శాయంపేట పోలీస్‌స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పరమేశ్వర్ గురువారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు అందుబాటులో ఉండి పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకురావాలని ఈ సందర్భంగా సూచించారు.

అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో ప్రతిభ



మురుగన్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 19:(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14నుంచి 19 వరకు థాయిలాండ్ దేశంలోని ఖావోలాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఫెడరేషన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూడీటీఏ)కు చెందిన సభ్యులు భారతదేశం తరుపున ప్రాతినిధ్యం వహించి టెన్నిస్ చాంపియన్‌షిప్ సింగిల్స్, డబుల్స్‌విభాగాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. కాగా, డబ్ల్యూడీటీఏకు చెందిన మురుగన్ 55ప్లస్ సింగిల్స్‌లో విజయకేతనం ఎగరవేసి స్వర్ణ పతకాన్ని తీసుకవచ్చారు. అదే విధంగా డబుల్స్ 45 ప్లస్ విభాగంలో డాక్టర్ పి.ప్రవీణ్, కమల్ అగర్వాల్‌లు, 50ప్లస్ విభాగంలో బి.కన్నారెడ్డి, మురుగన్‌లు సెమీఫైనల్స్‌కు చేరుకుని స్వల్ప తేడాతో ఫైనల్స్‌లో వెనుదిరిగారు. ఈ మేరకు క్రీడాకారులను వరంగల్ క్లబ్ సభ్యులు, వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండ్ర సత్యనారాయణరెడ్డిలు అభినందిచారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతులు



కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్ బృందం

కాజీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలను వర్గీకరించడం సరైనదేనని కోరుతూ ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు గురువారం కలెక్టరేట్‌లో పలు దళిత సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సందెల విజయ్ కుమార్, మోచీ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంజిత్‌లు బృందాలుగా వెళ్లి వినతిప్రతం సమర్పించారు. కాగా,ఎస్సీ కులగణన తర్వాతే రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ తేజోమయు మాల కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ జస్టిస్ షమీం అక్తర్‌కు వినతిప్రం సమర్పించారు. వినతి పత్రంలో ఎస్సీ కులగణన పూర్తికాకుండానే ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు.

రాజ్యాంగబద్ధంగా జరగాలి

షెడ్యూల్డ్ కులాల వర్గీకరణను వ్యతిరేకిస్తూ మడికొండకు చెందిన అంబేద్కర్ సంఘం నేతలు సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ విరుద్ధమన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు ప్రస్తుతం ఉన్న 15 శాతం రిజర్వేషన్లను 25 శాతానికి పెంచాలని, పార్లమెంట్‌లో బిల్లుపెట్టి 2/3 మెజార్టీతో బిల్లు పాస్ అయినప్పుడే చట్ట ప్రకారంగా వర్గీకరణ జరగాలని ఈ మేరకు కమిషన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంబేద్కర్ సంఘం నేతలు జవ్వాజి కిషన్, కాశేశ్వరపు రాజేందర్, వెన్నమల్ల రమేష్, అంకేశ్వరపు భానుకుమార్, ముప్పిడి శివ, బండారి మహేందర్, జిట్ట అనిల్, మూల వీరస్వామి, మేదరి భూపాల్‌కర్ల, నెలకంటి వెంకట్, సాంబరాజు తదితరులు ఉన్నారు.

కాగా, ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా మడికొండకు చెందిన జాంబవ సంఘం నాయకులు గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ డాక్టర్ షమీమ్ అక్తర్ కమిటీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు అరూరి వెంకటేశ్వర్లు, నాయకులు పసునూరి శ్రీనివాస్, వస్కుల దేవేందర్, పెద్దరాజు, శంకర్, శ్రీను, గడ్డం మహేందర్, ప్రవీణ్, రాసమల్ల వెంకటస్వామి, వస్కుల నాగరాజ్, గడ్డం కుమార్, వస్కుల రాజేర్, బరిగెల వినోకర్‌బాబు తది తరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే దళితులకు సామాజిక న్యాయం

కేయూ క్యాంపస్: ఎస్సీ వర్గీకరణతోనే ఎస్సీల్లోని 59 కులాలకు సామాజిక న్యాయం అందుతుందని రాష్ట్ర మాదిగ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ వీరేందర్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీం అక్తర్‌ను మాదిగ జేఏసీ రాష్ట్ర కమిటీ నేతృత్వంలో కలిశారు. వర్గీకరణ వెంటనే చేపట్టాలని వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జేఏసీ నేతలు, ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మైన ఉపేందర్, పోగుల రమేష్, బొల్లె మధుకర్, విక్రం, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ధ్యాన దినోత్సవ వేడుకలు

వడ్డెపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు జగద్గురు బ్రహ్మర్షి సుభాష్ పత్రిజీ ఆశయాల మేరకు ఈ నెల 21 నుంచి పది రోజుల పాటు ధ్యాన మహాయజ్ఞాన్ని వైభవంగా సుమారు 50వేల మంది ధ్యానులతో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు జున్నూ తుల కిషన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి లూనావత్ యాకూబ్ నాయక్‌లు మాట్లాడారు. మహాయజ్ఞంలో భాగంగా శుక్రవారం సాయంత్రం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక ర్యాలీ నిర్వహిస్తున్నామని, జూపార్కు వరకు నిర్వహించే ర్యాలీలో నగరంలోని ధ్యానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

డిసెంబరు 21న అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు పత్రిజీ ధ్యాన మహాయోగ ప్రారంభ వేడుకలకు ర్యాలీగా తరలి వెళ్లనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు అంజలి దేవి, రమాదేవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కేయూ మైదానంలో వర్సిటీ విద్యార్థుల ఘర్షణ

▸▸ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు

▸▸ ముగ్గురు బీపీఈడీ విద్యార్థులపై సస్పెన్షన్ వేటు

▸▸ విద్యార్థుల ఘర్షణపై అధికారులతో అంతర్గత కమిటీ

కేయూ క్యాంపస్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ క్రీడామైదానంలో పీజీ విద్యార్థులు ఆటలు ఆడుకునే సందర్భంలో మాట మాట పెరిగి పరస్పరం గురువారం ఘర్షణకు దిగారు. వర్సిటీ క్యాంపస్‌లోని గ్రౌండ్‌లో బీపీఈడీ మొదటి ఏడాది, ఎంబీఏ మొదటి ఏడాది విద్యార్థులు ఫుట్‌బాల్, క్రికెట్ ఆటలు ఆడుకునే సందర్భంలో గ్రౌండ్ మాకు కావాలంటే.. మాకే కావాలనే విషయంలో విద్యార్థుల మధ్య మాట మాట పెరిగి ఘర్షణ పడ్డారు. ఘర్షణలో వర్సిటీ క్యాంపస్ కళాశాల బీపీఈడీతో ఇతర విభాగాలకు చెందిన విద్యార్థులు ఎంబీఏ విద్యార్థులపై దాడికి చేశారని విద్యార్థులు ఆరోపించారు. దాడుల్లో ఎంబీఏ మొదటి ఏడాదికి చెందిన పలువురు విద్యార్థులు గాయాలపాలయ్యారు. బాధిత విద్యార్థులు వర్సిటీ ఉన్నతాధికారులతో పాటు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన బీపీఈడీ విద్యార్థులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. ఎంబీఏ విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. అయితే బీపీఈడీ విద్యార్థులు తాగి వచ్చి తమపై దాడికి దిగారని ఎంబీఏ విద్యార్థులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తాగిన మైకంలో తమపై దాడిచేయడంతో తమకు గాయాలైనట్లు విద్యార్థులు వాపోయారు.

దీనిపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌ల విచారణతో వర్సిటీ క్యాంపస్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీపీ ప్రసాద్ బీపీఈడీ మొదటి ఏడాది చదువుతున్న ముగ్గురు విద్యార్థులపై 10 రోజుల పాటు సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల ఘర్షణ నేపథ్యంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ నేతృత్వంలో అంతర్గత విచారణ కమిటీని నియమించారు. కమిటీలో బీపీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి, వర్సిటీ స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. విచారణ చేపట్టి 10 రోజుల్లో నివేదిక అందచేయాలని సూచించారు.

మరో విద్యార్థి సస్పెన్షన్

కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ న్యూపీజీ హాస్టల్‌లో ఎంఏ ఇంగ్లీష్ మొదటి ఏడాది చెందిన విద్యార్థి తాగి వచ్చి హాస్టల్‌లో గొడవకు దిగడంతో కేయూ వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ రెండు వారాల పాటు సస్పెన్షన్ వేటు వేశారు. బుధవారం రాత్రి వర్సిటీ క్యాంపస్‌లోని న్యూపీజీ హాస్టల్స్ తాగిన మైకంలో గొడవ చేసి తోటి విద్యార్థులను భయాభ్రాంతులకు గురి సంఘటలనలో విద్యార్థులందరూ కలిసి తాగిన విద్యార్థిని చితకబాదారు. విషయం తెలుసుకున్న వర్సిటీ పోలీసులు గొడవకు దిగిన విద్యార్థిని వర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తాగి గొడవకు దిగిన విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

వరంగల్ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 16మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా, 14 మందికి న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి రూ. 18,500 జరిమానా విధించగా, లేబర్ కాలనీకి చెందిన పోలెపాక పవన్ కళ్యాణ్, భూపాలపల్లి పలిమెలకు చెందిన కట్కం రాకేశ్‌కు రెండు రోజుల కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని మరో ముగ్గురికి రూ.1500 జరిమానా విధించారన్నారు.

ఔటర్ రింగు రోడ్డుపై ప్రమాదం

▸▸ ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఇసుక లారీ





ఔటర్ రింగు రోడ్డుపై ప్రమాదానికి గురైన రెండు లారీలు, క్షతగాత్రుడికి అంబులెన్స్‌లో చికిత్స అందిస్తున్న ఈఎంటీ యుగంధర్

హసన్‌పర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలంలోని చింతగట్టు ఔటర్ రింగు రోడ్డుపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చింతగట్టు ఓఆర్ఆర్‌పై మూడు రోజులుగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇసుక లారీ డ్రైవర్ రెండు లారీల మధ్య ఇరుక్కుపోయాడు. 108 సిబ్బంది జేసీబీ సహాయంతో డ్రైవర్‌ను క్షేమంగా బయటకు తీసి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

యాదాద్రి జిల్లా ఆత్మకూరుకు చెందిన ఇసుక లారీ డ్రైవర్ గట్టు అశోక్ (45) బుధవారం రాత్రి మహదేవ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు ఇసుక లారీతో బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో చింతగట్టు ఔటర్ రింగు రోడ్డుపై మూడు రోజులుగా ఆగి ఉన్న లారీని వేగంగా వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రెండు లారీలు నుజ్జు నుజ్జు అయి లారీ డ్రైవర్ అశోక్ మధ్యలో చిక్కుకొని ఆర్తనాదాలు చేశారు. సుమారు రాత్రి 11.30గంటల ప్రాంతంలో ఘటన జరగగా, స్థానికులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని గమనించి స్థానికులు, పోలీసుల, జేసీబీ సహాయంతో డ్రైవర్‌ను మూడుగంటల పాటు శ్రమించి బయటకు తీసి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ఎంజీఎంకు తరలించగా అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్‌ను కాపాడడంతో కీలకంగా వ్యవహరించిన 108 సిబ్బందిని, కేయూ పోలీసులను స్థానికులు అభినందించారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా శ్రీనివాసన్



వరంగల్ లీగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా న్యాయవాది దయాన్ శ్రీనివాసన్, కన్వీనర్‌గా న్యాయవాది సిద్ధం యుగంధర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ ఈ మేరకు నియామక ప్రకటన జారీ చేశారు. వైస్ చైర్మన్లుగా సీహెచ్.రవికుమార్, ఎన్‌పీ రమణారెడ్డి, ఎ.ముకుందరావు, షేక్ అబిబుద్దీన్ అలీ అహ్మద్, పోషిని రవీందర్, జాయింట్ కన్వీనర్లుగా నూనావత్ రమేష్ నాయక్, కొండపాక కృష్ణ, అజార్ పాషా, యు.కృష్ణారావు, గడ్డం విష్ణువర్ధన్, అధికార ప్రతినిధిగా వరప్రసాద్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా తమ నియామకానికి తోడ్పాటు అందించిన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, లీగల్ సెల్ నాయకులు నిమ్మాని శేఖర్‌రావు, ముదసర్ అహ్మద్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పర్వదినం

మీకోసం నేనున్నానని...

క్రిస్మస్ కథ... దేవుని పుత్రుడైన ఏసు క్రీస్తు మానవుడిగా మారిన కథ. తన ప్రియ సుతుడైన ఏసును ఈ లోకానికి దేవుడు రక్షకునిగా పంపాడు. ఆయన రాకను దేవదూత ముందుగానే ప్రకటిస్తూ... ఏసు జననం మానవాళి అందరికీ గొప్ప ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పాడు. ఆయన జననం ఈ లోకానికి ఒక శుభవార్త. ఒక శుభవార్తను వినడం ఒక వేడుకైన సందర్భం. ఆ సందర్భమే ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకొనే క్రిస్మస్ పర్వదినం అయ్యింది.



మానవులు దైవం నిర్దేశించిన మార్గాన్ని విడిచిపెట్టి జీవితాన్ని పాప భూయిష్టంగా, దుఃఖమయంగా మార్చుకున్నారు. తనను ధిక్కరించినప్పటికీ మానవుల మీద దేవుడు ఆగ్రహించలేదు. వారిని ఉద్ధరించాలని, మంచిదోవ చూపాలని సంకల్పించాడు. 'దేవుడికి మనమంటే ఎందుకింత ప్రేమ?' అనే ప్రశ్నకు 'ఆయనే ప్రేమ' అనేది యోహాను ఇచ్చిన సమాధానం. అందుకే మనల్ని పాపాల నుంచి, కష్టాల నుంచి కాపాడడం కోసం స్వయంగా తన పుత్రుడినే భూమిపైకి పంపాడు. అలా రక్షకుడిగా ఏసు ప్రభువు ఇలపై అవతరించాడు.

పాపం నుంచి, మరణం నుంచి, దుఃఖం నుంచి మనకు విముక్తి కల్పించడానికి అవతరించిన ఏసుక్రీస్తు... మనలో ఒకడిగా మెలిగాడు. మానవాళితో విడదీయరాని, శాశ్వతమైన బంధాన్ని ఏర్పరచుకున్నాడు. మనకోసం ఒక సేవకుడి స్వభావాన్ని స్వీకరించాడు. ఆర్తులకు, దీనులకు 'మీకోసం నేనున్నా'నని ధైర్యం చెప్పాడు. దారితప్పిన మానవాళికి తన నడవడిక ద్వారా, తన బోధనల ద్వారా గమ్యాన్ని చూపించాడు. రెండువేల ఏళ్ల క్రితం బెత్లెహేములోని ఒక పశువుల పాకలో సామాన్యుడిగా జన్మించిన ఆయన లోకాన్ని శాంతిమయంగా, కరుణాపూరితంగా చేయాలని తపించాడు. ఈ లోకాన్ని పాపాల నుంచి విముక్తి కలిగించడం కోసం స్వయంగా శిలువను ఎక్కి ప్రాణాలు అర్పించాడు. ఈ లోకంలో ఆయన జీవించినది కేవలం ముప్పై మూడేళ్ళే. కానీ ఎన్ని యుగాలకైనా శాశ్వతంగా నిలిచే సందేశాన్ని అందించాడు.

'దేవుణ్ణి ప్రేమించండి, మిమ్మల్ని మీరు ప్రేమించుకున్నట్టే పొరుగువారిని ప్రేమించండి...' ఈ మాటలను ఆయన బోధనలకు ప్రధాన సారంగా చెప్పుకోవచ్చు. ఏసు క్రీస్తు ఆవిర్భావం ఒక నవశకానికి నాంది. మానవ చరిత్రలో ఒక మహోన్నతమైన ఘట్టం. దాని విశిష్టతను, పవిత్రతను, ప్రాధాన్యతను గుర్తు చేసుకుంటూ... ఆయన పుట్టినరోజుగా క్రిస్మస్‌ను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. ఈ పవిత్రమైన రోజున చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఏసు ప్రబోధించిన ప్రధాన సూత్రాలు... ప్రేమ, క్షమ, దయ. ప్రతి మనిషీ తనలో ఈ గుణాలను పెంచుకున్నప్పుడు ప్రపంచం ఆనందమయమవుతుంది. వాటిని పెంపొందించుకోవాలనే సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకొనేటే క్రిస్మస్ పర్వదినం సార్థకమవుతుంది.

చింతన

ప్రపంచ చరిత్ర అంతటా ఎందరో సంస్కర్తలు, మతప్రవక్తలు మానవుణ్ణి సంస్కారవంతుడిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించారు. సమాజంలో అన్యాయం వల్ల అలమటిస్తున్న ప్రజానీకం బతుకులను బాగుపరచడానికి పాటుపడ్డారు. కానీ రాతియుగంలో బతికిన మనిషికి, ఈనాటి మనిషికి మధ్య ఏమాత్రం భేదం లేదని అనడం అతిశయోక్తి కాదు. ఎన్నో వేల సంవత్సరాల పరిణామం తరువాత కూడా మనిషిలో అదే స్వార్థం, అసూయ, ద్వేషం, క్రౌర్యం, నిర్దయ. బుద్ధుడు, మహావీరుడు ప్రసాదించిన ప్రవచనాల ప్రభావం మనిషిమీద కాస్తయినా కనిపించదు. వారు

అయినా మనిషి మారలేదు!

బోధించిన సత్యం, అహింసల ప్రేరణతో... ప్రజలను కూడగట్టి, తెల్ల దొరలను మన దేశం నుంచి పారద్రోలారు మహాత్మా గాంధీ. కానీ 1947లో జరిగిన దారుణమైన మతకలహాలు, వాటి వల్ల లక్షలాది మంది ప్రజలు బలి కావడం మహాత్ముడికి ఎంత దుఃఖం కలిగించాయంటే... అలాంటి పరిస్థితుల్లో మరణమే మేలనుకున్నారు. విశ్వ మానవ స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆశయాలతో ప్రారంభమైన ఫ్రెంచి విప్లవం... దానికి భిన్నంగా మనిషిలో దాగి ఉండే హద్దులు లేని క్రౌర్యాన్ని బహిర్గతం చేసి, వేలాది ప్రజల ప్రాణాలను బలి తీసుకుంది. "ఆశయాలు ఉత్కృష్టమైనవి అయినా, అవి మనిషిలోని నీచత్వాన్ని, క్రౌర్యాన్ని, అవినీతిని తగ్గించవు. మనిషిని కొంచమైనా మార్చలేవు" అని జిడ్డు కృష్ణమూర్తి చాటి చెప్పే సత్యానికి రష్యన్ విప్లవం ఒక తిరుగులేని రుజువు.

సంపూర్ణ చర్య

సంస్కరణలు, విప్లవాలు ఎందువల్ల విఫలమవుతాయి? అన్ని ఉద్యమాల వెనుక ఆశయాలు, భావాలు, నిర్వచనాలు ఉంటాయి. ఇవన్నీ వర్తమానంలో ఉండే పరిస్థితులను బాగుపరచాలనుకొనే ఆలోచనలు. ప్రతి ఆలోచన గతంతో ముడిపడి ఉంటుంది. మనం ఏ ఆలోచనను విశ్లేషించి చూసినా ఆ విషయం అర్థమవుతుంది. గతంలో ఉద్భవించి, గతంలోనే పరిభ్రమించే ఆలోచనలకు, వాటిద్వారా ప్రేరేపితం అయ్యే చేతలకు వర్తమానాన్ని మార్చే దక్షత ఉండదు. సంస్కర్తల, విప్లవకారుల ఆశయాలు, వారి వ్యూహాలు... గతంలో చిక్కుకుపోయిన ఆలోచనలు. గతంలో పుట్టి, వర్తమానాన్ని మార్చాలని అనుకొనే చేతలను 'ఖండిత చర్యలు' అంటారు కృష్ణ



మూర్తి. అవి పరస్పరం ఖండించుకుంటూ, గతానికీ, వర్తమానానికీ మధ్య జరిగే ఘర్షణలో శక్తిని కోల్పోతాయి. సంపూర్ణ చర్య దీనికి భిన్నమైనది. అది వర్తమానంలో పుడుతుంది. మనిషిని క్షణంలో, సంపూర్ణంగా మారుస్తుంది. "అలాంటి అంతర్పరివర్తన జరిగిన వ్యక్తులు పదిమందైనా చాలు, ఈ ప్రపంచాన్ని ఆమూలాగ్రం మార్చడానికి"అన్నారు కృష్ణమూర్తి.

ఆలోచనా ప్రక్రియను అర్థం చేసుకోవాలి...

'సంస్కరణలు విప్లవాలు మనిషిని, సమాజాన్ని మార్చగలవా?' అనేది కాదు అసలు ప్రశ్న. మనిషి గతంలో పరిభ్రమిస్తున్న ఆలోచనలను వదిలించుకొని, వర్తమానాన్ని దర్శించగలడా? గతాన్ని సంపూర్ణంగా అధిగమించిన దృక్పథానికి ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి ఉంటుంది. అంటే 'గతం, వర్తమానం, భవిష్యత్తు... ఇలా కాలం అంటే ఏమిటి? అది ఎలా ఉద్భవిస్తుంది? ఆలోచన గతంతో ఎలా ముడిపడి ఉంది?' అనే విషయాలను మనిషి ప్రప్రథమంగా అర్థం చేసుకోవాలి. అలాగే 'ఆలోచించడం' అనే ప్రక్రియని కూడా పూర్తిగా అర్థం చేసుకోవాలి. గతం ప్రభావంలో ఉండే ఆలోచన తెలివిని అంటే ప్రజ్ఞను ఉపయోగించుకుంటుంది. అందువల్ల తెలివి పరిమితం అవుతుంది. ఆలోచన తనను తానే ఖండించుకుంటుంది. అలాకాకుండా, మనిషి గతాన్ని నిశ్శేషంగా అధిగమించినప్పుడు... చైతన్యంలో అఖండమైన ప్రజ్ఞ ఉదయించి, ఆలోచన స్వభావం పూర్తిగా మారిపోతుంది. అనంతమైన, నిత్యనూతనమైన ఒక శక్తి విడుదలై... ఆలోచనను వినియోగిస్తుంది. ఈ ప్రక్రియను 'ప్రజ్ఞ యొక్క జాగృతి' అంటారు కృష్ణమూర్తి. ఇక్కడ కృష్ణమూర్తి చేసిన చర్చ... పతంజలి యోగ సూత్రాలమీద తెలిసో తెలియకో ఆయన చెప్పే ఒక భాష్యం. ఇదొక గమ్మత్తు. కృష్ణమూర్తిని కూలంకషంగా అర్థం చేసుకుంటే... పతంజలి యోగ సూత్రాలు అర్థమవుతాయి. పతంజలి యోగసూత్రాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే... కృష్ణమూర్తి గొడవ ఏమిటో తెలుస్తుంది.

• గుంటూరు వనమాలి
www.gunturu.de

అలాగైతేనే జీవితం పరిపూర్ణం

ధ్యానం ఒక క్రియ కాదు, 'ఏదీ చేయకపోవడం' అనే కళనే ధ్యానం అంటారు. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు మాత్రమే మీకు ధ్యానం తాలూకు అనుభూతి కలుగుతుంది. ఏదైనా పనిలో మనం నిమగ్నమైనప్పుడు మనస్సు అలిసిపోతుంది. ఎందుకంటే ఏకాగ్రత, ఆలోచన లేదా ఎలాంటి మానసిక కార్యకలాపమైనా... మన శారీరక శక్తిని హరించి, అలసట కలిగిస్తాయి. ధ్యానం మిమ్మల్ని అలసిపోనివ్వదు. అంతేకాదు. గాఢమైన విశ్రాంతిని కూడా అందిస్తుంది. ధ్యానం చేసే సమయంలో...

ప్రత్యేకం



మనం పంచేంద్రియాల ప్రభావానికి దూరంగా ఉంటాం. అంటే చూడడం, వినడం, వాసన చూడడం, రుచి చూడడం లాంటి పనులు చేయం. ధ్యానం నుంచి మనకు లభించే విశ్రాంతి... గాఢ నిద్రలా ఉంటుంది. కానీ ధ్యానం అనేది నిద్ర కాదు. అన్ని పనులను విడిచిపెట్టి విశ్రాంతి తీసుకోవడమే ధ్యానం.

> మనం నడవడం, పని చేయడం, మాట్లాడడం, చూడడం, వినడం, వాసన చూడడం, రుచి చూడడం, ఆలోచించడం మానేసినప్పుడు మాత్రమే నిద్ర వస్తుంది. అయితే శ్వాస తీసుకోవడం, గుండె కొట్టుకోవడం, ఆహారం జీర్ణం కావడం, రక్త ప్రసరణ తదితర కొన్ని అసంకల్పిత కార్యకలాపాలు నిద్రలో కూడా కొనసాగుతాయి. అందుకే నిద్రలో సైతం మనకు పూర్తి విశ్రాంతి కలగదు.

ఆ తత్త్వమే చైతన్యశక్తి...

మనిషి చైతన్య శక్తిలో నాలుగు స్థితులు ఉంటాయి. అవి: జాగ్రదావస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ, ధ్యానావస్థ. నిద్రలో ఉన్నప్పుడు మీరు మేలుకొనే ఉంటారు, కానీ గాఢమైన విశ్రాంతిలో ఉంటారు. మనస్సు స్థిరంగా ఉన్నప్పుడే మీరు ధ్యానం చేయగలరు. శబ్దం నుంచి మౌనం వరకు, కదలిక నుంచి నిశ్చలత వరకూ చేసే ప్రయాణమే ధ్యానం. పనులు, ధ్యానం... ఈ రెండూ ఒకదానికొకటి భిన్నంగా అనిపించినప్పటికీ, అవి ఒకదానికి ఒకటి పూరకాలు. ఈ ప్రపంచంలో అన్నీ మారుతున్నాయని మనం గమనిస్తూ ఉంటాం. మనలో మారనిది ఏదో ఉంది. మనలో స్థిరంగా ఉండే తత్త్వాన్నే 'ఆత్మ' లేదా 'చైతన్యశక్తి' ఉంటారు. మన చైతన్య శక్తిలో ఎప్పుడూ స్థిరంగా ఉండే ఆ తత్త్వం వైపు మనం చేసే ప్రయాణమే ధ్యానం.

దేన్నీ వ్యతిరేకించకండి...

మనసులో కోరికలు ఉంటే మనం ధ్యానం చెయ్యలేం. అందుకే "అన్ని రకాల సంకల్పాలను విడిచిపెట్టేవరకూ మనస్సు శాంతించదు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఉదాహరణకు... మీరు నిద్రపోయేముందు లైటు ఆపాలని అనుకున్నారు. కానీ ఆపలేదు. మీరు నిద్రపోదామని ఎంత ప్రయత్నించినా... లైటు ఆపనిదే నిద్రపోలేరు. మీ మనస్సు లైటు ఆపడం గురించే ఆలోచిస్తూ ఉంటుంది. అలాగే ఇసుక రేణువు మీ కంటిలో పడితే మీరు పూర్తిగా కళ్ళు మూసుకోలేరు, అలాగని కళ్ళు పూర్తిగా తెరిచి ఉంచలేరు. అదే విధంగా మనసులో ఉండే ఆలోచన విమ్మల్ని బాధిస్తూ ఉంటుంది. అందుకే మనస్సును శాంతిపజేయడానికి వైరాగ్యం అవసరం. ఏదో ఒక రోజు మృత్యువు రావడం అనివార్యం. మృత్యువుపట్ల జ్ఞానం మనసును శాంతింపజేస్తుంది, వైరాగ్యాన్ని ప్రసాదిస్తుంది. వైరాగ్యం గాఢమైన ధ్యానంలోకి వెళ్ళడానికి సహాయపడుతుంది. యోగాసనాలు, ప్రాణాయామం, సమతుల్యమైన ఆహారం, వివేకం... ఇవన్నీ ధ్యానం చక్కగా జరగడానికి సాయపడతాయి. చాలామంది ధ్యానం చేసేటప్పుడు ఎలాంటి శబ్దాలు ఉండకూడదని అనుకుంటారు. ఇది సరైన అవగాహన కాదు. ధ్యానం చేసేటప్పుడు శబ్దాలు వినిపిస్తే... వాటిని జాగ్రత్తగా వినండి. మీరు దేనినైతే ఎక్కువగా వ్యతిరేకిస్తారో... అది మరింత ప్రబలమై విమ్మల్ని బాధపెడుతుంది. కాబట్టి ధ్యానం చేసే సమయంలో దేనినీ వ్యతిరేకించకండి.

ఆహారాల్లో మూడు రకాలు


ధ్యానం బాగా జరగాలంటే ప్రాణాయామం చెయ్యాలి. ప్రాణాయామం మనసును స్థిరంగా ఉంచుతుంది. ధ్యానాన్ని సులభతరం చేస్తుంది. మనం తీసుకొనే ఆహారం కూడా ధ్యానంపై ప్రభావం చూపిస్తుంది. ఆహారంలో మూడు రకాలు ఉంటాయి, అవి: సాత్విక, రాజసిక, తామసిక ఆహారం. తామసిక ఆహారం శరీరంలో అలసటను, మగతను, జడత్వాన్ని కలిగిస్తుంది. శరీరంలో తమస్సు ఎక్కువగా ఉంటే... మీకు ధ్యానం చేసేటప్పుడు నిద్ర వస్తుంది. శరీరంలో రజస్సు ఎక్కువగా ఉంటే మనసు స్థిరంగా ఉండదు. చిన్న విషయాలకే ఎక్కువ బాధ లేదా అతిగా సంతోషం కలుగుతాయి. రజస్సు అసమతుల్యంగా ఉన్నప్పుడు ఎక్కువ ఆలోచనలు వస్తాయి. మనసు శాంతంగా ఉండదు. శరీరం స్థిరంగా ఉండదు. అలా ఉంటే ధ్యానం సరిగ్గా జరగదు. దీని అర్థం మీరు రాజసిక ఆహారాన్ని పూర్తిగా విడిచిపెట్టాలని కాదు. మనం ఎల్లప్పుడూ ప్రశాంతంగా, ఒకే స్థితిలో ఉంటే జీవితాన్ని ఆస్వాదించలేం. కొంచెం రజస్సు ఉండే జీవితం ఆసక్తికరంగా ఉంటుంది. కానీ రజస్సు ఎక్కువైతే సాత్విక ఆహారం తీసుకోవాలి. సాత్విక ఆహారం తేలికగా ఉంటుంది, సులభంగా జీర్ణం అవుతుంది. త్రిదోషాల నుంచి శరీరానికి విముక్తి కలిగించి, ధ్యానం బాగా కొనసాగడానికి సహాయపడుతుంది. ధ్యానం వల్ల జీవితంలో... భౌతిక, ఆధ్యాత్మిక స్థాయిల్లో పరిపూర్ణత వస్తుంది. అంటే జీవితం పరిపూర్ణం అవుతుంది. యోగా, ప్రాణాయామం, ధ్యానాలకు సంబంధించిన జ్ఞానం భారతదేశంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం మన అదృష్టం. ధ్యానాన్ని మీ దినచర్యలో భాగం చేసుకోండి.

• గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్

రేపు ప్రపంచ ధ్యాన దినోత్సవం

సహజయోగ

ధ్యానం ఎందుకు చేయాలి?



మన దేశం యోగభూమి. ఇందులో ప్రతి అణువు దైవికమైన చైతన్యంతో నిండి ఉంటుంది. యోగ, ధ్యానం భారతీయ సంస్కృతిలో అంతర్భాగాలు. అటువంటి ధ్యానానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. డిసెంబర్ 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కొన్నేళ్ళ క్రితం ప్రకటించింది. ఈ సందర్భంగా ధ్యానం అంటే ఏమిటి? దాన్ని ఎలా చెయ్యాలి? దానివల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి? అనే అంశాల గురించి సహజ యోగ ధ్యాన పద్ధతిని ఆవిష్కరించిన శ్రీమాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ద్వారా తెలుసుకుందాం.

అదే మానవ జన్మ పరమార్థం

ధ్యానం అంటే మీరు మీ ఆత్మతో ఒకటిగా ఉండే స్థితి. ఆ స్థితి నిర్విచార స్థితిలో లభిస్తుంది. అందులోనే ఆత్మతత్త్వం వృద్ధి చెందుతుంది. నిర్విచార స్థితి అంటే ఆలోచనారహిత స్థితి. ధ్యానం భగవంతుడితో ఎంత సుందరమైన అనుబంధాన్ని ఏర్పరుస్తుందంటే... మన సమస్యలన్నీ ఆ ధ్యానావస్థలో వాటంతట అవే పరిష్కారమవుతాయి. ఎందుకంటే ధ్యానం మనల్ని మనం అంతర్గతంగా భగవంతుడికి సమర్పించుకొనే పూజ. మనల్ని మనం తెలుసుకోవాలంటే మనం ఇంకా సూక్ష్మంగా మారాలి. మన లోపలికి చూసుకోగలగాలి. అప్పుడే 'మనం ఆత్మస్వరూపులం' అని తెలుస్తుంది. మానవుడి ఆధ్యాత్మిక ఉత్థానం కోసం... కుడి పార్శ్వం, ఎడమ పార్శ్వం కాకుండా... మధ్యే మార్గం అయిన సుషుమ్నా నాడిపై ప్రయాణం చేయాలని గ్రహించిన గోరఖ్‌నాథ్, ఆదినాథ్, మశ్చీంద్రనాథ్ లాంటి యోగిపుంగవులు మన దేశంలో ఉండేవారు. వారు మానవుల సమస్యలను కూలంకషంగా అధ్యయనం చేశారు. మానవునిలో ఆధ్యాత్మిక ఉన్నతిని ఏ విధంగా సుసాధ్యం ఎలా చేయాలో శోధించి, ఒక పరిష్కార మార్గాన్ని కనుగొన్నారు. మానవుల వెన్నెముక చివరి భాగంలో త్రికోణాకారంలో ఉండే సాక్రమ్ ఎముకలో అవశిష్టమై ఉన్న ఒక దివ్యశక్తిని వారు గుర్తించారు. ఇది అందరిలో జన్మతః ఉంటుంది. మానవులు సాధించాల్సిన అత్యున్నత స్థితి లేదా అంతిమ లక్ష్యం... శాశ్వతమైన ఆ శక్తిని కనుక్కోవడమే. అదే మనలోని ఆత్మ. ఆత్మతో మనం ఏకీకరణ కావడమే మానవ జన్మ పరమార్థం. అదే సహజయోగ మూల సూత్రం. మనం బాల్యంలో బాహ్యపరంగా ఆ దైవశక్తితో పూర్తి అనుసంధానత కలిగి ఉంటాం. కాని పెరిగి పెద్దయ్యాక... మనలో అరిషడ్వర్గాలు, ఆలోచనలు లాంటి అవరోధాలు పెరుగుతాయి. భగవంతుడితో బాహ్యమైన ఆ సంబంధాన్ని కోల్పోతాం.

> అలజడితో ఉన్న సరస్సు ఆకాశంలోని సూర్యుణ్ణి సరిగ్గా ప్రతిబింబించలేదు. అదే విధంగా ఆలోచనల సుడులు తిరుగుతున్న మనసు... సర్వవ్యాపితమైన దైవశక్తిని సరిగ్గా ప్రతిబింబించలేదు. కాబట్టి ఆలోచనలన్నిటినీ నిశ్శబ్దం చెయ్యాలి. తద్వారా ప్రశాంతతను పొందిన మనస్సు మన మెదడులో వివేకం కలిగిస్తుంది. అప్పుడు హృదయం, మెదడు, చిత్తం... ఈ మూడు ఏకీకరణ చెందుతాయి. మనం ఏ పనినైనా సమర్థవంతంగా చేయగలుగుతాం.

ఆ మూడూ ఏకీకరణ చెందితే...

మనలోని కుండలినీ శక్తి జాగృతమై, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, సర్వవ్యాపిత దివ్యశక్తితో అనుసంధానం కావాలి. అదే ఆత్మసాక్షాత్కారం. ఈ శక్తి మనలోపలే అంతర్గతంగా నిక్షిప్తమై ఉంది. కుండలినీశక్తి జాగృతం అయియినప్పుడు, ఆ శక్తి ఆరు కేంద్రాలద్వారా పయనించి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, పరమ చైతన్యశక్తితో అనుసంధానమైనప్పుడు... ఆ స్థితి మన భౌతిక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని పరిపుష్టం చేస్తుంది. సహజయోగ ధ్యానంలో ఇది సునాయాసంగా జరుగుతుంది.

అదొక్కటే మార్గం...

'ధ్యానం సర్వార్థ సాధనమ్...' అంటే ధ్యానం వల్ల ఆధ్యాత్మిక ప్రయోజనాలు మాత్రమే కాకుండా... అనేక రకాల ప్రయోజనాలు లభిస్తాయి. అంతర్గతమైన, బాహ్యపరమైన ఎదుగుదల కలుగుతుంది. మనలోని చక్రనాడులన్నీ శక్తిమంతం కావడం వల్ల సద్గుణాలు పెంపొందుతాయి. తద్వారా మీతోపాటు మీ చుట్టూ ఉన్న సమాజం కూడా ప్రయోజనం పొందుతుంది. మీలో నిక్షిప్తమైన ఈ నిధిని సాధించడం ద్వారా మీ దుఃఖాలకు, సమస్యలకు అతీతంగా ఉంటారు. ధ్యానంలో స్థిరపడాలంటే... పసిపిల్లల్లో ప్రతిబింబించే అమాయకత్వం, నిర్మలత్వం మీలో ప్రతిఫలించాలి. ధ్యానం ద్వారా చిత్తం అంతర్ముఖంగా వెళ్ళి... లోపాలు సరిదిద్దుకొనే స్థాయికి చేరుకోవాలి. ధ్యానంద్వారానే ధర్మిక శక్తిని, విచక్షణ శక్తిని, క్షమాగుణాన్ని పెంపొందించుకోగలుగుతాం. మనకు సంతృప్తిని, శాంతిని, ప్రశాంతతను ఇవ్వాలని, సమాజహితమైన, ప్రపంచ మానవాళికి శ్రేయస్సు కలిగించే వాటిని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించడానికి, ఆ వినతిని ఆయన దృష్టికి తీసుకువెళ్ళడానికి వాస్తవికమైన మార్గం ధ్యానం ఒక్కటే. మనం ప్రార్థనలో కోరుకొనే కోరికలకు ఆయన సమాధానం కానీ, పరిష్కారం కానీ ధ్యానం ద్వారానే దొరుకుతుందనేది సహజయోగ సాధకులు అనుభవపూర్వకంగా తెలుసుకున్న సత్యం.


డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



ఆత్మను ఎవరైనా చూశారా?

పాయాసి తన రెండో వాదాన్ని సమర్థించుకుంటూ "ఒకవేళ ఈ లోకంలో చేసిన సత్కర్మల ఫలితం స్వర్గలోకంలోనే దొరికితే... ఆ ఫలాన్ని స్వర్గలోకంలోనే అనుభవించాలి కదా! వాటిని అనుభవించడానికి మళ్ళీ ఈ లోకానికి ఎందుకు రావాలి? అలాగే... పుణ్యకర్మలను ఆచరించే మానవులు ఆత్మహత్య ఎందుకు చేసుకోరు? ఆత్మహత్య ద్వారా వారు త్వరగా స్వర్గలోకానికి చేరుకొని, అక్కడ సకల భోగాలు అనుభవించవచ్చు కదా?" అని ప్రశ్నించాడు. అప్పుడు కుమార కాశ్యపుడు "మునుపు ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉండేవారు. మొదటి భార్యకు ఒక కొడుకు ఉన్నాడు. రెండో భార్య గర్భవతిగానే ఉంది. ఆ పరిస్థితుల్లో ఆ వ్యక్తి మరణించాడు. ఆ తరువాత మొదటి భార్య కొడుకు తన సవతి తల్లితో "ఈ ఇంట్లో నీదంటూ కించిత్తు ఆస్తి కూడా లేదు" అన్నాడు. తనకు కొడుకు పుడితే వాడికి కూడా ఆస్తిలో సగభాగం ఉంటుందనీ, అమ్మాయి పుడితే ఆ బిడ్డను పోషించే బాధ్యత పెద్ద భార్య కొడుకుదేననీ ఆమె చెప్పింది. కానీ ఆ పిల్లవాడు "ఈ ఇంట్లో నీదంటూ కించిత్తు ఆస్తి లేదు" అనే మాటను పదేపదే వల్లిస్తూ ఉండేవాడు. అతడి ప్రవర్తనతో భీతిల్లిన ఆమె ప్రసవ సమయం రాకముందే బిడ్డను కనాలని తన పొట్టను కోసుకుంది. ఫలితంగా ఆమె మరణించడమే కాదు, ఆమె గర్భంలోని శిశువు కూడా మృతి చెందింది. అందుకే ఓ రాజా! పుణ్యాత్ములు స్వర్గప్రాప్తికోసం త్వరపడరు. కర్మ పరిపాకం కోసం ప్రతీక్షిస్తూ, ప్రజలకు మేలు చేస్తూనే ఉంటారు" అని చెప్పాడు.

ధర్మపథం



దాన్ని చూడలేరు...

ఆ తరువాత తన మూడోవాదాన్ని పాయాసి వినిపిస్తూ "ఒకవేళ ఆత్మే గనుక ఉన్నట్టైతే, అది శరీరం నుంచి బయటకు వెళ్ళిపోవడం వల్లే మరణం సంభవిస్తుందని భావిస్తే... మరి మరణం తరువాత మనిషి నుంచి ఆత్మ ఎక్కడి నుంచి, ఎలా బయటకు వెళుతుంది? దీన్ని ఎవరైనా చూశారా? మరణించే మనిషిని గమనిస్తున్నప్పుడు... ఆత్మ ఎప్పుడు, ఎలా బయటకు వెళుతుంది? శరీరంలోని ఏ అంగం ద్వారా బహిర్గతం అవుతుంది? అనే విషయం అంతుపట్టదు. పైగా ఆత్మ శరీరాన్ని వదిలిన తరువాత.. మరణించిన వ్యక్తి శరీరం తేలిక కావడానికి బదులు మరింత బరువవుతుంది" అన్నాడు. ఈ వాదాన్ని కుమార కాశ్యపుడు ఖండిస్తూ "మరణ సమయంలో ఆత్మ బయటకు వెళుతుంది. కానీ దాన్ని ఎవరూ చూడలేరు. అది ఎలా అంటే... స్వప్నంలో జీవుడు రకరకాల స్థలాలలో పరిభ్రమిస్తూ... తనకు ఇష్టం వచ్చినదాన్ని చూస్తాడు. తనకు ఇష్టం వచ్చిన దానిలోకి వెళ్తాడు. కానీ అతణ్ణి ద్వారపాలకుడు కానీ, తోటమాలి కానీ ఆపలేడు సరికదా.. కనీసం చూడనైనా లేరు. అలాగే ప్రాణం, శ్వాస, జ్ఞానేంద్రియాలతో కూడి ఉన్నప్పుడు శరీరం తేలికగా ఉంటుంది. కానీ అవి లేనప్పుడు బరువెక్కిపోతుంది. ఇలా వీటి ఆధారంగా జీవుడు పరలోకానికి వెళ్ళడు, అసలు 'పరలోకం లేదు' అనడం మూర్ఖత్వం అన్నాడు. అయితే ఇక్కడ కుమార కాశ్యపుడు ఆత్మకు బదులు ఆయుర్విజ్ఞాన వాయువులను పేర్కొన్నాడు. వాటిని 'ఆత్మ' అని అనలేదు. ఆత్మ లేదని కూడా చెప్పలేదు. కానీ పరలోకాల గురించి చాలా దృఢంగా ప్రతిపాదించాడు. అతని మాటల్లో స్థవిరవాదుల సిద్ధాంతం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాచీన బౌద్ధులు శరీరాంతర్గతమైన చైతన్యాన్ని సూటిగా కాకుండా మరో విధంగా ఒప్పుకున్నారు. కాగా పాయాసి మళ్ళీ తన సిద్ధాంతాన్ని చైతన్యం ఆధారంగా సమర్థించుకోవాలని ప్రయత్నించాడు. "ఇంద్రియాలన్నీ ఉన్నా మరణం ఆసన్నమైన వ్యక్తి ఎందుకు చూడలేడు, వినలేడు, మాట్లాడలేడు?" అని ప్రశ్నించాడు.

> పాయాసి పునర్జన్మ సిద్ధాంతాన్ని ఎలాంటి సాధన లేకుండానే తెలుసుకోవాలనుకున్నాడు. కాబట్టి ఆ విషయం అతనికి అర్థం కాలేదు. అందుకే అతను పాలీ సాహిత్యంలో ఒక మిథ్యా వాదిగా, భౌతిక వాదిగా మిగిలిపోయాడు. బుద్ధ భగవానుడి శిష్యులు నాస్తికతను, భౌతికతను ఖండించి, సమాజంలో ఆస్తికతను పెంపొందించారు. దానికి పాయాసి- కుమార కాశ్యపుల వృత్తాంతం బలమైన నిదర్శనం.

అప్పుడు కుమార కాశ్యపుడు "శంఖానికి ధ్వనించే శక్తి ఉన్నా... ఒక వ్యక్తి దాన్ని తీసుకొని ఊదేవరకూ ధ్వనించదు. అదే విధంగా శరీరంలో ఆయువు, శ్వాస, విజ్ఞానం ఉన్నప్పుడే దానిలో చలనం ఉంటుంది. ఇవన్నీ శరీరంలో ఉన్నప్పుడే ఇంద్రియాలు తమతమ విషయాలను గ్రహించగలుగుతాయి" అని చెప్పాడు.

పద్ధతి సరైనది కాకపోతే...

చివరిగా... జీవుడు శరీరం నుంచి వేరయ్యే దృశ్యాన్ని చూడాలని పాయాసి అనుకున్నాడు. మరణం దగ్గరపడిన ఒక వ్యక్తిని ఖండ ఖండాలుగా నరికి, ఆత్మ శరీరం నుంచి ఎలా బహిర్గతం అవుతుందో చూడడానికి ప్రయత్నించాడు. కానీ అతని ప్రయత్నం విఫలమైంది. జీవుడు కనిపించలేదు. దాంతో అతనిలోని నాస్తికత ఇంకా దృఢపడింది. పాయాసి నాస్తికతను పోగొట్టడానికి బుద్ధుడి శిష్యుడైన కుమార కాశ్యపుడు చాలా ప్రయత్నించాడు. అగ్ని ప్రజ్వలించే ప్రక్రియను ఉదాహరిస్తూ "అరణ్యంలో ఉండే ఒక అగ్ని ఉపాసకుడికి ఒక పిల్లవాడు లభించాడు. ఆ పిల్లవాణ్ణి అతను పెంచాడు. ఆ బాలుడు పెరిగి పన్నెండేళ్ళ వయసువాడయ్యాడు. ఒక రోజు ఆ అగ్ని ఉపాసకుడు దగ్గరలో ఉన్న గ్రామానికి వెళ్తూ, తన అగ్ని ప్రజ్వలన కార్యాన్ని పిల్లవాడికి అప్పగించాడు. అగ్ని ఒకవేళ ఆరిపోతే... ఈ కర్రలు సమిధులు తదితరాలను ఉపయోగించి మళ్ళీ ప్రజ్వరిల్లజేయమన్నాడు. అతను వెళ్ళాక ఆ పిల్లవాడు ఆటలలో మునిగి అగ్నిహోత్రాన్ని పట్టించుకోకపోవడంతో... అది చల్లారిపోయింది. దాన్ని రాజెయ్యడానికి అతను ప్రయత్నించినప్పటికీ, అతను అనుసరించిన పద్ధతి సరైనది కాకపోవడంతో ఫలితం లేకపోయింది. కొద్దిరోజుల తరువాత ఆ అగ్ని ఉపాసకుడు తిరిగి వచ్చాడు, అగ్ని చల్లారిన విషయం గ్రహించాడు. ఆ పిల్లవాడితో "నీకు అగ్ని పుట్టించే పద్ధతి తెలియదు. అందుకే నీవు చేయలేకపోయావు" అన్నాడు. తరువాత అరణులను ఉపయోగించి త్వరగా అగ్నిని వెలిగించాడు. కాబట్టి ఓ రాజా! నువ్వు కూడా అవివేకి అయిన బాలుడిలా... సరైన పద్ధతి లేకుండా పరలోకాన్ని అన్వేషిస్తున్నావు. ఈ వ్యర్థమైన పరలోక చింతనలో నీ జీవితం దుఃఖమయం అయిపోగలదు" అంటూ పాయాసి వాదనలన్నిటినీ ఖండించాడు. పరలోకం ఉందని, పాపపుణ్యాలు, వాటి ఫలితాలు ఉన్నాయని నిరూపించాడు.

(ఆధారం: 'సుత్తపిటకం'లోని ప్రథమ నికాయమైన 'దీఘనికాయం'లో భాగమైన పాయాసి రాజ సుత్తము)




ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు,
జేఎన్‌యు, న్యూఢిల్లీ.
91 98189 69756











రామ్‌చరణ్ గొప్ప నటుడు

డైరెక్టర్ శంకర్

రామ్‌చరణ్, డైరెక్టర్ ఎస్.శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించారు. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ సినిమా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు శంకర్ సినిమాకు సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. హీరోగా రామ్‌చరణ్‌ను ఎంపిక చేసుకోవడానికి గల కారణాన్ని వివరిస్తూ "ఇందులో రామ్‌చరణ్ నటిస్తే బాగుంటుందని దిల్ రాజు భావించారు. నాకు కూడా ఇదే కరెక్ట్ అనిపించింది. నా కథల్లో యూనివర్సల్ అప్పీల్ ఉంటుంది. కాబట్టి ఓ పెద్ద హీరో అయితే బాగుంటుందని రామ్‌చరణ్‌తో ప్రయాణం ప్రారంభించాం. ఆయన గొప్ప నటుడు. అద్భుతమైన స్ర్కీన్ ప్రెజెన్స్ ఉన్న ఆయన ఎలాంటి సీన్ అయినా అద్భుతంగా, అందంగా హ్యాండిల్ చేస్తారు. అవినీతిలో కూరుకుపోయిన రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేసే ఐఏఎస్ అధికారిగా రామ్‌చరణ్ కనిపించనున్నారు. రాజకీయ అంశాలతో, హైయాక్షన్‌తో సినిమా అద్భుతంగా ఉండబోతుంది' అని తెలిపారు.

అంకితభావానికి ఫిదా



కీర్తి సురేశ్ ఇటీవలే వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, పెళ్లయి వారం తిరక్కుండానే కీర్తి తను నటించిన తొలి హిందీ చిత్రం 'బేబీ జాన్' ప్రమోషన్స్‌లో పాల్గొన్నారు. దీంతో అందరూ ఆమె అంకితభావానికి ఫిదా అయిపోతున్నారు. రెడ్ డ్రెస్‌లో ఆధునికంగా తయారై వచ్చినప్పటికీ, సంప్రదాయాన్ని వదలకుండా మెడలో పసుపుతాడుతో ముంబైలో చిత్రబృందం నిర్వహించిన ప్రమోషన్స్‌కి హాజరవటం అందరినీ ఆకట్టుకుంది. ఈ నెల 25న 'బేబీ జాన్' విడుదలవుతోంది. 2016లో విజయ్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వం వహించిన 'తెరీ' సినిమా ఆధారంగా రూపొందించారు. వరుణ్‌ధావణ్ కథానాయకుడిగా కలీస్ తెరకెక్కించారు. అట్లీ కథను అందించి, నిర్మించారు. తమన్ సంగీతం అందించారు. కాగా, ఈ నెల 12న కీర్తి తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌తో బంధు మిత్రుల సమక్షంలో గోవాలో తొలుత హిందూ సంప్రదాయం ప్రకారం ఏడడుగులు వేశారు. ఆ తర్వాత క్రిస్టియన్ పద్ధతిలోనూ వధూవరులు ఉంగరాలు మార్చుకున్నారు.



పోలీస్ ప్రేమగీతం

వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షి చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ కథానాయికలు. వెంకటేశ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. చిత్రం నుంచి రెండో గీతాన్ని యూనిట్ గురువారం విడుదల చేసింది. 'నా లైఫ్‌లో ఉన్న ఆ ప్రేమ పేజీ' అంటూ సాగే ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో స్వరాలందించడంతో పాటు, ప్రణవీ ఆచార్యతో కలసి ఆలపించారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదలవుతుంది.

అంతా మంచే జరుగుతుంది



'ప్రస్తుతం నా ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. నా అభిమానులు, సహ నటీనటుల ప్రేమ, ఆదరాభిమానాలు పొందుతున్నందుకు సంతోషంగా ఉంది. నా అనారోగ్య విషయాన్ని గతంలోనే వెల్లడించాను. ఈ విషయంలో సంయమనం పాటించిన మీడియాకు ధన్యవాదాలు. సర్జరీ కోసం వెళ్తున్నప్పుడు ఎవరికైనా కాస్త ఆందోళనకరంగానే ఉంటుంది' అని అన్నారు కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్. కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న శివరాజ్‌కుమార్ శస్త్ర చికిత్స కోసం అమెరికా వెళ్లారు. ఈనెల 24న ఆయనకు సర్జరీ జరగనుంది. ఎయిర్‌పోర్టు వద్ద మీడియాతో శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ఇలాంటి సమయంలో అభిమానులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులను చూసినప్పుడు కాస్త ఎమోషనల్‌గా ఫీల్ అవుతాం. అంతా మంచే జరుగుతుంది. ఎవరూ ఆందోళన చెందకండి. సర్జరీ పూర్తయ్యాక యూఐ, మ్యాక్స్ సినిమాలను తప్పకుండా చూస్తాను' అని అన్నారు.



రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్



'క'తో హిట్ కొట్టిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'దిల్‌రూబా'. రుక్సర్ థిల్లాన్ కథానాయికగా విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసి.. 'హిస్ లవ్.. హిస్ యాంగర్' అని పేర్కొన్నారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్.కె.ఎల్, సినిమాటోగ్రఫీ: డానియల్ విశ్వాస్, సంగీతం: సామ్.సీ.ఎస్.

బలగం మొగిలయ్య కన్నుమూత



'బలగం' సినిమాలో భావోద్వేగపూరిత పాటను ఆలపించి ప్రేక్షకులను కదిలించిన మొగిలియ్య(67) మృతి చెందారు. ఆయన కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయన ఆరోగ్యం క్షీణించడంతో వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మరణించారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలానికి చెందిన మొగిలయ్య, కొమురమ్మ దంపతులు తమ పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వచ్చిన కళ బుర్రకథను జీవనాధారంగా మార్చుకున్నారు. మొగిలయ్య టాలెంట్‌ను గుర్తించిన 'బలగం' చిత్ర దర్శకుడు వేణు తన సినిమాలో పాడే అవకాశం ఇచ్చారు. మొగిలయ్య, కొమురమ్మ కలసి పాడిన 'తోడుగా మా తోడుండి ...నీడలా మాతో నడిచి' అనే పాట సినిమాకే హైలెట్‌గా నిలిచింది. మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు కుమారుడు సుదర్శన్, దత్త కుమార్తె మోజేస్ ఉన్నారు. మొగిలయ్య అంత్యక్రియలు స్వగ్రామమైన దుగ్గొండిలో ముగిశాయి. మొగిలయ్య మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం సంగీత, సాహిత్య రంగాలకు తీరని లోటు అని పేర్కొన్నారు.

శ్రీతేజ్‌ను పరామర్శించిన దర్శకుడు సుకుమార్



పుష్పా 2 సినిమా ప్రీవిఎయర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్‌ను గురువారం ఆ సినిమా దర్శకుడు సుకుమార్ పరామర్శించారు. డిసెంబర్ 4న సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. ఘటన జరిగిన 15 రోజుల తరువాత ఆ సినిమా దర్శకుడు సుకుమార్ బాలుడి యోగ క్షేమాలు తెలుసుకోవడానికి కిమ్స్ ఆసుపత్రికి వచ్చి శ్రీతేజ్ ఆరోగ్య స్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

- రాంగోపాల్‌పేట్ (ఆంధ్రజ్యోతి)



ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా ఆయన సినీ జీవితంపై వచ్చిన 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పుస్తకాన్ని దర్శకుడు వంశీ ఆవిష్కరించారు. తొలి కాపీని మరో దర్శకుడు హరీశ్‌శంకర్‌కు, రెండో కాపీని నటుడు నాజర్‌కు అందజేశారు. ఫిల్మ్ జర్నలిస్ట్ పులగం చిన్నారాయణ, రవి పాడి కలసి ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు.

కేరళ ఫిల్మ్ ఫెస్టివల్‌లో...



కేరళలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఒక మంచి ప్రేమకథ' చిత్రాన్ని ప్రదర్శించారు. అక్కినేని కుటుంబరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సముద్ర ఖని, రోహిణి హట్టంగడి, రోహిణి కీలక పాత్రల్లో నటించారు. ఈ ఫెస్టివల్‌కు మధు అంబట్ రెట్రాస్పెక్టివ్‌లో 'ఒక మంచి ప్రేమ కథ'తో పాటు ఆరు భారతీయ చిత్రాలు ఎంపికయ్యాయి. నిర్మాత హిమాంశు పోపూరి, రచయిత ఓల్గా, సినిమాటోగ్రాఫర్ మధు అంబట్ అతిథులుగా హాజరయ్యారు.

అన్ని వర్గాలను అలరిస్తుంది



వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. నిర్మాత వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించింది. వంశీ నందిపాటి మాట్లాడుతూ "శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్రం ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఈ చిత్రం అలరిస్తుంది. ఈ సినిమాకు కథే హీరో. కథను నమ్మే ముందుకు వెళుతున్నాను. ఈ సినిమాతో మంచి విజయం వస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. అనన్య నాగళ్ల మాట్లాడుతూ 'నటిగా నాలోని ప్రతిభను వెలికితీసేలా ఈ చిత్రంలో నా పాత్ర ఉంటుంది. కథను మలచిన తీరు సరికొత్తగా ఉండి ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ సినిమాతో మంచి విజయం వస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
బిజినెస్
వరంగల్ ● శుక్రవారం 20 డిసెంబరు 2024

హ్యుండయ్ కార్లకు అమరాన్ ఏజీఎం బ్యాటరీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం హ్యుండయ్ మోటార్ ఇండియా (హెచ్ఎంఐఎల్) కూడా ఆత్మనిర్భర భారత్ బాట పట్టింది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం నుంచి తన కార్లలో అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈ అండ్ ఎం) అభివృద్ధి చేసిన అబ్సార్బెంట్ గ్లాస్ మ్యాట్ (ఏజీఎం) బ్యాటరీ టెక్నాలజీని ఉపయోగించనుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ ఏజీఎం బ్యాటరీ టెక్నాలజీని దేశంలోని ఒక కార్ల కంపెనీ ఉపయోగించడం ఇదే మొదటిసారి. సంప్రదాయ కంప్లీట్ మెయింటెనెన్స్ ఫ్రీ (సీఎంఎఫ్) బ్యాటరీలతో పోలిస్తే ఏజీఎం బ్యాటరీల పనితీరు అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ 150 శాతం ఎక్కువగా ఉండడంతో హ్యుండయ్ మోటార్స్ ఈ నిర్ణయం తీసుకుంది. బీఎస్6 ఫేజ్ 2 ప్రామాణికాలకు అనుగుణంగా తమ ఏజీఎం బ్యాటరీలను అభివృద్ధి చేసినట్టు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ ఈడీ హర్షవర్ధన గౌరినేని తెలిపారు.

ఈవీలపై సుంకాలు పెంచితే కష్టమే



న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాలపై సుంకాలు పెంచితే విద్యుదీకరణ ప్రయాణానికి అవరోధం ఏర్పడుతుందని కియా ఇండియా సీఈఓ గ్వాంగ్ లీ అన్నారు. కొత్త ఎస్‌యూవీ సిరోస్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాది కార్ల అమ్మకాల్లో 17 శాతం వృద్ధిని తాము ఆశిస్తున్నట్టు చెప్పారు. దేశంలో ఈవీల ధరలు ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఎలాంటి పన్ను ప్రోత్సాహకం లేకపోతే మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆవేదన ప్రకటించారు. ప్రస్తుతం దేశీయ విపణిలో రెండు ఈవీ మోడళ్ల విక్రయిస్తోంది. ఈవీ 6 ప్రారంభ ధర రూ.60.96 లక్షలు. అలాగే ఈవీ 9 ప్రారంభ ధర రూ.1.3 కోట్లుంది.


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,130 ▼	70,070 ▼	99,000 ▼
విజయవాడ	78,800 ▼	72,300 ▼	92,000 ▲
విశాఖపట్నం	76,190 ▼	69,840 ▼	88,120 ▼
రాజమండ్రి	77,127 ▼	71,700 ▲	91,800 ▼
ప్రొద్దుటూరు	78,250 ▼	72,460 ▼	89,600 ▼
ముంబై	76,013 ▼	69,628 ▼	87,035 ▼

ఫెడ్ షాక్‌కు మార్కెట్లు కుదేలు

తొలిసారి 85 కన్నా దిగజారిన రూపాయి
బులియన్‌దీ అదే దారి





80,000 దిగువకు సెన్సెక్స్

ముంబై: వచ్చే ఏడాది వడ్డీ రేట్ల కోత కేవలం రెండు విడతల్లోనే ఉంటుందని అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పోవెల్ చేసిన వ్యాఖ్య ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను కుదిపివేసింది. భారత ఈక్విటీ, బులియన్, ఫారెక్స్ మార్కెట్లు కూడా అదే ధోరణిలో స్పందించి తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి తొలిసారిగా 85 కన్నా దిగజారి మరో రికార్డు కనిష్ఠానికి పడిపోయింది.

సెన్సెక్స్ 965 పాయింట్లు డౌన్

ఈక్విటీ మార్కెట్ ఫెడ్ ప్రభావానికి తీవ్రంగా లోనయింది. భారీ అమ్మకాల ఒత్తిడి, విదేశీ నిధుల తరలింపుతో కన్స్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్, ఐటీ షేర్లు భారీ నష్టాలు నమోదు చేశాయి. వరుసగా నాలుగో రోజు కూడా నేలచూపులే చూసిన ఈక్విటీ సూచీలు మానసిక అవధులు 80,000 (సెన్సెక్స్), 24,000 (నిఫ్టీ) కన్నా దిగువనే ముగిశాయి. సెన్సెక్స్ 964.15 పాయింట్ల నష్టంతో 79,218.05 వద్ద, నిఫ్టీ 247.15 పాయింట్ల నష్టంతో 23,951.70 వద్ద క్లోజయ్యాయి. నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 2915.07 పాయింట్లు, నిఫ్టీ 816.60 పాయింట్లు నష్టపోయాయి.

ఈక్విటీ మార్కెట్ల భారీ పతనంతో నాలుగు రోజుల్లో ఇన్వెస్టర్ల సంపద రూ.9.65 లక్షల కోట్ల మేరకు ఆవిరైపోయింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.9,65,935.96 కోట్ల మేరకు దిగజారి రూ.4,49,76,402.63 కోట్లకు (5.29 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సన్ ఫార్మా, పవర్‌గ్రిడ్, హెచ్‌యూఎల్ మినహా మిగతా 27 కంపెనీలు భారీగా నష్టపోయాయి.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.30 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.28 శాతం నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో కూడా ఒక్క హెల్త్‌కేర్ సూచీ మినహా మిగతా అన్ని సూచీలు నష్టాల్లోనే ట్రేడయ్యాయి.

దిగజారిన బంగారం, వెండి ధరలు

ఫెడ్ షాక్‌కు బులియన్ మార్కెట్ కూడా ప్రభావితం అయింది. ఢిల్లీ మార్కెట్లో మేలిమి బంగారం (99.9 స్వచ్ఛత) ధర 10 గ్రాములు రూ.800 దిగజారి రూ.78,300 పలికింది. ఆభరణాల బంగారం (99.5 శాతం స్వచ్ఛత) ధర సైతం అంతే మొత్తంలో తగ్గి రూ.77,900కి దిగజారింది. వెండి ధర కూడా కిలో రూ.2,000 దిగజారి రూ.90,000 పలికింది.

హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.710 దిగజారి రూ.77,130 వద్ద, 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.1280 దిగజారి రూ.70,070 వద్ద నిలిచాయి. కిలో వెండి ధర రూ.1,000 తగ్గి రూ.99,000 పలికింది.

జీవితకాల కనిష్ఠానికి రూపాయి

ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి జీవితకాల కనిష్ఠానికి దిగజారింది. గురువారం ట్రేడింగ్‌లో అమెరికన్ డాలర్‌తో పోల్చితే రూపాయి 19 పైసలు దిగజారి 85.13 వద్ద స్థిరపడింది. రూపాయి 85 స్థాయి కన్నా దిగజారడం ఇదే ప్రథమం. ట్రేడింగ్ ప్రారంభంలోనే 85 కన్నా దిగువన ప్రారంభమైన రూపాయి రోజంతా అదే ధోరణిని కొనసాగిస్తూ కనిష్ఠ స్థాయి 85.14ని తాకింది. అమెరికన్ ఫెడరల్ చైర్మన్ జెరోమ్ పోవెల్ వడ్డీ రేట్ల విషయంలో ప్రకటించిన కఠిన వైఖరితో డాలర్ విలువ పరుగు తీయడం వర్ధమాన మార్కెట్ల కరెన్సీలపై ఒత్తిడిని పెంచాయి. దీనికి తోడు ఈక్విటీ మార్కెట్ల నష్టాలు, దిగుమతిదారుల నుంచి డాలర్ డిమాండ్ రూపాయి క్షీణతకు ఆజ్యం పోశాయి.

నెల రోజుల్లోనే ఎన్ఎఫ్ఓల నిధుల పెట్టుబడి

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)కు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. న్యూ ఫండ్ ఆఫర్స్ (ఎన్ఎఫ్ఓ) ద్వారా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) సేకరించే నిధులను ఆ ఫండ్ నిబంధనలకు అనుగుణంగా నెల రోజుల్లో పెట్టుబడులు పూర్తి చేయాలని కోరింది. లేకపోతే ఎగ్జిట్ చార్జీలు లేకుండా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునే స్వేచ్ఛ మదుపరులకు కల్పించింది. ఇటీవల మార్కెట్‌కు వస్తున్న ఎన్ఎఫ్ఓల ద్వారా ఎంఎఫ్‌లు పెద్ద మొత్తంలో నిధులు సమీకరిస్తున్నాయి. అయితే ఫండ్ మేనేజర్లు ఆ నిధులను నిర్దిష్ట గడువులోగా, పథకం లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టలేక పోతున్నారు. దీనివల్ల మదుపరులు నష్టపోతున్నారు. దీంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

HDFC securities — వచ్చే ఏడాదిపై భారీ అంచనాలు వద్దు

కొన్ని సంవత్సరాలుగా అద్భుతమైన బుల్‌రన్ సాధిస్తూ వచ్చిన ఈక్విటీ మార్కెట్‌పై 2025 సంవత్సరానికి భారీ ఆశలు పెట్టుకోవద్దని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఇన్వెస్టర్లకు సూచించింది. ప్రస్తుతం 23,951.70 వద్ద నిఫ్టీ వచ్చే ఏడాది చివరికి 26,482 పాయింట్ల వద్ద స్థిరపడవచ్చని అంచనా వేసింది. అయితే ఇతర సాధనాలతో పోల్చితే ఈక్విటీ మార్కెట్ మెరుగైన ఫలితాలనే సాధిస్తుందని కంపెనీ ఎండీ, సీఈఓ ధీరజ్ రెల్లి అన్నారు. భారత దీర్ఘకాలిక వృద్ధిగాథ యథాతథంగానే ఉన్నదని అభిప్రాయపడ్డారు. "ఈక్విటీ మార్కెట్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన రాబడులు అందించింది. కాని 2025లో ఒక మోస్తరు రాబడులకే ఇన్వెస్టర్లు సిద్ధం కావాలి" అని ఆయన సూచించారు. 2024లో ఇప్పటివరకు నిఫ్టీ 10.22 శాతం లాభపడింది. 2020 తర్వాత మార్కెట్లో ప్రవేశించిన ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో భారీ కరెక్షన్ ఏదీ చవి చూడలేదన్నారు. ప్రస్తుత వాతావరణంలో మిడ్‌క్యాప్‌లు, స్మాల్‌క్యాప్‌ల కన్నా లార్జ్‌క్యాప్‌ల పైనే దృష్టి సారించాలని, పెట్టుబడిలో 67 శాతం పెద్ద కంపెనీల షేర్ల కొనుగోలుకే కేటాయించాలని సూచించారు. గత రెండు మూడేళ్లుగా 80 శాతం స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు ఇన్వెస్టర్లకు మెరుగైన లాభాలందించాయని, కొత్త సంవత్సరంలో అలాంటి కంపెనీల సంఖ్య 20 శాతానికి తగ్గుతుందని భావిస్తున్నామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆదాయాల వృద్ధి 4 శాతం నుంచి 17 శాతానికి పెరగవచ్చని సూచించారు. వచ్చే ఏడాదికి తాము పెద్ద బ్యాంకులు, అగ్రశ్రేణి ఐటీ కంపెనీలు, యంత్రపరికరాలు, సిమెంట్, భవన నిర్మాణ సామగ్రి రంగాలపై సానుకూల వైఖరితో ఉన్నామని, ఆటో, కన్స్యూమర్ స్టేపుల్స్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాలపై నెగెటివ్ దృక్పథంతో ఉన్నామని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సంస్థాగత పరిశోధనా విభాగం హెడ్ వరుణ్ లోహాబ్ చెప్పారు.

2025లోనూ నియామకాల జోరు

ఫౌండిట్

ముంబై: వచ్చే ఏడాది (2025) మన దేశంలో నియామకాల జోరు కొనసాగనుంది. 2024తో పోలిస్తే నియామకాల వృద్ధి రేటు 9 శాతం వరకు ఉంటుందని కంపెనీలకు నియామకాల సేవలు అందించే 'ఫౌండిట్' అనే సంస్థ తెలిపింది. ఈ సంవత్సరం నమోదైన 10 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే ఇది ఒక శాతం తక్కువ. ఐటీ, రిటైల్, టెలికా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) కంపెనీలు కొత్త ఏడాదిలో కూడా నియామకాల్లో ముందుంటాయని అంచనా వేసింది. నవంబరులో భారత్‌లో నియామకాలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే మూడు శాతం పెరిగినట్టు ఫౌండిట్ తెలిపింది. సరికొత్త టెక్నాలజీలు, మారుతున్న వ్యాపార ప్రాధాన్యతలతో వచ్చే ఏడాది మన దేశంలో నియామకాల స్వరూపం మరింత మారనుందని పేర్కొంది.

ముఖం స్కాన్‌తో 25 రకాల ఆరోగ్య పరీక్షలు

ఏఐ ఆధారిత పరీక్షను ఆవిష్కరించిన ఏసియానా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ ఏసియానా.. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఆరోగ్య పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చింది. డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లకుండానే సాధారణ ఆరోగ్య ప్రొఫైల్‌ను కేవలం ముఖాన్ని స్కాన్ చేయటం ద్వారా పొందవచ్చని ఏసియానా సీఈఓ కిశోర్ కారుమంచి వెల్లడించారు. కంపెనీ రూపొందించిన సియానా హెల్త్ యాప్ ద్వారా ముఖాన్ని 30 సెకన్లు స్కాన్ చేసి 25 రకాల ఆరోగ్య సేవల నివేదిక అందుకోవచ్చన్నారు. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), కార్డియోవాస్క్యులర్ రిస్కులు, పని ఒత్తిడి, టైప్ 2 మధుమేహం రిస్క్, రక్తపోటు వంటి వివరాలను స్కాన్ చేసిన కొద్ది సెకన్లలోనే సియానా హెల్త్ యాప్ అందిస్తుందని తెలిపారు. ఈ ఏఐ ఆధారిత జెనీవా ఫేస్ స్కాన్ టెక్నాలజీని కెనడాకు చెందిన కంపెనీ నుంచి అందుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ టెక్నాలజీని ఇప్పటికే పలు హెల్త్‌కేర్ సంస్థలు వినియోగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా వైద్యులు, డయాగ్నోస్టిక్ లేబొరేటరీస్‌ను రోగులు సంప్రదించే విధంగా ప్రత్యేక ఫీచర్లను పొందుపరిచినట్లు కిశోర్ తెలిపారు. ఏఐ ఆధారిత అనలిటిక్స్, అడ్వాన్స్‌డ్ జన్యు సంబంధిత ఇన్‌సైట్స్‌తో సియానా హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్‌ను అనుసంధానం చేసినట్లు చెప్పారు. జన్యు సంబంధిత పరీక్షల వివరాలను తమ ప్లాట్‌ఫామ్‌పై అప్‌లోడ్ చేయటం ద్వారా ముందు రాబోయే వ్యాధుల గురించి తెలుసుకునే వీలుండటమే కాకుండా ఆ రుగ్మతలను కట్టడి చేసే అవకాశం ఉంటుందన్నారు. కాగా జెనటిక్స్ ఆధారిత వెల్‌నెస్ కార్యక్రమాన్ని రూ.22,000-రూ.30,000 ధరతో కంపెనీ అందుబాటులోకి తీసుకువచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	600
వరంగల్	572	గోదావరి	600
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	91	విజయవాడ	99
వరంగల్	91	గుంటూరు	102
కరీంనగర్	91	ఒంగోలు	102
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	90
కర్నూలు	91	నెల్లూరు	90
విశాఖపట్నం	108	అనంతపురం	90
గోదావరి	99		

స్పోర్ట్స

అశ్విన్ బాటలో రోహిత్, కోహ్లీ?



న్యూఢిల్లీ: సీనియర్ ఆఫ్ స్పిన్నర్ అశ్విన్.. అంతర్జాతీయ కెరీర్‌కు అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించడం ఫ్యాన్స్‌ను షాక్‌కు గురి చేసింది. అయితే, ఇది ఆరంభం మాత్రమేనని.. మరికొన్ని రోజుల్లో ఇంకొందరు స్టార్ ప్లేయర్లు కూడా వీడ్కోలు పలుకుతారన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. టీ20 వరల్డ్‌కప్ గెలిచిన వెంటనే రోహిత్, కోహ్లీ, జడేజా పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతోనే అది మొదలైంది. ఇప్పుడు ఆస్ట్రేలియాతో సిరీస్ ముగిసేలోపు మరికొన్ని రిటైర్మెంట్లు ఉంటాయని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా రోహిత్, కోహ్లీ ప్రదర్శన ఏమాత్రం ఆకట్టుకోవడం లేదు. వీరిద్దరూ జట్టుకు భారంగా మారారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు విరాట్ లండన్‌లో స్థిరపడతాడనే వార్తలు కూడా వినవస్తున్నాయి. ఈ పరిణామాలను గమనిస్తే అశ్విన్ బాటలోనే రోహిత్, కోహ్లీ కూడా నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో ఘోరపరాజయం తర్వాత బీసీసీఐ కూడా కఠిన నిర్ణయాలు తీసుకోవాలనుకొంటోంది. ఈ నేపథ్యంలో భారంగా మారిన ఆటగాళ్ల భవితవ్యం తేల్చడానికి చీఫ్ సెలెక్టర్ అగార్కర్‌ను ఏకంగా నెలరోజుల పాటు ఆస్ట్రేలియాలోనే ఉండి పని చక్కబెట్టాలని ఆదేశించడంలో మర్మం అర్థమవుతోంది. ఆసీస్‌తో మిగిలిన మరో రెండు టెస్ట్‌లు ముగిసే సరికి ఆయా ఆటగాళ్లు ఎవరో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. రోహిత్ అసహనం చూస్తుంటే .. కెప్టెన్‌గా ఇదే అతడి చివరి సిరీస్‌గా కనిపిస్తోంది. అనిల్ కుంబ్లే, గంగూలీ కూడా కెరీర్ ఉచ్ఛదశలో ఉన్నప్పుడే అశ్విన్ తరహాలో గౌరవంగా తప్పుకొన్నారు. ఎంతో కాలంగా భారత జట్టుకు మూలస్తంభాలైన రోహిత్, కోహ్లీ కూడా ఇదే బాటను అనుసరించే అవకాశాలున్నాయి. అయితే, ఏం జరగనుందో తెలియాలంటే మాత్రం మరికొన్ని రోజులు ఓపిక పట్టాల్సిందే.

భారత్‌కు విరాట్ బై..బై..!

లండన్‌లో స్థిరపడనున్న స్టార్ క్రికెటర్
కోహ్లీ కోచ్ వెల్లడి

న్యూఢిల్లీ: క్రికెట్ కెరీర్ చరమాంకంలో ఉన్న విరాట్ కోహ్లీ త్వరలో ఆటకు వీడ్కోలు పలకడం ఖాయం. అయితే విరాట్ భవిష్యత్‌లో భారత్‌లో నివసించబోవడం లేదట. తన భావి జీవితాన్ని లండన్‌లో గడపాలని కోహ్లీ నిర్ణయం తీసుకున్నాడు. ఈ విషయాన్ని అతడి కోచ్ రాజీవ్ శర్మ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 'విరాట్ తన పిల్లలు వామిక, అకాయ్, భార్య అనుష్క శర్మతో కలిసి లండన్ వెళ్లిపోవాలని ఇప్పటికే నిర్ణయించుకున్నాడు. త్వరలో అతడు దేశం వీడి అక్కడ స్థిరపడనున్నాడు' అని రాజీవ్ తెలిపాడు. విరాట్, అనుష్క కలిసి లండన్‌లో ఓ మేనేజ్‌మెంట్ సంస్థను నడుపుతున్నాడట.

ఆసీస్ మీడియాతో వాగ్వాదం..

ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్ట్‌లో తలపడేందుకు భారత జట్టు గురువారం మెల్‌బోర్న్ చేరుకుంది. భార్య కూతురు, కుమారుడితో కలిసి విరాట్ విమానాశ్రయంనుంచి బయటకి రావడాన్ని గమనించిన కెమెరామన్లు తమ కెమెరాలను అతడివైపు తిప్పారు. దాంతో ఆగ్రహించిన విరాట్ వారి వద్దకు వచ్చిన చానెల్ 9 టీవీ మహిళా ప్రతినిధితో వాగ్వాదానికి దిగాడు. 'నాకు, నా పిల్లలకు గోపత్య ఉండాలి. నా అనుమతి లేకుండా ఫొటోలు ఎలా తీస్తారు' అని ఆమెను కోహ్లీ నిలదీశాడు. అయితే తాము అతడి కుటుంబాన్ని ఫొటో తీయలేదని కెమెరామన్లు చెప్పడంతో..శాంతించిన విరాట్ వారితో కరచాలనం చేసి వెళ్లిపోయాడు.



హైబ్రిడ్ పద్ధతిలోనే..

తటస్థ వేదికపై భారత్ x పాక్ పోరు
చాంపియన్స్ ట్రోఫీపై ఐసీసీ

దుబాయ్: కొంతకాలంగా చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై నెలకొన్న ప్రతిష్టంభన తొలగింది. వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో జరిగే ఈ మెగా వన్డే టోర్నీని హైబ్రిడ్ పద్ధతిన నిర్వహించనున్నట్టు ఐసీసీ ప్రకటించింది. దీంతో భారత్-పాక్ మధ్య మ్యాచ్‌లు తటస్థ వేదికపై జరుగనున్నాయి. అలాగే భారత్‌లో జరిగే 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్, 2026 పురుషుల టీ20 వరల్డ్‌కప్, 2027 చాంపియన్స్ ట్రోఫీతో పాటు పాక్ నిర్వహించే మహిళల టీ20 వరల్డ్‌కప్‌లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది. అప్పుడు కూడా ఇరు జట్ల మధ్య మ్యాచ్‌లు తటస్థ వేదికలపైనే జరుగుతాయని తేల్చింది. 'ప్రస్తుత సీజన్ (2024-2027)లో భారత్-పాక్ జట్లు ఐసీసీ టోర్నీల్లో ఆడే అన్ని మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో జరిపేందుకు ఆమోదించాం. త్వరలోనే టోర్నీ షెడ్యూల్‌ను కూడా వెల్లడిస్తాం' అని ఐసీసీ ప్రకటించింది. అయితే వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న భారత-పాక్‌ల మధ్య జరిగే మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభమవుతుందని సమాచారం. భద్రతా కారణాల రీత్యా భారత క్రికెట్ జట్టు పాక్‌లో పర్యటించేందుకు బీసీసీఐ అంగీకరించని విషయం తెలిసిందే. అటు కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతినివ్వకపోవడంతో, టోర్నీని హైబ్రిడ్ పద్ధతిన నిర్వహించాలని భారత్ కోరింది. అటు పాక్ మాత్రం దీనికి అంగీకరించలేదు. దీంతో కొద్ది రోజులుగా ఈ టోర్నీ నిర్వహణపై సస్పెన్స్ కొనసాగుతోంది. చివరకు పాక్‌ను హైబ్రిడ్ పద్ధతికి ఒప్పించడంతో కథ సుఖాంతమైంది.



యూఏఈలో చాన్స్!

టోర్నీ ఆద్యంతం పాక్‌లోనే నిర్వహించాలని పట్టుబట్టినా ఎట్టకేలకు హైబ్రిడ్ పద్ధతికి ఆ దేశ క్రికెట్ బోర్డు పచ్చజెండా ఊపింది. అయితే ఇప్పుడు భారత్‌తో పాక్ మ్యాచ్‌లు ఎక్కడ జరుగుతాయనే ప్రశ్న అందరిలోనూ ఆసక్తిరేపుతోంది. రేసులో శ్రీలంక, యూఏఈ ఉన్నప్పటికీ ఐసీసీ మాత్రం ఎడారి దేశం వైపే మొగ్గు చూపే అవకాశం ఉంది. ఎందుకంటే ఇప్పటికే ఇక్కడ ఐపీఎల్, టీ20 వరల్డ్‌కప్‌లాంటి మెగా టోర్నీలు విజయవంతంగా జరిగాయి. దీనికి తోడు దుబాయ్, షార్జా, అబుధాబిలలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాలున్నాయి. అలాగే భారత్-పాక్ అభిమానులు కూడా సులువుగా ఇక్కడికి చేరుకోగలరు. అన్నింటికన్నా ముఖ్యంగా ఐసీసీ చైర్మన్ జైషాకు యూఏఈ నిర్వహణ సామర్థ్యంపై చక్కటి గురి ఉండడం కూడా ఓ కారణం కానుంది.

మంధాన, రిచా ధనాధన్!

మనదే సిరీస్
మూడో టీ20లో వెస్టిండీస్ చిత్తు



ముంబై: సిరీస్‌లో వరుసగా మూడో హాఫ్ సెంచరీతో తాత్కాలిక కెప్టెన్ స్మృతీ మంధాన (47 బంతుల్లో 13 ఫోర్లు, సిక్స్‌తో 77) మెరవగా..యువ బ్యాటర్ రిచా ఘోష్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 54) పొట్టి ఫార్మాట్‌లో వేగవంతమైన అర్ధ శతకం నమోదు చేసింది. దాంతో వెస్టిండీస్‌పై ఆఖరి టీ20లో భారత్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 60 పరుగులతో ఘన విజయం అందుకున్న భారత్ సిరీస్‌ను 2-1తో దక్కించుకుంది. గత ఐదేళ్ల కాలంలో భారత గడ్డపై టీమిండియాకిదే తొలి టీ20 సిరీస్ విజయం. తొలుత మన అమ్మాయిలు 20 ఓవర్లలో 217/4 స్కోరు సాధించారు. మంధాన, రిచాకు తోడు జెమీమా (39), రాఘవీ బిస్త్ (31 నాటౌట్) రాణించారు. భారీ ఛేదనలో వెస్టిండీస్ 20 ఓవర్లలో 157/9 స్కోరుకే పరిమితమైంది. హెన్రీ (43) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రిచా, 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా మంధాన నిలిచారు.

1 ఈ ఏడాది టీ20లలో అత్యధిక పరుగులు (23 మ్యాచ్‌లు, 763 రన్స్) చేసిన బ్యాటర్‌గా మంధాన.

217/4 టీ20లలో భారత్ అత్యధిక స్కోరు

రిచా వరల్డ్ రికార్డ్: కీపర్ రిచా ఘోష్ మహిళల టీ20లలో వరల్డ్ రికార్డును సమం చేసింది. 18 బంతుల్లో 50 పరుగులు చేసిన 21 ఏళ్ల రిచా.. అతి తక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన బ్యాటర్‌గా సోఫీ డివైన్ (న్యూజిలాండ్), లిచ్‌ఫీల్డ్ (ఆస్ట్రేలియా)తో కలిసి అగ్రస్థానంలో నిలిచింది.

సంక్షిప్తస్కోర్లు: భారత్ 20 ఓవర్లలో 217/4 (మంధాన 77, రిచా ఘోష్ 54, జెమీమా 39); వెస్టిండీస్ 20 ఓవర్లలో 157/9 (హెన్రీ 43, రాధా యాదవ్ 4/29).

మా వాడిని అవమానించారు

అశ్విన్ తండ్రి



చెన్నై (ఆంధ్రజ్యోతి): మాజీ ఆఫ్ స్పిన్నర్ ఆర్.అశ్విన్ రిటైర్మెంట్‌పై అతడి తండ్రి రవిచంద్రన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అవమానాలు భరించలేకే తన కుమారుడు ఇంత త్వరగా ఆటకు వీడ్కోలు పలికాడని చెప్పాడు. 'అశ్విన్ నిర్ణయం నాకు చివరి నిమిషంలోనే తెలిసింది. అయితే ఇలాంటిది జరుగుతుందని ముందే ఊహించా. ఎందుకంటే మా వాడిని వేధిస్తున్నారు. ఎంతకాలమని భరించగలడు? అందుకే రిటైర్మెంట్ ప్రకటించాడు' అని రవిచంద్రన్ తెలిపాడు. అయితే అశ్విన్‌ను అవమానించిన వారెవరో ఆయన చెప్పలేదు. మరోవైపు తన తండ్రికి మీడియాతో ఎలా మాట్లాడాలో తెలీదని, ఆయన కామెంట్స్‌ను పట్టించుకోవద్దని అశ్విన్ చెప్పాడు.

స్వదేశం చేరిన అశ్విన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మధ్యలోనే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్ గురువారం ఉదయం స్వదేశంలో అడుగుపెట్టాడు. చెన్నై విమానాశ్రయం నుంచి నేరుగా స్వగృహానికి చేరుకున్న అశ్విన్‌పై కుటుంబసభ్యులు, సన్నిహితులు పూలవర్షం కురిపిస్తూ.. బాజా భజంత్రీలతో సాదర స్వాగతం పలికారు.

ఘనంగా ఫేర్‌వెల్ దక్కాల్సింది: కపిల్

న్యూఢిల్లీ: అశ్విన్ రిటైర్మెంట్ షాక్‌కు గురి చేసిందని, అలాగే అతడికి ఘనంగా ఫేర్‌వెల్ ఇవ్వాల్సిన అవసరం ఉందని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు. అశ్విన్ ముఖంలోనూ అసంతృప్తి కనిపించిందని, తను భారత గడ్డపై వీడ్కోలు పలికితే బావుండేదని అన్నాడు. ఇందుకోసం ఇప్పటికైనా బీసీసీఐ ఏమైనా నిర్ణయం తీసుకుంటుందేమో చూడాలని చెప్పాడు.


బీసీసీఐ ఖజానా కళకళ

న్యూఢిల్లీ: బీసీసీఐ ఖజానా కాసులతో కళకళలాడుతోంది. గతేడాదితో పోల్చితే బోర్డు ఆదాయం రూ. 4200 కోట్లు పెరిగింది. మొత్తంగా 2024 ఆర్థిక సంవత్సరంలో బీసీసీఐ బ్యాంక్ బ్యాలెన్స్ రూ. 20,686 కోట్లుగా తేలింది. అంతకు ముందు ఏడాది రూ. 16,493 కోట్లుగా పేర్కొన్నారు. బోర్డు ఆదాయంలో ఎక్కువగా భాగం ఐపీఎల్, ద్వైపాక్షిక సిరీస్‌ల ద్వారా వచ్చిందే.

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ అత్యవసర భేటీ నేడు: కార్యదర్శి, కోశాధికారి పదవులను భర్తీ చేయాలని బీసీసీఐ నిర్ణయించింది. దీనికిగాను ఎన్నికల అధికారిగా అచల్ కుమార్ జ్యోతిని నియమించాలని భావిస్తోంది. ఆయన నియామకాన్ని ఖరారు చేసేందుకు బీసీసీ అపెక్స్ కమిటీ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేసింది. బీసీసీఐ కార్యదర్శి జై షా ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఆ పదవి ఖాళీ అయింది. అలాగే కోశాధికారి ఆశిష్ షెలార్ మహారాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేశారు.

త్రిష అర్ధ శతకం

బంగ్లాపై భారత్ గెలుపు
అండర్-19 ఆసియా కప్


త్రిష (58 నాటౌట్)

కౌలాలంపూర్: తెలుగమ్మాయి గొంగడి త్రిష (58 నాటౌట్) అర్ధ శతకంతో రాణించడంతో.. అండర్-19 టీ20 ఆసియా కప్ సూపర్-4లో భారత అమ్మాయిల జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తొలుత బంగ్లా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 80 పరుగులు చేసింది. మొసమ్మత్ ఇవా (14) టాప్ స్కోరర్. ఆయుషి శుక్లా 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్ 12.1 ఓవర్లలో 86/2 స్కోరు చేసి గెలిచింది. త్రిష, కెప్టెన్ నిక్కీ (22 నాటౌట్) మూడో వికెట్‌కు అజేయంగా 64 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో.. భారత్ మరో 47 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. అనీశా రెండు వికెట్లు పడగొట్టింది.

యూపీ.. వరుసగా 8వ విజయం

పుణె: ప్రొ. కబడ్డీ తాజా సీజన్‌లో యూపీ యోధాస్ గెలుపు జోరును కొనసాగించింది. వరుసగా ఎనిమిదో విజయం అందుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో యోధాస్ 59-23తో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. గగన్ గౌడ 19 పాయింట్లతో చెలరేగగా, భవానీ రాజ్‌పుత్ సూపర్-10తో సత్తా చాటాడు. సుమిత్ హై-5 సాధించాడు. మరో మ్యాచ్‌లో యూ ముంబా 43-37తో పట్నా పైరేట్స్‌ను ఓడించింది.

పదేళ్లలో తెలంగాణలో
2,722 కి.మీ హైవేల నిర్మాణం: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో తెలంగాణలో 2,722 కి.మీల మేర జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేశామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. 2014 నుంచి ఇప్పటివరకు 2,526 కి.మీల పొడవు తెలంగాణ రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేశామని చెప్పారు. గురువారం లోక్‌సభలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో ప్రస్తుతం 30 జాతీయ రహదారులు ఉన్నాయని, ఇవి రాష్ట్రవ్యాప్తంగా 4,926 కి.మీ పొడవు విస్తరించి ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. జాతీయ రహదారులకు అనుసంధానించేలా హైదరాబాద్‌లో టన్నెల్ రోడ్ల నిర్మాణం కోసం నిధులు సమకూర్చే ప్రతిపాదన ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ హైకోర్టులో 15 జడ్జీ పోస్టుల ఖాళీ

తెలంగాణ హైకోర్టులో 15 న్యాయమూర్తుల పోస్టుల ఖాళీలు ఉన్నాయని కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. గురువారం రాజ్యసభలో వైసీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. 42 న్యాయమూర్తుల పోస్టులను మంజూరు చేయగా 27 మంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 560 జడ్జీలకుగానూ 445 మంది ఉన్నారని, 115 ఖాళీలు ఉన్నాయని చెప్పారు.

అప్పులు తీసుకోవడంలో
బీఆర్ఎస్‌ను మించిన కాంగ్రెస్:సంజయ్

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ తీరును చూస్తుంటే.. అప్పులు తీసుకోవడంలో బీఆర్ఎస్‌ను మించిపోయేలా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. "ఏడాదిలోనే రూ.1.27లక్షల కోట్లకుపైగా అప్పులు తీసుకుందంటే...మిగిలిన నాలుగేళ్ల కాలాన్ని కలిపి రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు తీసుకునే పరిస్థితి కళ్లముందే కన్పిస్తోంది. ఇదే జరిగితే తెలంగాణ ఊహించనంతగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదముంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెండు పార్టీలను గెలిపించి అధికారం కట్టబెట్టిన పాపానికి రూ.8లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని పూర్తిగా దివాలా తీయించారని గురువారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. ఆవిర్భావానికి ముందు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ.. ఈ రెండు పార్టీల స్వార్థ ప్రయోజనాలు, దివాలాకోరు విధానాల వల్ల అప్పుల్లో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాహుల్‌పై చర్యలు తీసుకోవాలి: రఘునందన్

న్యూఢిల్లీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ఎంపీలు గాయపడటానికి కారణమైన లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. పార్లమెంటు లోపలికి వెళ్లేందుకు ఇంకో దారి ఉన్నప్పటికీ ఆయన కావాలని నలుగురిని వెంటబెట్టుకుని ఎన్డీయే ఎంపీలు ఆందోళన తెలిపే ప్రాంతానికి వచ్చారన్నారు. పార్లమెంటులో తాను చూస్తుండగా.. రాహుల్ గాంధీ వచ్చి రావడంతోనే ఒకరి ఛాతీపై చెయ్యి వేసి.. మహిళా ఎంపీలు అని కూడా చూడకుండా వారిని నెట్టివేసిపోయారని ఆయన ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏనాడూ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ గౌరవించలేదని తెలిపారు.

ఎయిడెడ్ టీచర్ల నవంబరు
వేతనాలు విడుదల చేయాలి: యూటీఎఫ్

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ విద్యా సంస్థల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నవంబరు నెల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధానకార్యదర్శి చావ రవి ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. వేతనాలు అందక ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారందరూ క్రిస్మస్ పండుగకు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఆర్థికశాఖ వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. కాగా, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 6వ ద్వైవార్షిక విద్యా వైజ్ఞానిక మహాసభలు డిసెంబరు 28, 29, 30వ తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధానకార్యదర్శి చావ రవి వెల్లడించారు. సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

హౌసింగ్, దిల్ భూముల చుట్టూ ప్రహరిగోడ

» అధికారులతో సమీక్షించిన హౌసింగ్‌శాఖ కమిషనర్

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్ (దిల్) పరిధిలోని భూములను ఆక్రమణల నుంచి కాపాడుకోవడానికి వాటి చుట్టూ హౌసింగ్ బోర్డుశాఖ ప్రహరిగోడను నిర్మిస్తోంది. ఈ పనుల నిర్వహణకు రూ.25కోట్లను ప్రభుత్వం మంజూరు చేయగా, హౌసింగ్ బోర్డు ఇప్పటికే మొదటి దశలో 16 ప్యాకేజీల కింద రూ. 10కోట్లతో తన పరిధిలోని 422 ఎకరాల్లో ప్రహరిగోడ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ పనులన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. ఇక దిల్ పరిధిలోనూ ఆక్రమణలు, లిటిగేషన్‌లు లేని 620 ఎకరాల చుట్టూ గోడలను నిర్మించాలని నిర్ణయించగా, వీటిని 17 ప్యాకేజీలుగా విభజించింది. వీటి నిర్మాణానికి రూ.12 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసింది. కాగా, ఇదే అంశంపై హౌసింగ్‌శాఖ కమిషనర్, హౌసింగ్ బోర్డు స్పెషల్ సెక్రటరీ వి.పి.గౌతమ్ గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు భూముల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరిగోడల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

రైస్‌మిల్లుపై విజిలెన్స్ మెరుపు దాడులు

» 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రామాయంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నిజాంపేట మండలం నందిగామ రైస్‌మిల్‌పై గురువారం రాత్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మెరుపు దాడులు చేపట్టింది. దీనిలో భారీగా పీడీఎస్ (రేషన్ బియ్యం) నిల్వలు గుర్తించారు. రాత్రి 9 గంటల వరకు సుమారు 700 పైచిలుకు బస్తాలు, 300 క్వింటాళ్లకుపైగా బియ్యం నిల్వలు లెక్కించారు. ఇంకా తనిఖీలు కొనసాగిస్తున్నారు. పట్టుబడ్డ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి నిజాంపేట పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం రైస్ మిల్లుల్లో చేరుతుండటంతో ఇటీవల పోలీసు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా సాయంత్రం అందిన సమాచారంతో అధికారుల బృందం రంగంలోకి దిగింది. విజిలెన్స్ అదనపు ఎస్పీ ద్రోణాచార్య నేతృత్వంలో డీఎం హరికృష్ణ, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలతో పాటు స్థానిక తహశీల్దార్‌ల బృందం ఈ దాడులు చేసింది.

కార్తిక్ రెడ్డి ఫిర్యాదుపై సైబర్ క్రైంలో కేసు నమోదు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు కార్తిక్ రెడ్డి ఈ నెల 10న చేసిన ఫిర్యాదుపై హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు స్పందించారు. తెలంగాణను కించపరుస్తూ పోస్టులు పెట్టిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ రాజకీయాలకు అతీతమైందని, రాష్ట్రం జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదని కార్తిక్‌రెడ్డి గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు.

అంబేడ్కర్‌ను కాంగ్రెస్ గౌరవించలేదు

» అమిత్‌షా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారు: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరిస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. పార్లమెంటు పరిణామాలను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఢిల్లీ నుంచి ఫోన్లో మంత్రి లోకేశ్‌కు వివరించారు. ఆయన వాటిని చంద్రబాబుకు తెలియజేశారు. 'అంబేడ్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అవమానించారని కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అర్థరహితం. ఆ పార్టీ అంబేడ్కర్‌కు ఏనాడూ గౌరవం ఇవ్వలేదు. ఆ పార్టీ హయాంలోనే ఆయన ఎన్నికల్లో ఓడిపోయారు. పార్లమెంటులో కూడా ఆ పార్టీ అంబేడ్కర్ స్మృతి చిహ్నం ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు అంబేడ్కర్ గురించి కాంగ్రెస్ ఎలా మాట్లాడుతుంది' అని సీఎం ప్రశ్నించారు.

కేటీఆర్ ఏ1

(మొదటిపేజీ తరువాయి)



పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్ ఏసీబీకి పంపారు. బుధవారం సాయంత్రం ఐదున్నరకు ఫిర్యాదు అందింది. దానిని పరిశీలించిన తర్వాత ఏసీబీ డీజీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం నాలుగు గంటలకు కేటీఆర్ తదితరులపై ఏసీబీ సీఐయూ యూనిట్ డీఎస్పీ మజీద్ ఖాన్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సదరు కాపీలను ఏసీబీ కోర్టుకు పంపారు.

అసలు ఏమిటీ కేసు!?

మీకు ఎకరం భూమి ఉంది! అందులో ఎగ్జిబిషన్ పెట్టుకుంటామంటూ 'ఏ' వచ్చారు! దానికి విస్తృత ప్రచారం కల్పిస్తానంటూ 'బి' వచ్చారు! కొన్ని రోజుల తర్వాత నష్టం వస్తోందని 'బి' వెళ్లిపోయారు! నిజానికి, ఇక్కడ ఎగ్జిబిషన్‌కు భూమి ఇవ్వడం వరకే మీ బాధ్యత. కానీ, ఎగ్జిబిషన్ ఏర్పాటుకు, ప్రచారానికి కూడా మీరే ఎదురు డబ్బులు ఇస్తారా!? అది కూడా.. మీ డబ్బులు కాకుండా ఈ వ్యవహారంతో అస్సలు ఏమాత్రం ఏ సంబంధం లేని పక్క వాళ్ల డబ్బులు ఇస్తారా!? ఈ క్రమంలో అన్ని నిబంధనలను తుంగలో తొక్కుతారా!? ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దాని ప్రకారం ఫార్ములా ఈ కేసు ఇదే! హైదరాబాద్‌లో ఫార్ములా ఈ కారు రేసు నిర్వహించడానికి 2022 అక్టోబరులో మూడు పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. వాటిలో ఒకటి.. బ్రిటన్‌కు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈవో). రెండోది, తెలంగాణ ప్రభుత్వం. మూడోది, ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ (స్పాన్సర్). ఫార్ములా 1 తరహాలోనే ఫార్ములా ఈ రేసులూ జరుగుతుంటాయి. వీటి 9, 10, 11, 12 సీజన్లను హైదరాబాద్‌లో నిర్వహించడమే ఈ ఒప్పందం. దీని ప్రకారం ట్రాక్ నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాల కల్పన మాత్రమే ప్రభుత్వ బాధ్యత. ఇందులో భాగంగా మొదటి రేస్ 11.2.23వ తేదీన పూర్తయింది. ఇందుకు హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. సంబంధిత ఫీజు, ఇతర చెల్లింపులను స్పాన్సర్ సంస్థ చేసింది. మొదటి సీజన్ తర్వాత ఎఫ్ఈవోకు, స్పాన్సరర్‌కు మధ్య విభేదాలు వచ్చాయి. ఒప్పందం నుంచి ఏస్ నెక్స్ట్ జెన్ తప్పుకుంది. ఇంకా కొంత ఫీజు మొత్తాన్ని కూడా చెల్లించాల్సి ఉంది. దీంతో, పురపాలక శాఖ అధికారులు, ఎఫ్ఈవో మధ్య చర్చలు జరిగాయి. స్పాన్సర్ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, ఫీజు కూడా ప్రభుత్వమే చెల్లించాలని భావించారు. రాష్ట్ర ప్రభుత్వమే స్పాన్సరర్‌గా ఉంటుందని మంత్రి కేటీఆర్ మౌఖికంగా చెప్పడంతో అప్పట్లో హెచ్ఎండీఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చూస్తున్న పురపాలక శాఖ స్పెషల్ సీఎస్ ఫైల్ పంపారు. గత స్పాన్సరర్ స్థానంలో పురపాలక శాఖ ఉంటుందని, మొత్తం రూ.160 కోట్లు ఖర్చవుతుందని అందులో పేర్కొన్నారు. దానిపై అదే రోజు కేటీఆర్ సంతకం చేశారు.

ఒప్పందం జరగక ముందే చెల్లింపులు

సదరు ఫైల్‌ను 27.9.23న మంత్రి కేటీఆర్‌కు పంపారు. కానీ, అంతకు రెండు రోజుల ముందు అంటే 25వ తేదీనే ఎఫ్ఈఓ ప్రమోటర్ ఫీజు కింద రూ.22,69,63,125 చెల్లించాలంటూ ఇన్‌వాయిస్‌ను హెచ్ఎండీఏకి పంపింది. మరో నాలుగు రోజుల్లో రూ.23,01,97,500 రూపాయలకు సంబంధించి మరో ఇన్వాయిస్ పంపింది. నిజానికి, అప్పటికి ఇంకా ప్రభుత్వానికి ఎఫ్ఈఐకి మధ్య రాతపూర్వక ఒప్పందం జరగలేదు. కానీ, ఈ రెండు ఇన్వాయిస్‌లకు సంబంధించి డాలర్లలో హిమాయత్ నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా 2023 అక్టోబర్ 3న, 11న చెల్లింపులు చేసేశారు. ఈ మేరకు హెచ్ఎండీఏ చీఫ్ మేనేజర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

అనుమతుల్లేకుండానే చెల్లింపులు

నిజానికి.. ఇక్కడ హెచ్ఎండీఏకు, ఎఫ్ఈవోకు ఏ సంబంధం లేదు. కానీ, హెచ్ఎండీఏ ఖాతా నుంచి చెల్లింపులు జరిపేశారు. అంతేనా.. అంత భారీ మొత్తాలను బదిలీ చేసినా.. అందుకు ఎవరి నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. డాలర్లలో విదేశాలకు డబ్బులు చెల్లిస్తే ఆర్బీఐ నుంచి అనుమతి తీసుకోవాలి. దానిని తీసుకోలేదు. ఇక, ఆర్థిక శాఖ నుంచి కానీ న్యాయ శాఖ నుంచి కానీ అనుమతి తీసుకోలేదు. పైగా విదేశీ చెల్లింపులు చేసినందుకు హెచ్ఎండీఏకు ఆదాయ పన్ను కింద రూ.8.06 కోట్లు అదనపు భారం కూడా పడింది. వెరసి, హెచ్ఎండీఏ ఖాతా నుంచి రూ.54,88,87,043 చెల్లించారు. నిజానికి, హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం.. పది కోట్లకు మించి ఖర్చు చేస్తే ఆర్థిక శాఖ ద్వారా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ, ఎటువంటి అనుమతి తీసుకోలేదు. అలాగే, భవిష్యత్తులో మరిన్ని చెల్లింపులు చేయాల్సి ఉంటే మంత్రిమండలి ఆమోదం కూడా తీసుకోవాలి. కానీ, దానిని కూడా తీసుకోలేదు. భవిష్యత్తులో ఎప్పుడో చేసుకోబోయే ఒప్పందాన్ని ఉద్దేశించి ముందే చెల్లింపులు జరిపేశారు. ఈ కేసులో ఇది తీవ్ర ఉల్లంఘనగా ఎఫ్ఐఆర్‌లో ఏసీబీ పేర్కొంది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కూడా

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 9.10.23న కోడ్ అమల్లోకి వచ్చింది. కానీ, చెల్లింపులు చేసిన తర్వాత 30.10.23న ఎఫ్ఈవోతో పురపాలక శాఖ మరో ఒప్పందం చేసుకుంది. దాని ప్రకారం, స్పాన్సర్ ఫీజు రూ.90 కోట్లతోపాటు ఇతర మౌలిక సదుపాయాలనూ రాష్ట్ర ప్రభుత్వమే కల్పిస్తుందని అందులో పేర్కొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉండగా ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకోకుండా ఈ ఒప్పందం చేసుకోవడాన్ని ఉల్లంఘనగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆర్థిక శాఖతోపాటు అధీకృత అథారిటీ ఆమోదం లేకుండా రూ.54.88 కోట్లు ఎఫ్ఈవోకు చెల్లించడం నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఒప్పందంలో హెచ్ఎండీఏ భాగస్వామి కాకపోయినా.. ఒప్పందానికి ముందే హెచ్ఎండీఏ ఖాతా నుంచి చెల్లింపులు జరపడం ఏమిటని విస్మయం వ్యక్తం చేసింది. ఈ అంశాలపైనే ప్రధానంగా ఏసీబీ విచారణ చేయనుంది. అలాగే, డాలర్లలో చెల్లింపులు చేయడం ఫారిన్ ఎక్స్ఛేంజి నిబంధనలకు విరుద్ధం. దీనిపైనా ఏసీబీ దృష్టి సారించనుంది. ఒప్పందం ప్రకారం, రాబోయే మూడేళ్లలో అదనపు ఖర్చులతోపాటు రూ.600 కోట్ల వరకూ చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఈ మేరకు సంబంధిత అథారిటీ నుంచి అనుమతి తీసుకోలేదని పేర్కొంది. దీనిపైనా ఏసీబీ దృష్టి సారించనుంది.

హెచ్ఎండీఏ ఫిర్యాదుతో వెలుగులోకి

ఎఫ్ఈవోకు భారీ చెల్లింపుల్లో ఉల్లంఘనలు జరిగాయంటూ హెచ్ఎండీఏ కమిషనర్ సర్కారు దృష్టికి తీసుకెళ్లారు. ఒప్పందం అమలుకు మంత్రి మండలి ఆమోదం అవసరమని, దానికి ముందు ఆర్థిక, న్యాయ శాఖలు అనుమతి ఇచ్చి ఉండాలని, కానీ, ఇవేవీ జరగలేదని, ఇది తీవ్ర ఉల్లంఘనగా పేర్కొన్నారు. రెండోసారి ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందని, ఈసీ అనుమతి తీసుకోకుండానే దీనిపై సంతకాలు చేశారని, ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. అధికారులు కానీ వ్యక్తులు కానీ పూర్తి అవగాహన ఉండి కూడా ఉల్లంఘనలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే.. హెచ్ఎండీఏ నిధులను దుర్వినియోగం చేసిన కోణంలో మరికొంత మంది అధికారులను ఏసీబీ విచారించే అవకాశాలు కన్పిస్తున్నాయి. నిబంధనలన్నీ తెలిసి కూడా నాటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద‌కుమార్ తప్పు చేశారని, నాటి మంత్రి కేటీఆర్ ప్రోద్బలంతోనే ఈ చెల్లింపులు చేశారని ఏసీబీ అధికారులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. డబ్బు చెల్లింపులు, ఒప్పందాలు, లొసుగులకు సంబంధించి పక్కాగా ఆధారాలు సేకరించి.. తొలుత కేటీఆర్, అర్వింద‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డికి నోటీసులు జారీ చేసి ఆ తర్వాతే చట్టపరమైన చర్యల్లో భాగంగా అరెస్టుకు వెళ్లవచ్చని తెలుస్తోంది.

సెక్షన్లు.. శిక్షలు

- అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1)(ఎ) ప్రకారం.. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉద్దేశపూర్వకంగా నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడటం, ప్రభుత్వ ఆస్తిని ఉద్దేశపూర్వకంగా ఇతరులకు అప్పగించడం.. దీనికి నాలుగేళ్ల నుంచి పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశం.
- పీసీ యాక్ట్ సెక్షన్ 13(2).. నేరపూరితంగా వ్యవహరించడం ద్వారా ప్రభుత్వానికి నష్టం కలిగించడం. దీనికి ఏడాది నుంచి ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం.
- ఐపీసీ సెక్షన్ 409 రెడ్ విత్ 120 బి.. నేరపూరిత కుట్ర, నేరపూరిత విశ్వాస ఉల్లంఘనకు సంబంధించి జీవిత ఖైదుకు అవకాశం.

అవినీతే లేదు.. కేసు ఏంటి?

రేసు కోసమే నిర్వహణ సంస్థకు 55 కోట్లు ఇచ్చాం.. నా దగ్గర ఆధారాలున్నాయి

» ఫార్ములా-ఈ రేసు అంశంలో ఏసీబీ కేసు నమోదుపై మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫార్ములా-ఈ రేసు వ్యవహారాల్లో అసలు అవినీతే లేనప్పుడు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ఎలా కేసు నమోదు చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేసింగ్ కోసం హెచ్ఎండీఏ ద్వారా నిర్వహణ సంస్థకు రూ.55 కోట్లు చెల్లించామని, ఇందుకు సంబంధించి ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అవగాహన రాహిత్యం వల్లే రేసింగ్ సంస్థతో ఒప్పందం రద్దయిందని, రూ.55 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్రం, దేశం పరువు తీసిన సీఎం రేవంత్ రెడ్డినే అరెస్టు చెయ్యాలని అన్నారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అవగాహనా రాహిత్యం వల్ల ఫార్ములా ఈ వారు కూడా ప్రభుత్వంపై కేసు వేశారని కేటీఆర్ తెలిపారు. కానీ, ఆ వివరాలను ప్రభుత్వం బయటపెట్టడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను బయటపెడుతున్నామనే కడుపుమంటతోనే కేసుల పేరిట ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఉద్యమనాయకుడి బిడ్డనని అక్రమ కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫార్ములా ఈరేసింగ్ వ్యవహారం, ఆ తర్వాత జరిగిన పరిణామాలకు సంబంధించిన అన్ని ఆధారాలను ఏసీబీకి, పోలీసులకు, న్యాయస్థానానికి అందజేస్తానని కేటీఆర్ తెలిపారు. ఈ అక్రమ కేసుపై చట్టపరంగా పోరాడతానని అన్నారు.

చంద్రబాబు ప్రయత్నాన్ని మేం నెరవేర్చాం

ఫార్ములా-1ను హైదరాబాద్‌కు రప్పించేందుకు 2001లో చంద్రబాబు ప్రయత్నించారని, ఇందులో భాగంగా గోపన్‌పల్లిలో 500 ఎకరాల భూసేకరణకు నిర్ణయించారని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రికి కూడా అక్కడ భూములున్నాయని అన్నారు. నాడు చంద్రబాబు చేసిన యత్నానికి బీఆర్ఎస్ హయాంలో కార్యరూపం తీసుకొచ్చామని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో ఏర్పాటైన జీనోమ్ వ్యాలీ వల్ల నేడు హైదరాబాద్‌కు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి తెలంగాణను అడ్డాగా మార్చాలని 2022లోని ఫార్ములా ఈ రేసింగ్‌కు ప్రయత్నిస్తే నిర్వాహకులు ఒప్పుకోలేదని, కానీ సంప్రదింపుల ద్వారా 2023 ఫిబ్రవరి 10న రేస్ నిర్వహించామని తెలిపారు.

రూ.700 కోట్లు లాభం వచ్చింది

ఈవెంట్ నిర్వహణకు హెచ్ఎండీఏ రూ.35కోట్లకు పైగా ఖర్చు చేయగా, స్పాన్సర్ ఏస్‌జెన్ గ్రీన్‌కో సంస్థ రూ.110కోట్లు ఖర్చుపెట్టిందని కేటీఆర్ తెలిపారు. రేసు నిర్వహణ ద్వారా రూ.700 కోట్లు ఆర్థిక లబ్ధి వచ్చిందని నెల్సన్ అనే సంస్థ నివేదిక ఇచ్చిందని చెప్పారు. అయితే, తమకు నష్టం వాటిల్లిందంటూ గ్రీన్‌కో సంస్థ రెండో రేసు నిర్వహణకు ముందు ఒప్పందం నుంచి తప్పుకుందని అన్నారు. మరోపక్క, హైదరాబాద్‌లో తదుపరి రేసు నిర్వహించాలంటే డబ్బు ముందుగానే చెల్లించాలని ఫార్ములా ఈ సంస్థ 2023 ఆగస్టులో ప్రభుత్వానికి మెయిల్ చేసిందని చెప్పారు. ఈలోగా ఎన్నికల హడావుడి ప్రారంభం కావడం, కొత్త స్పాన్సర్‌ను వెతికే సమయం లేకపోవడం, తామే మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకంతో అక్టోబరు 5, అక్టోబరు 11తేదీల్లో రెండు విడతలుగా హెచ్ఎండీఏ ద్వారా రూ.55కోట్లు చెల్లించామని వివరించారు. ఈ చెల్లింపులు ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా జరిగాయని, ఫార్ములా ఈ సంస్థ కూడా వాటిని ధ్రువీకరించిందని తెలిపారు. లావాదేవీలు ఇంత పారదర్శకంగా జరిగితే అవినీతికి ఆస్కారం ఎక్కడుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక, కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ఫార్ములా ఈ రేసింగ్ కో ఆర్డినేటర్ ఆల్‌బర్టో డిసెంబరు13న ముఖ్యమంత్రిని కలిశారు. వచ్చే మూడేళ్లు రేసింగ్ నిర్వహిస్తామని దాన కిశోర్‌కు అల్‌బర్టో లేఖ కూడా రాశారు. మరోసారి రేసు నిర్వహణపై డిసెంబరు21 లోపు స్పష్టత ఇవ్వాలని మెయిల్ పెట్టారు. మూడో విడత నిధులు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దు చేస్తామని అందులో పేర్కొన్నారన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కేటీఆర్ విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఇక, రేసు రద్దు అవ్వగానే ఎఫ్ఎంఎస్ వారు రూ.74లక్షల లైసెన్సు ఫీజు వెనక్కి ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం ఇవన్నీ దాచి పెడుతుందని కేటీఆర్ ఆరోపించారు.

ఏ జడ్జి అయినా కేసు కొట్టేస్తారు

ఫార్ములా- ఈ రేసు కేసులో విషయం లేదని, ప్రభుత్వ ఆరోపణలను పరిశీలిస్తే ఏ జడ్జి అయినా కేసు కొట్టేస్తారని అసెంబ్లీ లాబీలో మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్ అన్నారు. అందువల్లే ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించలేదని పేర్కొన్నారు. సీఎంకు దమ్ముంటే ఫార్ములా-ఈ రేసు అంశంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని సవాల్ చేశారు.

స్థానిక సంస్థల చట్ట సవరణతో బీసీలకు అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్థానిక సంస్థల చట్టాల సవరణలను వ్యతిరేకిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన చట్ట సవరణ వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందని, 42 శాతం రిజర్వేషన్ హామీ గంగలో కలిసినట్టేనని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లను పక్కన పెట్టేలా ప్రత్యేక బీసీ కమిషన్ కొత్త మెలికలు పెడుతుందని తెలిపారు. ఈ అంశంలో అన్ని పార్టీల మద్దతున్న నేపథ్యంలో చట్ట సవరణలోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనే నిబంధన పెట్టి చట్టం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఇందుకు న్యాయస్థానాలు అంగీకరించకుంటే రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఆశ్రయిద్దామని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అనుకుంటే ఈ రాజ్యాంగ సవరణ సాధ్యమన్నారు. అయితే, బీసీలను మోసం చేసేందుకు ప్రభుత్వం ఈ సవరణలు ప్రవేశపెట్టిందని, అందుకే తాము వ్యతిరేకించామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చట్టంలో ఉండేలా సవరణలు కోరామన్నారు. ఈ అంశంలో సభలో ఓటింగ్ లేదా డివిజన్ అడుగుతామని కేటీఆర్ ప్రకటించారు.

ఫార్ములా ఈ-రేస్ విషయంలో

తప్పు చేయకపోతే భయమేల?

విచారణకు కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?

» మొదటిసారి రేస్ నిర్వహణతో రూ.200 కోట్ల నష్టం
» అందుకే రెండోసారి ప్రమోటర్ ముందుకు రాలేదు
» అన్నీ తెలిసీ కేటీఆర్ రూ.55 కోట్లు ఎందుకిచ్చారు?
» కోడ్ అమల్లో ఉండగా చెల్లింపులు నేరం కాదా?: పొన్నం



హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి ఏ తప్పూ చేయకపోతే.. విచారణకు కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇప్పుడు దీనిపై ఎఫ్ఐఆర్ నమోదైందనే భయంతోనే అసెంబ్లీలో చర్చించాలని అంటున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై కేటీఆర్ ప్రెస్‌మీట్‌కు స్పందనగా.. పార్టీ ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, విజయ రమణారావు, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి గురువారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. తప్పు జరగకపోతే ఏసీబీ ముందే కేటీఆర్ తన నిజాయితీని నిరూపించుకోవాలని ఆయన సూచించారు. ఫార్ములా ఈ రేస్ హైదరాబాద్‌లో మొదటిసారి నిర్వహించినప్పుడు నష్టం వచ్చిందని మంత్రి గుర్తుచేశారు. "ఫార్ములా ఈ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ పెరిగిందా? లేదా? ట్యాంక్ బండ్, ఐమ్యాక్స్ చుట్టూ ఉన్నవారు ఇబ్బంది పడ్డారా? అనేది ప్రజలకు తెలుసు. దీనిపై గొప్పలు చెప్పుకుంటే తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలూ నవ్వుకుంటారు. మొదటిసారి ఫార్ములా ఈ రేస్‌తో భారీగా నష్టం జరగడంతో రెండోసారి ప్రమోటర్ కూడా ముందుకు రాలేదు. ఇదంతా తెలిసినప్పటికీ హెచ్ఎండీఏ వైస్‌చైర్మన్‌గా ఉన్న కేటీఆర్ ఎందుకు రూ.55 కోట్లు చెల్లించారు? అది ప్రజాధనమని మరిచిపోయారా? లేక అవి ఆయన సొంత డబ్బులా?" అని దుయ్యబట్టారు. అధికారం ఉంది కదా అని దుర్వినియోగం చేయడంతో పాటు.. మళ్లీ అధికారంలోకి వస్తామనే అహంకారంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది నిజం కాదా అని నిలదీశారు. "హెచ్ఎండీఏ డబ్బును ఎవరి అనుమతీ లేకుండా వాడుకునే వీలుందా? డబ్బులు బదిలీ చేసేందుకు ఎవరి అనుమతి తీసుకున్నారు? అప్పటి మంత్రివర్గంలో చర్చ జరిగిందా? అప్పటి ముఖ్యమంత్రి ఆమోదించారా? ఆర్థిక శాఖ అనుమతి ఉందా? అసలు ఎవరి అనుమతీ లేకుండా విదేశాలకు తెలంగాణ ప్రభుత్వం డబ్బును ఎలా బదిలీ చేసింది? నిబంధనలు పాటించాలనే కనీస ధర్మం పాటించవద్దా? ప్రజాధనమంటే అంత చులకనా? అక్టోబర్ 5, 11 తేదీల్లో ఎఫ్ఐఏకు డబ్బులు బదిలీ చేసినట్లు బాహాటంగా చెప్పుకుంటున్న కేటీఆర్‌కు అప్పుడు ఎన్నికల షెడ్యూలు విడుదలైన విషయం తెలియదా? ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు డబ్బుల చెల్లింపులు చేయటం నేరం కాదా?" అని మంత్రి పొన్నం ప్రభాకర్ నిప్పులు చెరిగారు.

ఇదీ నేపథ్యం..

హైదరాబాదులో తొలుత ఫార్ములా రేస్ సీజన్ 9 జరిగింది. అదే వరుసలో ఫార్ములా రేస్ 10 నిర్వహణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు, అనుమతి లేకుండా చేసిన చెల్లింపులపై ఏసీబీ దర్యాప్తు జరుపుతోంది. ఈ రేసుల నిర్వహణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం, సీఎం ఆమోదం లేవని పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. "సీజన్ 9 నిర్వహణకు దాదాపు రూ.200 కోట్లు ఖర్చు కాగా.. అందులో రూ.150 కోట్లను హెచ్ఎండీఏకు ఫార్ములా రేస్ కంపెనీకి మధ్య మీడియేటర్‌గా వ్యవహరించిన నెక్స్ట్ జెన్ (గ్రీన్కో) అనే ప్రైవేటు సంస్థ ఖర్చు చేసి భారీగా నష్టపోయింది. అంటే.. కేటీఆర్ గొప్పలు చెప్పుకున్న ఫార్ములా రేస్‌తో నష్టం తప్ప హైదరాబాద్‌కు ఒక్క రూపాయి కూడా లాభం జరగలేదు. ఐమ్యాక్స్ సమీపంలో నిర్వహించిన రేస్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సచివాలయ పరిసరాల్లో కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయి. కానీ.. కేటీఆర్ సొంత ప్రయోజనాల కోసం రెండోసారి కూడా అదే రేసు నిర్వహణకు మొగ్గు చూపారు" అని పొన్నం దుయ్యబట్టారు. మొదటిసారి నష్టాలు రావటంతో సీజన్ 10 నిర్వహణకు గ్రీన్కో ముందుకు రాలేదని, స్పాన్సర్‌గా ఎవరూ ముందుకు రాకపోవడంతో హెచ్ఎండీఏ ఫార్ములా ఈ కంపెనీతో ఒప్పందానికి మొదట్లో వెనుకాడిందని.. కానీ, అప్పటికే రహస్య ఒప్పందం చేసుకున్న కేటీఆర్ రేస్ నిర్వహణకు డబ్బు చెల్లించాలని హెచ్ఎండీఏ అధికారులపై ఒత్తిడి చేశారని ఆయన ఆరోపించారు. మొదటిసారి నష్టపోయినా.. రెండోసారి స్పాన్సర్లు ముందుకురాకున్నా కేటీఆర్ తన సొంత లాభానికి ఈ ఫైలును ముందుకు నడిపారని ధ్వజమెత్తారు.

అజంజాహి విషయంలో కొండా యూటర్న్!

» కార్మిక భవనం స్థలం కార్మికులకే చెందేలా చూస్తా:కొండా మురళి

వరంగల్‌సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని అజంజాహి మిల్లు కార్మిక భవనం వివాదంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. 75 ఏళ్ల క్రితం మిల్లు కార్మికులు నిర్మించుకున్న యూనియన్ కార్యాలయ భవనం, స్థలంలో గత సోమవారం ఓ వస్త్ర వ్యాపారి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు పూనుకోగా.. దాని భూమి పూజలో వ్యాపారితోపాటు మంత్రి కొండా సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. దీంతో కార్మికుల పక్షాన 'ఆంధ్రజ్యోతి' అక్షర యుద్ధం ప్రకటించి వరుస కథనాలను ప్రచురించింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి నిఘా విభాగంతో మిల్లు భూమికి సంబంధించిన నివేదికను తెప్పించుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాలతో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధరరావు యూటర్న్ తీసుకున్నట్లు తెలుస్తోంది. గురువారం ఓసిటీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ కార్యాలయ స్థలంలో వస్త్ర వ్యాపారి చేయిస్తున్న పనులను వెంటనే నిలిపివేయించి ఆ భూమిని మిల్లు కార్మికులకే చెందేలా చూస్తానని స్పష్టంచేశారు. తాను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు వస్త్ర వ్యాపారి తనకు ఫోన్ చేసి పూజకు రమ్మంటే వెళ్లానే తప్ప వ్యాపారికి ఏదో లాభం చేకూర్చాలనికాదని చెప్పారు. ఆ స్థలం గురించి తెలుసుకోకుండా వెళ్లానని చెప్పారు. తాను కార్మికుల పక్షాన ఉండే వాడినని, వారికి న్యాయం చేయడం తన బాధ్యత అన్నారు. అవసరమైతే తాను ఆ భూమిని కొనుగోలు చేసి కార్మికులకు చెందేలా చూస్తానని స్పష్టం చేశారు. ఆ స్థలంలో ఎలాంటి పనులు జరగకుండా నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ కు చెప్పారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నగర మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మీడియా సమావేశం నిర్వహించారు. కొండా మురళీ రెండు మూడు రోజుల్లో కార్మిక భవన్ నిర్మించేందుకు నిధులు విడుదల చేయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కాగా మిల్లు కార్మికుల యూనియన్ స్థలంలో వస్త్ర వ్యాపారి అక్రమంగా నిర్మాణ పనులు చేపడుతుండడంతో కార్మికుల పక్షాన ఆంధ్రజ్యోతి అక్షర పోరాటం చేసినందుకు మిల్లు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి

» మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.4,605కోట్లకు సవరించగా, మంత్రివర్గం సైతం ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణానికి స్థల సేకరణ ఇబ్బందిగా మారిందన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు భూసేకరణకు రూ.37కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. ఈ వారంలో మరో రూ.22కోట్లు విడుదల చేస్తామన్నారు. ఖర్చు, ప్రయోజనాల శాతం ఆధారంగా రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను క్రమపద్ధతిలో పూర్తి చేస్తామన్నారు. నీటిపారుదల శాఖ బలోపేతానికి కట్టుబడి ఉన్నామని, తాము వచ్చాక 700 మందిని కొత్తగా నియమించాలని గుర్తు చేశారు.

గురుకులాల్లో ఆహార కమిటీల ఏర్పాటు: పొన్నం



హైదరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ఆహార కల్తీ ఘటనలకు ఆస్కారం లేకుండా ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మండలిలో పొన్నం మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రాజకీయ విమర్శలుచేయడం మానేసి.. ఆయా ప్రాంతాల్లోని గురుకులాలను సందర్శించాలని సూచించారు. రాష్ట్రంలో 327 బీసీ గురుకులాలు ఉంటే కేవలం 21 గురుకులాలకే సొంత భవనాలు ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా గురుకులాలను ప్రారంభించినా.. భవనాలు నిర్మించలేదని విమర్శించారు. తాము సమస్యల పరిష్కరిస్తున్నామని తెలిపారు.

90% వైద్యం జిల్లా స్థాయిలోనే..: దామోదర



రోగులకు అన్ని రకాల వైద్య సేవలు 90%వరకు జిల్లా స్థాయి ఆస్పత్రుల్లోనే అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) సౌకర్యం ప్రస్తుతం గాంధీ, పేట్ల బురుజు ఆస్పత్రుల్లోనే ఉందని, త్వరలో జిల్లాల్లోనూ ఐవీఎఫ్ సేవలు ప్రారంభించడానికి కృషి చేస్తామని చెప్పారు.

మాయల ఫకీరు చెబితేనే పని జరిగేది: పాయల్

"బాలనాగమ్మ కథలో మాయల పకీరు ప్రాణం చిలుకలో పెట్టినట్టు.. ఆదిలాబాద్‌లో ఉన్న భూములు నిషేధిత జాబితాలో పెట్టాలా? వద్దా? అనే అధికారం సైతం సీసీఎల్‌ఏకే అప్పగించారు. సీసీఎల్‌ఏలోని చిలుకకు మాయల పకీరు చెబితేనే పని జరిగేది. ఇదీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన తంతు" అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. ఆదిలాబాద్‌లో అడిగిన ధరకు ఇవ్వలేదన్న కారణంతో ఓ రైతు భూమిని సీసీఎల్‌ఏ సహకారంతో నిషేధిత జాబితాలో చేర్చారని, చివరకు ఆ రైతు అతి తక్కువ ధరకు భూమిని అమ్ముకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. భూ సమస్యల్ని కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాలని కోరారు. కొత్త ఆర్వోఆర్ చట్టంలో అధికారులపై దావాలు వేయరాదనే క్లాజు తొలగించాలన్నారు.

ఎడ్ల బండిపై అసెంబ్లీకి బీజేపీ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, మంగళ్‌హాట్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యేలు గురువారం, ఎడ్లబండిపై అసెంబ్లీకి వచ్చి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, రాకేశ్‌రెడ్డి, సూర్యనారాయణగుప్తా, రామారావు పాటిల్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ఎడ్లబండిపై వచ్చారు.

రాజగోపాల్‌రెడ్డి... కాబోయే సీఎం!

» ఎమ్మెల్యే వివేకానంద్ సరదా వ్యాఖ్య

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాబోయే సీఎం... అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఉద్దేశించి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద్ ఆటపట్టించారు. దీనిపై రాజగోపాల్‌రెడ్డి స్పందిస్తూ.. తాను సీఎం కంటే ముందు మంత్రి కావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ వద్ద తాను ప్రస్తావిస్తానని వివేకానంద్ పేర్కొనగా.. తనకు మంత్రి పదవి ఎప్పుడు ఇవ్వాలన్నది కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తుందని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. "అన్నా నువ్వు మంత్రి అయ్యే దాకా నీతో మాట్లాడను..ఇదే నా శపథం"అని వివేక్ నవ్వుతూ అన్నారు.

బీఆర్ఎస్ నేతలకు మిగిలేది జైలు డ్రెస్సే

» ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

బీఆర్ఎస్ నేతలకు మిగిలేది జైలు డ్రెస్సేనని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నల్లచొక్కాలు, ఆటో డ్రైవర్ల యూనిఫారాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో లాబీలోకి వచ్చిన బాల్క సుమన్... ఇన్నర్ లాబీలోకి మాజీ ఎమ్మెల్యేలకు అనుమతి లేదంటూ అతికించిన బోర్డులను చూపిస్తూ అన్యాయమని రాజగోపాల్‌తో అన్నారు. "మీరు అధికారంలో ఉన్నప్పుడు మా పార్టీ ఎమ్మెల్యేలను గుంజుకుని.. మమ్మల్ని లాబీ అవుతల పడేసిండ్రు. మా సీఎం రేవంత్ మంచోడు కాబట్టి బీఆర్ఎస్ బతికిపోతోంది. నాలాంటోడు అయితే మీ పార్టీ పని అయిపోయేది" అని రాజగోపాల్ అనడంతో.. సుమన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎన్టీఆర్ అంటే నాకు గౌరవం: రాజగోపాల్ రెడ్డి

ఎన్టీఆర్ అంటే తనకు ఎనలేని గౌరవమని, ఆయన లెజెండరీ నాయకుడని రాజగోపాల్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఎన్టీఆర్ ఘాట్ విషయంలో తాను అనని మాటల్ని అన్నట్లుగా దుష్ప్రచారం చేశారని, తన వ్యాఖ్యల్ని వక్రీకరించారని తెలిపారు. తన ఎదుగుదలను అడ్డుకునే కుట్ర జరుగుతోందని, ఇలాంటివి పునరావృతం కానివ్వొద్దని మీడియాను కోరారు.



అసెంబ్లీ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటాలతో నిరసన తెలుపుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

» అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ సభ్యుల నిరసన

» షా వ్యాఖ్యలు... ప్రజలను గాయపర్చాయి: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను కించపరిచిన అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అసెంబ్లీ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నంతోపాటు పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్‌షా విషం కక్కడం.. దేశ ప్రజల గుండెను గాయపరిచిందన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలు మనువాద సంస్కృతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఆయన్ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానిస్తే.. బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందని మంత్రి పొన్నం నిలదీశారు. అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

హరీశ్ ఏ హోదాలో సభలో మాట్లాడుతున్నారు?: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మధ్య మరోసారి వాడీవేడి సంభాషణ జరిగింది. గురువారం సభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి వెంకట్‌రెడ్డి ప్రశ్న అడిగారు. దీంతో హరీశ్ రావు కల్పించుకుని ఒక మంత్రి, మరో మంత్రిని ప్రశ్న అడగడం ఏమిటని ప్రశ్నించారు. సభలో మంత్రులు ప్రశ్నలు అడిగే సంప్రదాయం లేదని, ఇలాగైతే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారుతుందని హరీశ్ అనడంతో మంత్రి కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. అసలు హరీశ్ రావు ఏ హోదాలో అసెంబ్లీలో మాట్లాడుతున్నారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ డిప్యూటీ లీడరా... ఎమ్మెల్యేనా... ఏ హోదాలో మాట్లాడుతున్నారో చెప్పాలని నిలదీశారు. ఏడాదిగా ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రాకపోవడం ప్రజల్ని అవమానించడమేనని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. నల్లగొండ గురించి, తన గురించి మాట్లాడే హక్కు హరీశ్‌కు లేదని అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ... నల్లగొండ జిల్లాలో ప్రజలు కింద ఫ్లోరైడ్... పైన మూసీ నీటితో ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో 70% పూర్తి అయిన పనుల్ని గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టిందన్నారు. ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ... సభలో మంత్రులు ప్రశ్నించే పరిస్థితి ఉండదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం జలాలను ఉమ్మడి నల్లగొండకు అందించామని, అవసరమైతే దీనిపై చర్చ పెట్టాలని సూచించారు. కాగా, బుధవారం నాటి సభలో హరీశ్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది.

ఔటర్ టెండర్‌పై సిట్

విచారణకు ఆదేశిస్తున్నట్లు రేవంత్ ప్రకటన.. శాసనసభలోనే ప్రకటించిన ముఖ్యమంత్రి

» హరీశ్, కేటీఆర్ కోరిక మేరకేనని వెల్లడి

» అప్పు తెచ్చి ఓఆర్ఆర్‌ను కాంగ్రెస్ నిర్మిస్తే.. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ అమ్మేసింది

» దేశం దాటి వెళ్లాలన్న ఆలోచనతోనే విక్రయం: రేవంత్



హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)ను ఓ ప్రైవేటు కంపెనీకి లీజుకు ఇచ్చిన వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సదరు లీజు సహా టెండరుపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో గురువారం ఆయన ప్రకటించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌తోపాటు రాష్ట్ర ప్రజల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మంత్రివర్గంలో చర్చించి, మంత్రుల సూచన, తీర్మానంతోనే విచారణకు ఆదేశిస్తున్నట్టు చెప్పారు. గురువారం మధ్యాహ్నం విరామం తరువాత ప్రారంభమైన శాసనసభలో రాష్ట్ర అప్పులపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. ఆ చర్చలో భాగంగా ఓఆర్ఆర్ లీజు టెండర్లను రద్దు చేయండంటూ హరీశ్ రావు, కేటీఆర్ కామెంట్లు చేశారు. దాంతో, ముఖ్యమంత్రి రేవంత్ జోక్యం చేసుకుని.. "అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6,500 కోట్లను అప్పు తెచ్చి ఓఆర్ఆర్‌ను నిర్మించింది. తర్వాత ఆ బాకీ కూడా తీర్చేసింది. అలాంటి ఔటర్ రింగు రోడ్డును అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పనంగా అమ్మేశారు. హడావిడిగా లీజుకు ఇచ్చారు. ఎన్నికల్లో ప్రజలు వారిని తిరస్కరించనున్నారని, ఓడించబోతున్నారని, బొంద పెట్టబోతున్నారని వారికి స్పష్టంగా తెలుసు. అందుకే, ఉన్నదల్లా తెగనమ్ముకుని దేశం విడిచి పారిపోవాలన్న ఆలోచనతో ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నారు. మాజీ ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు హయాంలోనే దీనిని విక్రయించారు. మళ్లీ ఇప్పుడు వారిద్దరే (హరీశ్, కేటీఆర్) విచారణ జరపాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వారిద్దరి కోరిక మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) నియమిస్తున్నాను. ప్రధాన ప్రతిపక్షం కోరిక మేరకు ఔటర్ టెండర్‌ను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విధానాలపై సభలోని సభ్యులందరి ఆమోదంతో విచారణకు ఆదేశిస్తున్నాను" అని వివరించారు. సంబంధిత విధివిధానాలను మంత్రివర్గంలో చర్చించి ఖరారు చేస్తామని చెప్పారు.

ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్‌ను పెట్టింది కాంగ్రెస్సే

సరైన విధివిధానాలను పాటించకుండా ఎన్నికలకు ముందు హడావిడిగా కొంతమంది వ్యక్తులకు అయాచిత లబ్ధి చేకూర్చడానికి ఔటర్ రింగు రోడ్డును అప్పగించేశారంటూ తెలంగాణ సమాజంలో తీవ్రమైన చర్చ జరిగిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. "ఆనాడు వైఎస్ఆర్ హయాంలో కాంగ్రెస్ పార్టీ జైకా నుంచి నిధులను తీసుకొచ్చి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుతోపాటు ఓఆర్ఆర్ లాంటి అద్భుతమైన మణిహారాలను నిర్మించింది. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా రాణించడానికి ఈ రెండూ ప్రధాన కారణం. గతంలో కాంగ్రెస్ అవలంబించిన విధానాల వల్లే బడ్జెట్‌లో 60-65 శాతం ఆదాయం సమకూరుతోంది. తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు రూ.2 లక్షల కోట్లపైచిలుకు బడ్జెట్‌కు వెళ్లడానికి కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన ప్రాజెక్టులే కారణం" అని వివరించారు. మెట్రో రైలు ప్రాజెక్టును తీసుకొచ్చింది కూడా కాంగ్రెస్సేనని చెప్పారు. హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలు, ఔటర్ రింగు రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైలు, ఐటీ, ఫార్మా కంపెనీలు తీసుకురావడమే కాకుండా శాంతి భద్రతలు కాపాడడం, మత సామరస్యాన్ని పెంపొందించడం వంటి విధానపరమైన కఠిన నిర్ణయాలను తీసుకుందని వివరించారు. అలాగే, పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్‌ను ఏడాది మొత్తం అందించిందని గుర్తు చేశారు. ఐఎస్‌బీ, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీలతోపాటు అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలను అప్పటి ప్రభుత్వాలు తీసుకొచ్చాయని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి స్టేడియాలను నిర్మించారని, అంతర్జాతీయ స్థాయి క్రీడలను ఇక్కడ నిర్వహించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయని, ఫలితంగా ఇప్పుడు రూ.2 లక్షల కోట్ల పైచిలుకు బడ్జెట్‌కు చేరామని, వీటి ద్వారానే ప్రధాన ఆదాయం వస్తోందని చెప్పారు.

సీఎంను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిని అసెంబ్లీలోని ఆయన చాంబర్లో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్ రెడ్డిలు కలిశారు. అయితే ఏ పార్టీ ఎమ్మెల్యేలయినా నియోజకవర్గ సమస్యలపై సీఎంను కలుస్తుంటారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకే కలిశారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



సభా పర్వం

'మూసీ'పై డీపీఆర్‌కు కసరత్తు

» పీపీఆర్‌ను మాత్రమే కేంద్రానికి పంపించాం

» బురదజల్లే కార్యక్రమం వద్దు:శ్రీధర్‌బాబు

» సభాహక్కుల నోటీసు ఇవ్వడంతోనే మూసీపై వాస్తవాలు చెప్పారు: కవిత



హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ కోసం డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) తయారీకి కసరత్తు జరుగుతోందని, ప్రిమిలినరీ ప్రాజెక్టు రిపోర్టు(పీపీఆర్) మాత్రం కేంద్ర ఆర్థిక శాఖకు పంపామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సంబంధించిన అంశంపై మంత్రి శ్రీధర్ బాబు తప్పు సమాచారం ఇచ్చారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో పాటు మరికొందరు సభ్యులు గురువారం ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్ నోటీసును మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అనుమతించారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రపంచబ్యాంకు రుణం కోసం డీపీఆర్ రూపొందించారా? అని సభ్యులు అడిగారని, లేదని తాను సమాధానం చెప్పానన్నారు. ప్రపంచ బ్యాంకు రుణం పొందాలంటే ఆరు దశలు ఉంటాయని, తాము ఇంకా మొదటి దశలోనే ఉన్నామన్నారు. పీపీఆర్‌కు డీపీఆర్‌కు మధ్య వ్యత్యాస్యాన్ని సభ్యులు గుర్తించాలని, బురద చల్లే కార్యక్రమాన్ని పక్కన పెట్టాలన్నారు. సభను సభ్యులే తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటు ప్రతిపాదన ఏదీ లేదని చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైల్ టికెట్ల ధరలు పెంచే ఆలోచన లేదని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. కొత్త మెట్రో రైలు ప్రాజెక్టు త్వరలో ప్రారంభం అవుతుందని, కేంద్ర అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. జీవో 317ను సరిదిద్దడానికి కొత్తగా 243, 244, 245 జీవోలు తెచ్చామని వివరించారు. కాగా, ఇంతకాలం మూసీ ప్రాజెక్టు పేరిట ప్రజలను మభ్యపెట్టిన రేవంత్‌రెడ్డి సర్కారు.. బీఆర్ఎస్ ఒత్తిడితో నిజం చెప్పిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని ఎట్టకేలకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు.

భూ ఆక్రమణలు, అవకతవకలపైనా సిట్!

» గత పదేళ్లలో జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం యోచన

» ఒకట్రెండు రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం

» ఇబ్రహీంపట్నంలోనే రూ.2.5 లక్షల కోట్ల విలువైన అసైన్డ్ భూములు ఆక్రమించారన్న భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూభారతిని అమలు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో గత పదేళ్ల కాలంలో జరిగిన భూ అవకతవకలు, ఆక్రమణలపై సమగ్ర విచారణ చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యాక 2014 నుంచి 2023 వరకు జరిగిన భూ లావాదేవీల్లో ప్రభుత్వ భూముల దుర్వినియోగంపై క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రెండు రోజుల క్రితం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంగా కూడా భూముల అన్యాక్రాంతంపై చర్చ జరిగింది. ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సుమారు 25 వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనట్లు తెలిపారు. ఒక్క ఇబ్రహీంపట్నం పరిధిలోనే 10 వేల ఎకరాలు అన్యాక్రాంతం చేశారని, అక్కడ ఎకరా రూ.10 కోట్ల విలువ ఉంటుందన్నారు. అన్యాక్రాంతమైన 25 వేల ఎకరాల భూముల మొత్తం విలువ రూ.2.50 లక్షల కోట్లు అని, ఈమేరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగిందన్నారు. ధరణి మసుగులో జరిగిన భూ ఆక్రమనలన్నీ బయట పెడతామని, దీని వెనకాల ఎంత పెద్దవారున్నా వదిలే ప్రసక్తేలేదని ఇప్పటికే పలు సందర్భాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ నేపథ్యంలో గత పదేళ్లలో చోటు చేసుకున్న భూ ఆక్రమణల మీద సమగ్ర విచారణ చేయడానికి సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

బినామీల పేరుతో చేతులు మారాయి

ఇటీవల ధరణి కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పార్ట్-బీలో పెట్టిన భూముల గురించి ప్రస్తావించింది. అందులో వివిధ కారణాలతో 13.38 లక్షల ఎకరాలు, అసలు ఏ కారణం లేకుండా 5.07 లక్షల ఎకరాలను పెండింగ్‌లో పెట్టారని పేర్కొన్నారు. ఈ భూముల్లో ధరణి అమల్లోకి వచ్చాక 2020 నుంచి గత నాలుగేళ్లలో ఎన్ని లావాదేవీలు జరిగాయి, ఎన్ని వేల ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి అనే అంశాలపైనా ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల నుంచి ఇది వరకే నివేదికలు తెప్పించింది. బినామీల పేరుతో పెద్దఎత్తున భూములు చేతులు మారినట్లు గుర్తించిన ప్రభుత్వం అందుకు కారకులైన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తోంది. పార్ట్-బీలో పెట్టిన భూముల్లో భూదాన్‌కు సంబంధించి 2,957 ఎకరాలు, వక్ఫ్ బోర్డుకు సంబంధించి 9672 ఎకరాలు, దేవాదాయ భూములు 15994 ఎకరాలు, అటవీ భూములు 34,612 ఎకరాలు, అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదానికి సంబంధించినవి 21,673 ఎకరాలు, ప్రభుత్వ భూములు అన్న అనుమానంతో 93,308, అనధికారిక ఆక్రమణలు (శివాయ్ జామీదార్) 16879 ఎకరాలు, సివిల్ కోర్టు వివాదాల్లో 34,755 ఎకరాలు, పీవోటీ కేసులకు సంబంధించి 78,543 ఎకరాలు, అసలు ఏ కారణం లేని భూములు 507,091 ఎకరాలు ఉన్నట్లు చూపారు. ఇవే కాకుండా ఇతరత్రా కారణాలతో కూడా వేలాది ఎకరాలను పార్ట్-బీలో పెట్టారు. రంగారెడ్డి, మెదక్, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలోనే అత్యధికంగా భూ ఆక్రమణలు జరిగినట్లు ప్రభుత్వం భావిస్తోంది. ఈడీ విచారణలోనూ రంగారెడ్డి జిల్లా నాగారంలో 50 ఎకరాల భూదాన్ భూములు చేతులు మారినట్లు తేలింది. అలాగే జీవో 59ను అడ్డు పెట్టుకుని గత ప్రభుత్వ హయాంలో కొందరు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సిట్ విచారణ ద్వారా ఆక్రమణల గుట్టురట్టు చేయాలని ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

సభలో అప్పుల గోల..!

ప్రభుత్వ అప్పులపై భట్టి వర్సెస్ హరీశ్

» పదేళ్లలో బీఆర్ఎస్ తీసుకున్న రుణాలు రూ.7.11లక్షల కోట్లు

» అప్పులకు అసలు, వడ్డీలే రూ.63 వేల కోట్లు చెల్లించాం

» ఆర్బీఐకి వివరాలిచ్చింది హరీశే

» ఎవరికి సభా హక్కుల నోటీసు ఇవ్వాలో చెప్పండి: భట్టి

» మేం తీసుకున్నది 4.17 లక్షల కోట్లే

» చేయని అప్పులను మా ఖాతాలో వేస్తే నోటీసులు: హరీశ్





హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై శాసనసభలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర దుమారం చెలరేగింది. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిందని అధికారం పక్షం.. ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ రూ.1.27 లక్షల కోట్లు అప్పు చేసిందని బీఆర్ఎస్ దుమ్మెత్తిపోసుకున్నాయి. బీఆర్ఎస్ హయాంలో రూ.7,11,911 కోట్ల అప్పు చేశారని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క ధ్వజమెత్తారు. పైగా, రిజర్వ్ బ్యాంక్ 'హ్యాండ్‌బుక్'లో చెప్పినట్లుగా తాము అంత అప్పు చేయలేదంటూ బీఆర్ఎస్ బుకాయిస్తోందని ఆరోపించారు. కార్పొరేషన్ల కోసం తెచ్చిన గ్యారెంటీ అప్పులను ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుందని, అందుకే ఇది కూడా ప్రభుత్వ అప్పుగానే భావించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరాలనే హ్యాండ్ బుక్‌లో పేర్కొన్నట్లు ఆర్‌బీఐ చెబుతోందని, అప్పట్లో ఆర్థిక మంత్రిగా వివరాలు ఇచ్చింది హరీశ్‌రావేనని గుర్తుచేశారు. తప్పుడు లెక్కలు చెప్పి, సభను తప్పుదారి పట్టించిన హరీశ్‌పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వాలా? లేక తనపై ఇవ్వాలా? సభనే తేల్చాలని భట్టి అన్నారు. కాగా, తాము చేయని అప్పును తమపై రుద్దుతున్నారని, పదేళ్లలో కేవలం రూ.4.17 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేశామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఇలా అప్పుల అంశం మల్లు భట్టి విక్రమార్క, హరీశ్‌మధ్య తీవ్ర దుమారాన్ని రేపింది. గురువారం ఇలా పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ వేడెక్కింది.

అప్పట్లో అప్పులే అప్పులు: భట్టి

రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన శ్వేతపత్రం, ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన హ్యాండ్ బుక్‌లలోని అంశాలను భట్టి కూలంకషంగా వివరించారు. బీఆర్ఎస్ పార్టీ తన హయాంలో మొత్తం రూ.6,71,757 కోట్ల అప్పు చేసిందని తెలిపారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడి బీఆర్ఎస్ చేసిన బడ్జెట్ అప్పులు రూ.3,89,673 కోట్లు, వివిధ కార్పొరేషన్లకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీల మేరకు తీసుకున్న 'స్పెషల్ పర్పస్ వెహికల్' అప్పులు రూ.1,27,208 కోట్లు, ప్రభుత్వ గ్యారెంటీల మేరకు కార్పొరేషన్లు తీసుకున్న, తిరిగి కార్పొరేషన్లే చెల్లించే అప్పులు రూ.95,462 కోట్లు, ప్రభుత్వ గ్యారెంటీలు లేకుండా కార్పొరేషన్లు తీసుకున్న అప్పులు రూ.59,414 కోట్లు.. మొత్తం రూ.6,71,757 కోట్లు అని వివరించారు. ఇవి కాకుండా బీఆర్ఎస్ దిగిపోయేనాటికే ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు, సంస్థలకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తం రూ.40,154 కోట్లు ఉన్నాయని, వాటినీ కలిపితే అప్పులు రూ.7,11,911 కోట్లు అని చెప్పారు. ఏడాది కాలంలో ఎఫ్ఆర్‌బీఎం కింద తాము రూ.52,118 కోట్లు తెచ్చామన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులపై ఏడాదిలో అసలు, వడ్డీ కింద రూ.63,796 కోట్లు చెల్లించినట్లు వివరించారు. రాష్ట్ర రాబడులపై 80 శాతం అదనంగా గ్యారెంటీ అప్పులను తెచ్చుకోవాల్సి ఉంటే.. బీఆర్ఎస్ వాళ్లు దాన్ని 200 శాతానికి పెంచుతూ చట్టాన్ని సవరించారన్నారు. బడ్జెట్ వెలుపల తీసుకుంటున్న గ్యారెంటీ అప్పుల గురించి వివరాలివ్వడం లేదంటూ 'కాగ్' కూడా తప్పుపట్టిందన్నారు. అప్పులు చేయడం తప్పుకాదు కానీ, దుర్వినియోగం చేయడానికే అప్పులు చేశారని.. ప్రజల భవిష్యత్తును తాకట్టుపెట్టి సొమ్మును దుర్వినియోగం చేశారని భట్టి మండిపడ్డారు.

శుద్ధ తప్పు: హరీశ్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. తమ హయాంలో చేసిన అప్పు రూ.4,17,296 కోట్లు మాత్రమేనని, రూ.7 లక్షల కోట్ల అప్పు చేశామనడం శుద్ధ తప్పు అని అన్నారు. గతేడాది డిసెంబరులో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఇప్పటివరకు రూ.1,27,708.84 కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ఏడాదిలోనే ఇంత అప్పు తీసుకుంటే.. ఐదేళ్లలో రూ.6,38,544.22 కోట్ల అప్పు చేయనున్నట్లు కాంగ్రెస్ చెప్పకనే చెప్పిందన్నారు. తమ ప్రభుత్వంలో వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్‌లతోపాటు ఎస్సీ, ఎస్టీ, విద్యా సంస్థలకు చెల్లింపులను చేయలేదంటున్నారని, వాటిని నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే భట్టి గవర్నర్‌కు రాజీనామా ఇస్తారా? అంటూ సవాల్ విసిరారు. తాము చేయని అప్పును బీఆర్ఎస్ ఖాతాలో వేస్తే.. ప్రభుత్వానికి లీగల్ నోటీసులు ఇస్తామని, కోర్టుకెళతామని చెప్పారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు కూడా ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల కోసం ప్రభుత్వ భూములను విక్రయిస్తోందని ఆరోపించారు. స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు గజం భూమిని కూడా విక్రయించలేదని, కేవలం పరిశ్రమల ఏర్పాటు కోసం టీజీఐఐసీకి భూములను బదలాయించే ప్రక్రియ మాత్రమే జరిగిందని స్పష్టం చేశారు. కాగా, ఉమ్మడి రాష్ట్రంలో ఐఎంజీ భరత్ సంస్థకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి, మామిడిపల్లిలో 850ఎకరాలు కేటాయించారని గుర్తుచేశారు. ఎకరం రూ.50కోట్లు ఉంటే రూ.50వేలకే అప్పగించారన్నారు. వాటిని వెనక్కి తీసుకుంటే రూ.42500 కోట్ల విలువైన భూములు ప్రభుత్వానికి వస్తాయన్నారు.

యూజ్‌లెస్ ఫెలో అంటావా!?

క్షమాపణ చెప్పాల్సిందే: రాజగోపాల్

నన్ను దొంగ అన్నారు: హరీశ్

'నిండు సభలో ఎమ్మెల్యేను యూజ్‌లెస్ ఫెలో అంటావా? ఇది క్షమించరానిది. క్షమాపణ చెప్పాల్సిందే' అని హరీశ్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర అప్పులపై జరిగిన స్వల్పకాలిక చర్చలో భట్టి అప్పుల గురించి మాట్లాడుతుండగా.. హరీశ్ ఒక్కసారిగా 'యూజ్‌లెస్ ఫెలో' అన్నారు. ఆ మాట మైక్‌లో గట్టిగా వినిపించింది. స్పందించిన రాజగోపాల్‌రెడ్డి.. ఎవరిని ఉద్దేశించి హరీశ్ ఆ మాట అన్నారో చెప్పాలని, ఎమ్మెల్యేను అంత మాట అంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను 'దొంగ' అన్నారని, అందుకే వారిని ఆ మాట అన్నానని హరీశ్ చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా నిలబడి హరీశ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు: ఉత్తమ్

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి పేద కుటుంబానికి తెల్ల రేషన్ కార్డులు జారీచేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. సంక్రాంతి తర్వాత కొత్త కార్డు ఇస్తామన్నారు. రేషన్ డీలర్లకు బీమా సౌకర్యం కల్పించే ఆలోచన ఉందని తెలిపారు. మరో రెండు నెలల్లో తెల్లకార్డులందరికీ సన్న బియ్యం సరఫరా చేస్తామని మంత్రి ప్రకటించారు. కాగా, ప్రభుత్వం సరైన రీతిలో సభను నడపడం లేదని, అజెండా ప్రకారం చర్చలు చేపట్టడం లేదని విపక్ష సభ్యులు ఆరోపించారు.

ముందస్తు బెయిల్‌పై.. మోహన్‌బాబు పిటిషన్ వాయిదా

» బెయిల్ ఇవ్వొద్దన్న జర్నలిస్టు రంజిత్

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీవీ చానల్ లోగోతో జర్నలిస్టుపై దాడికి సంబంధించిన కేసులో ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేస్తూ సినీనటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. మోహన్‌బాబు, ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణల కవరేజీలో ఉన్న రంజిత్‌పై మోహన్‌బాబు దాడి చేసిన విషయం తెలిసిందే.! దీనిపై పహాడీషరీఫ్ ఠాణాలో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ గురువారం మరోమారు జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ పిటిషన్‌లో జర్నలిస్టు రంజిత్ ఇంప్లీడ్ అయ్యారు. రంజిత్ తరఫున న్యాయవాది ఎనుగంటి సుధాంశురావు వాదనలను వినిపిస్తూ.. మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని పేర్కొన్నారు. మోహన్‌బాబు హైదరాబాద్‌లో లేరని.. దుబాయ్ వెళ్లిపోయారని పేర్కొన్నారు. మోహన్‌బాబు తరఫు న్యాయవాది అవినాశ్‌రెడ్డి వాదిస్తూ.. తన క్లైంట్ హైదరాబాద్‌లోనే ఉన్నారని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయన్న ధర్మాసనం.. అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని సూచించింది. ముందస్తు బెయిల్ విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది.

ఆర్టీసీ ఉద్యోగి మరణిస్తే అంత్యక్రియలకు 30 వేలు

విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు మరణిస్తే అంత్యక్రియలకు రూ. 30 వేలు చెల్లించనున్నారు. ఈ మేరకు టీజీఎస్ ఆర్టీసీ అధికారులు గురువారం సర్క్యులర్ జారీ చేశారు. ఇప్పటి వరకు రూ. 20 వేలుగా ఉన్న ఆ మొత్తాన్ని రూ. 30 వేలకు పెంచారు. ఇతర ప్రభుత్వ విభాగాల్లో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది మృతి చెందితే అంత్యక్రియల నిమిత్తం రూ. 30 వేలు కుటుంబ సభ్యులకు చెల్లిస్తున్నారు. ఇకపై ఆర్టీసీలోనూ రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విభాగాల్లో పనిచేసే సిబ్బంది మృతి చెందితే అంతే మొత్తాన్ని మట్టి ఖర్చులకు చెల్లించనున్నారు.

ఇన్‌స్టాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం పేరుతో ప్రకటన

» నమ్మి సంప్రదించిన యువకుడు

» నకిలీ ఆఫర్ లెటర్‌తో 24లక్షలు కాజేసిన సైబర్ నేరస్థుడు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తాం.. వెంటనే ఈ దిగువ నెంబర్లకు సంప్రదించండి అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ ప్రకటనను చూసి మోసపోయాడో యువకుడు. మాయమాటలతో నమ్మించి నకిలీ ఆఫర్ లెటర్ పంపిన సైబర్ నేరస్థుడు అతడి నుంచి రూ. 24.50 లక్షలు కాజేశాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి (22) ఇన్‌స్టాగ్రామ్‌లో సరదాగా రీల్స్ చూస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తాం.. మీకు కావాలంటే వెంటనే ఈ దిగువ నంబర్లకు సంప్రదించండి అంటూ వచ్చిన ఓ ప్రకటనను చూశాడు. ఆసక్తితో అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో ఉద్యోగం ఉందని తాను అందులో పెద్ద పోస్టులో ఉన్నానని నకిలీ ఐడీ కార్డును చూపి అటు నుంచి మాట్లాడిన వ్యక్తి యువకుడిని నమ్మించాడు. నమ్మిన యువకుడు పలు దఫాలుగా అతడికి రూ.24.50 లక్షలు చెల్లించాడు. కొద్ది రోజులకు యువకుడికి నమ్మకం కుదిరేలా నకిలీ ఆఫర్ లెటర్ పంపించాడు. ఈ ఆఫర్ లెటర్ నకిలీదని తెలుసుకున్న యువకుడు నేరగాడిని సంప్రదించగా, ఇంకో ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మజూపాడు. మోసపోయానని గ్రహించిన యువకుడు గురువారం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ చైర్మన్‌తో బుర్రా భేటీ

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ చైర్మన్ గోపాలకృష్ణన్‌తో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం భేటీ అయ్యారు. ఆయన ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం జరిగిన ఈ భేటీలో ఉద్యోగ నియామకాల్లో పాటిస్తున్న విధానంపై చర్చించారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే నియామకాల్లో కొన్ని సార్లు 50 లక్షల మంది అభ్యర్థులకు పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇంత భారీ సంఖ్యలో అభ్యర్థులకు పరీక్షలను నిర్వహించే సమయంలో పాటించే జాగ్రత్త పద్ధతులు, నియామక ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు.

ఎస్‌బీఐలో 13,735 జేఏ పోస్టులు

» తెలంగాణలో 342, ఆంధ్రప్రదేశ్‌లో 50 ఖాళీలు

దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 13,735 జూనియర్ అసోసియేట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వాటిలో తెలంగాణలో 342, ఆంధ్రప్రదేశ్‌లో 50 పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల 7వ తేదీ వరకు అవకాశమిచ్చింది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 2024 ఏప్రిల్ 1 నాటికి 20-28 సంవత్సరాల మధ్య ఉండాలి. అయితే గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంది. అలాగే అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి లేదా గ్రాడ్యుయేషన్ ఆఖరి సంవత్సరం చదువుతున్న వారై ఉండాలి. ఈ పోస్టులకు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష 2025 ఫిబ్రవరిలో, మెయిన్ పరీక్ష 2025 మార్చి/ఏప్రిల్‌లో జరుగుతుంది. వివరాల కోసం https://sbi.co.in/web/careers/currentopenings వెబ్‌సైట్‌ను సందర్శించ

పోలీసులు వేధిస్తున్నారని.. హెయిర్ డై తాగి నలుగురు యువకుల ఆత్మహత్యాయత్నం

మందమర్రిటౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసులు వేధిస్తున్నారని నలుగురు యువకులు హెయిర్ డై తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన ఆవుల షారుక్, మెస్రం రాజు, బామండ్ల శివ, సెగ్గెం అజయ్‌కుమార్ అనే యువకులు మూసివేసిన కేకే 1 సీఎస్పీ సమీపంలో హెయిర్ డై తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అంతకు ముందు సెల్ఫీ వీడియోలో మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా తమను పోలీసులు వేధిస్తున్నారని, ఎక్కడ దొంగతనాలు జరిగినా తమను స్టేషన్‌కు పిలుస్తున్నారని, తమతో పాటు కుటుంబసభ్యులను దుర్భాషలాడుతున్నారని వీడియోలో పేర్కొన్నారు. ఈ క్రమంలో స్థానికులు గమనించి యువకులను ఆస్పత్రికి తరలించారు. కాగా, కేసుల నుంచి తప్పించుకునేందుకే యువకులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. షారుక్‌పై 4 కేసులు, రాజుపై 7, శివపై 3, అజయ్‌కుమార్‌పై 3 కేసులు ఉన్నాయని చెప్పారు. కేసుల విచారణలో భాగంగా నేరస్తులను పిలవడం జరుగుతుందని, వారిని ఎలాంటి వేధింపులకు గురి చేయలేదన్నారు.

అమెరికాలో ప్రమాదం..బోధన్‌వాసి మృతి



నీరజ్ గౌడ్ (ఫైల్)

బోధన్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన పంజాల నీరజ్ గౌడ్ (23) అనే యువకుడు మృతి చెందగా.. అదే పట్టణానికి చెందిన శ్రీధర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏడాదిన్నర క్రితం ఉన్నత విద్య నిమిత్తం వీరిరువురూ అమెరికా వెళ్లారు. అమెరికాలోని న్యూహెవెన్ సిటీలో నివాసం ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. ఈ నెల 16వ తేదీన వ్యక్తిగత పని నిమిత్తం వీరిద్దరూ బ్రిడ్జిపోర్టు ప్రాంతానికి వెళ్లి తిరిగి వస్తుండగా తీవ్రమైన మంచు కురుస్తుండడంతో వీరి కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పోలీసు పెట్రోలింగ్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నీరజ్‌గౌడ్ మృతి చెందాడు. శ్రీధర్ చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంలో అమెరికా పెట్రోలింగ్ పోలీసు సిబ్బందికి కూడా తీవ్ర గాయాలైనట్లు సమాచారం. మరో ఐదు నిమిషాల్లో వీరు తమ రూమ్‌కు చేరుకుంటారనగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద విషయం తెలియగానే యువకుల కుటుంబసభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. నీరజ్ గౌడ్ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని అతడి కుటుంబసభ్యులు తెలిపారు.

మార్చి 21 నుంచి టెన్త్ పరీక్షలు

రెండు రోజుల పాటు సైన్స్ పేపర్ పరీక్షలు

షెడ్యూల్‌ను విడుదల చేసిన అధికారులు

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు గురువారం విడుదల చేశారు. వీటిని ఆరు పేపర్లతో నిర్వహిస్తుండగా, సైన్స్ పేపర్ పరీక్షను మాత్రం రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి 19వ తేదీల మధ్య జరుగనున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షలు ముగిసిన వెంటనే టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 21న ప్రారంభమయ్యే టెన్త్ పరీక్షలు ఏప్రిల్ 2తో ముగియనున్నాయి. అయితే.. ఏప్రిల్ 3,4వ తేదీల్లో టెన్త్ ఒకేషనల్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలన్నీ కూడా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. అయితే, సైన్స్ పేపర్ల పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు



అబ్జెక్టివ్ పేపర్ జవాబులను చివరి అర్ధగంటలో మాత్రమే రాయాల్సి ఉంటుంది. అయితే, సైన్స్ అబ్జెక్టివ్ పేపర్‌ను మాత్రం చివరి 15 నిమిషాల్లో రాయాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు.

పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ వివరాలు

తేదీ	పరీక్ష పేరు
21-03-2025	ఫస్ట్ లాంగ్వేజి
22-03-2025	సెకండ్ లాంగ్వేజి
24-03-2025	థర్డ్ లాంగ్వేజి
26-03-2025	మ్యాథమేటిక్స్
28-03-2025	ఫిజికల్ సైన్స్
29-03-2025	బయోలాజికల్ సైన్స్
02-04-2025	సోషల్ స్టడీస్

పదేళ్లలో అనుకూల చరిత్ర రాయించుకున్నారు

అదే నిజమైన చరిత్రగా భ్రమలు కల్పించారు.. దాంట్లో అమరులకు చోటు దక్కలేదు

» కేసీఆర్ హయాంపై సీఎం రేవంత్ విమర్శ

» 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన ముఖ్యమంత్రి

» పఠనం ద్వారానే వాస్తవాలు తెలుస్తాయి

» యువత పుస్తకాలు చదవాలి: సీఎం

» బుక్‌ఫెయిర్ 37 ఏళ్ల చరిత్రలో తొలిసారి సీఎం రాక.. నిర్వాహకుల హర్షం




37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి జూపల్లి తదితరులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతోపాటు తొలి, మలి దశల రాష్ట్ర సాధన ఉద్యమాల చరిత్రలో ఎంతో మంది త్యాగధనులకు, అమరులకు సముచిత స్థానం దక్కలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సమిధలైన వారి త్యాగాలకన్నా రాజకీయ ప్రయోజనాలు పొందిన వారి చరిత్రపైనే ఎక్కువ చర్చ సాగడం బాధాకరమన్నారు. గురువారం 37వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనను సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్లపాటు అధికారం చేతిలో ఉన్నవారు, తమకు అనుకూలమైన చరిత్రను రాయించుకొని అదే నిజమైన చరిత్ర అని సమాజంలో భ్రమలు కల్పించారని మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. ఆ చరిత్రలోని వాస్తవాలను, అవాస్తవాలను ప్రజలు గుర్తించాలి అని సూచించారు. మరోవైపు, పుస్తక పఠనం అవసరాన్ని వివరిస్తూ.. 'డిజిటల్ యుగంలో రకరకాల సామాజిక మాధ్యమాల వల్ల పుస్తకాలకు ప్రాధాన్యం తగ్గింది. చరిత్ర చదవడం ద్వారా భవిష్యత్తుకు పునాదులు నిర్మించుకోవచ్చు అన్న ఆలోచన క్రమంగా సన్నగిల్లుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పుస్తకాల పండుగ భావితరాలకు ఒక స్ఫూర్తిని ఇవ్వాలి. చరిత్ర పఠనం ఆవశ్యకతను ఎలుగెత్తి చాటాలి. తద్వారా భవిష్యత్తుకు సరైన దశాదిశను నిర్దేశించుకోగలమన్న సందేశాన్ని ఈ వేదిక ద్వారా తెలియజెపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సామాజిక స్పృహను పెంపొందించడానికి తోడ్పడే పుస్తక ప్రదర్శనలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని, దీంట్లోభాగంగానే తనతో పాటు సహచర మంత్రులు ఈ పుస్తక మహోత్సవంలో పాల్గొంటున్నాం అని సీఎం రేవంత్ తెలిపారు. తమ కలం ద్వారా, గళం ద్వారా సామాజిక చైతన్యాన్ని అందించడమేగాక, ప్రజా పోరాటాల నిర్మాణానికి దోహదపడిన కవులు, రచయితల పేర్లు బుక్‌ఫెయిర్‌లోని పలు వేదికలకు పెట్టడం మంచి విషయమంటూ నిర్వాహకులను సీఎం అభినందించారు.

పుస్తకాల నుంచే ఎంతో నేర్చుకున్నా

'కొత్తతరానికి తెలిసిందల్లా సమాచారం కోసం గూగుల్‌ను ఆశ్రయించడమే. అందులో ఎవరు సమాచారం ముందుగా పొందుపరిస్తే, దాన్నే నిజం అనుకుంటారు. తద్వారా వాస్తవం ఏమిటో బోధపడదు. నిజానికి, చరిత్ర పుస్తకాలు చదవడం ద్వారా గొప్పవ్యక్తుల త్యాగాలను తెలుసుకోగలం. అందుకే యువత తప్పనిసరిగా చరిత్ర పుస్తకాలు చదవాలి' అని రేవంత్ సూచించారు. పుస్తకాల ద్వారా సముపార్జించిన జ్ఞానంతోనే తాను.. ఉమ్మడి ఏపీలో తెలంగాణ బిల్లుపై చర్చ సందర్భంలోనూ, అనంతరకాలంలో తెలంగాణ ఉద్యమ చరిత్ర రచనల్లోని అసమగ్రతను, వక్రీకరణలను ప్రశ్నించగలిగానని తెలిపారు. ఆనాడు సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి వంటి మహనీయులు మొదలు, తర్వాత కాలంలో గద్దర్, గూడ అంజన్న లాంటి కవులు, కళాకారులు ఎంతోమంది తనలాంటి వారికి నిజమైన తెలంగాణ ఆకాంక్షలను గుర్తెరగడానికి కావాల్సిన స్ఫూర్తిని అందించారన్నారు. అటువంటి పోరాట యోధుల ఉజ్వల చరిత్రను యువతరానికి అందించటానికి పుస్తక ప్రదర్శన ప్రధాన వేదిక కావాలని ఆకాంక్షించారు. కాగా, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీకి గ్రంథాలయం, పుస్తకావిష్కరణల వేదికతో కూడిన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సభాముఖంగా కార్యనిర్వాహకులు సీఎంను కోరారు. దీనిపై రేవంత్ స్పందిస్తూ, శాశ్వత భవనం ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. సొసైటీకి అవసరమైన వసతుల మీద ఒక నివేదికను రూపొందించి ప్రభుత్వానికి ఇవ్వవలసిన బాధ్యతను ఎమ్మెల్సీ కోదండరామ్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్.. పుస్తక పఠనం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రసంగించారు. రోజులో కనీసం అరగంటైనా పఠనానికి సమయం కేటాయించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ పుస్తక ప్రదర్శన 37 ఏళ్ల చరిత్రలో.. బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి హాజరైన మొట్టమొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు, కవి యాకూబ్ తెలిపారు. సమాజం పట్ల సీఎంకు ఉన్న నిబద్ధతకు ఇదే నిదర్శనమని కొనియాడారు.



చర్లపల్లి జైలు నుంచి విడుదల సందర్భంగా అభివాదం చేస్తున్న పట్నం నరేందర్ రెడ్డి

'చర్లపల్లి' నుంచి పట్నం నరేందర్ రెడ్డి విడుదల

కుషాయిగూడ, కంది, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటన నిందితుడు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గురువారం సాయంత్రం చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. ఆయనకు బుధవారం నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విగిలిన వారి కూడా బెయిల్ మంజూరయినా పత్రాలు అందక సంగారెడ్డి జైలులోనే ఉండిపోవాల్సి వచ్చింది. విడుదలయిన సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ 'న్యాయం గెలిచింది', ఇది 'బీఆర్ఎస్ పోరాటానికి దక్కిన మరో విజయమని' పేర్కొన్నారు. సీఎం రేవంత్ కక్ష సాధింపులకు పాల్పడకుండా, చేతనైతే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తనపై తప్పుడు కేసులు పెట్టడమే కాకుండా, కేటీఆర్‌ను కూడా కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జైలు వద్దకు చేరుకొని పట్నం నరేందర్ రెడ్డికి స్వాగతం పలికారు. ఇదే సంఘటనలో అరెస్టయి సంగారెడ్డి జైలులో ఉన్న 28 మంది లగచర్ల గ్రామస్థులు మాత్రం గురువారం విడుదల కాలేదు. వారికి కూడా బుధవారం నాంపల్లి కోర్టు బెయిలు మంజూరు చేసింది. వారు విడుదలవుతారని భావించి కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలు వద్ద ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, సంగారెడ్డి రూరల్, కొండాపూర్, ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్ల సీఐల ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. సాయంత్రం ఆరు గంటల వరకు కూడా బెయిల్ పత్రాలు జైలు అధికారులకు అందకపోవడంతో విడుదల చేసే సమయం మించిపోయింది. వాటిని తీసుకొని న్యాయవాదులు రాత్రి 9 గంటల ప్రాంతంలో జైలుకు వచ్చారు. గడువు దాటిపోవడంతో ఆ పత్రాలను గేటుకు ఉన్న బాక్స్‌లో వేసి వెళ్లిపోయారు.



క్యాప్సూల్‌ను చూపుతున్న నాగేశ్వర్‌రెడ్డి తదితరులు

గ్యాస్ట్రిక్ సమస్యలను గుర్తించే క్యాప్సూల్

ఏఐజీలో అందుబాటులోకి 'క్యాప్సూల్ ఎండోస్కోపీ టెక్నాలజీ'.. పిల్‌బాట్

» దీంతో జీర్ణాశయ ఇబ్బందుల నిర్ధారణ

» ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డా. నాగేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ట్రిక్ సమస్యలను గుర్తించడానికి ఎండోస్కోపీ చేయడం రివాజు! అయితే అది పేషెంట్లకు ఇబ్బందికరమైన ప్రక్రియ. పేషెంట్ నోటి ద్వారా గొంతులోంచి కడుపులోకి పైపును జొప్పించి సమస్య ఏమిటో తెలుసుకునే ఆ ప్రక్రియకు స్వస్తి చెప్పే సమయం ఆసన్నమైంది! దానికి బదులుగా.. ఒక చిన్న క్యాప్సూల్‌తో గ్యాస్ట్రిక్ సమస్యను గుర్తించే టెక్నాలజీ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చింది. ఆ క్యాప్సూల్‌ను కడుపులోకి పంపిస్తే చాలు.. జీర్ణాశయ సమస్యలను ఇట్టే గుర్తిస్తుంది. దీంట్లో ఉండే 2.3 మెగాపిక్సెల్ కెమెరా.. లోపలి భాగంలోని రియల్‌టైమ్ హై రిజల్యూషన్ లైవ్ విజువల్స్‌ను ప్రసారం చేస్తుంది. ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి గురువారం దీన్ని ప్రారంభించి.. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీని గురించి వివరించారు. ఈ పిల్‌బాట్ ఖరీదు రూ.5000-7000 మధ్య ఉంటుందని ఆయన తెలిపారు. గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడేవారు పరగడుపున ఈ క్యాప్సూల్ వేసుకుని నీళ్లు తాగితే.. అది క్షణాల్లో జీర్ణాశయంలోకి ప్రవేశించి అక్కడ సమస్యలను గుర్తిస్తుందని.. మర్నాడు మలవిసర్జన సమయంలో బయటకు వచ్చేస్తుందని.. దీనివల్ల రోగికి, పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదని వివరించారు.

ఈ క్యాప్సూల్ నిర్ధారించే జబ్బులివే..

జీర్ణాశయంలో ఉత్పన్నమయ్యే అల్సర్లు, పాలిప్స్, రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్, కేన్సర్లను ఈ క్యాప్సూల్ గుర్తిస్తుందని డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా.. పెద్ద పేగు వద్ద ఏర్పడే కేన్సర్‌ను గుర్తిస్తుందని వెల్లడించారు. రోబోటిక్ పరికరానికి అనుసంధానమై ఉండే ఈ క్యాప్సూల్‌ను లోపల ఎక్కడికి కావాలంటే అక్కడికి పంపి సమస్యలను గుర్తించే అవకాశం ఉంటుందని వివరించారు. పిల్‌బాట్‌ను అభివృద్ధి చేసిన అమెరికా సంస్థ 'ఎండియాటిక్స్' సహవ్యవస్థాపకుడు డాక్టర్ అలెక్స్.. ఈ క్యాప్సూల్ వేసుకుని లైవ్ డెమో ఇవ్వడం విశేషం. ఆయన ఆ క్యాప్సూల్‌ను వేసుకున్నాక.. మయో క్లినిక్ (అమెరికా) గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం చైర్ డాక్టర్ వివేక్ కుంభారీ దాన్ని ఒక కంట్రోలర్ ద్వారా బయటినుంచే నియంత్రించారు. క్యాప్సూల్‌ను ఆయన జీర్ణాశయంలో పలు భాగాలకు పంపి అక్కడి విజువల్స్‌ను చూపించారు. ఈ క్యాప్సూల్ ఎండోస్కోపీ ద్వారా జీర్ణాశయ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే వాటికి సమర్థంగా చికిత్స చేయవచ్చని వైద్యులు వివరించారు. కాగా.. ఈ క్యాప్సూల్‌పై క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయని.. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ అనుమతులు రాగానే (2026 నాటికి) పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఎండియాటిక్స్ సహవ్యవస్థాపకుడు డాక్టర్ అలెక్స్ తెలిపారు.

తెలియదు.. నాకు గుర్తులేదు..!

కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలకు స్మితాసబర్వాల్ జవాబులు.. బ్యారేజీలు ఎప్పుడు ప్రారంభించారో తెలియదు!

కమిషన్‌కు మాజీ సీఎస్ సోమేశ్ సమాధానం

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరైన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ చిత్రమైన జవాబులు ఇచ్చారు. కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు ఆమె.. 'తెలియదు.. నాకు గుర్తులేదు.. మరిచిపోయా' అనే సమాధానాలు ఇవ్వడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి 2023 డిసెంబరు దాకా సీఎంవో కార్యదర్శిగా ఉంటూ నీటిపారుదల శాఖ వ్యవహారాలు చూసిన స్మితను కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో భాగంగా గురువారం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. 'మంత్రివర్గ ఆమోదం లేకుండా, ఆర్థిక శాఖ సమ్మతి లేకుండానే కేవలం సీఎం ఆమోదంతో మేడిగడ్డ బ్యారేజీకి రూ.2591 కోట్లు, అన్నారం బ్యారేజీకి రూ.1785 కోట్లు, సుందిళ్ల బ్యారేజీకి రూ.1437 కోట్లతో 2016 మార్చి 1న పరిపాలన అనుమతులు జారీ చేశారా?' అని ప్రశ్నించగా.. 'నాకు తెలియదు' అని స్మిత బదులిచ్చారు. మంత్రి(టి.హరీశ్) స్వయంగా సీఎం వద్దకు ఫైల్స్ తీసుకెళ్లి ఆమోదం తీసుకొని ఉండొచ్చని, సీఎం వద్దకు వెళ్లే ప్రతీ ఫైల్ తన ద్వారానే వెళ్లదని, కొన్ని సందర్భాల్లో నేరుగా కూడా తీసుకెళతారని చెప్పారు.

మీరు సీఎంవో కార్యదర్శిగా ఎప్పటి నుంచి పనిచేశారు? క్యాబినెట్ నిర్ణయాలన్నీ తెలుసా?

స్మిత: 2014 జూన్ నుంచి 2023 డిసెంబరు దాకా సీఎంవో కార్యదర్శిగా పనిచేశా. క్యాబినెట్ తీసుకునే నిర్ణయాలన్నీ తెలుసు.

మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు క్యాబినెట్ ఆమోదం ఉందా?

క్యాబినెట్ ఆమోదం ఉంది.

క్యాబినెట్ ఆమోదానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణాలకు సీఎం అనుమతితో జీవోలు ఇచ్చినట్లు తెలుసా?

తెలియదు. సమాచారం లేదు. మంత్రి (హరీశ్‌రావు) నేరుగా సీఎం (కేసీఆర్) ఆమోదం తీసుకొని, జీవో జారీ చేసి ఉండొచ్చు. ఆ తర్వాత అనుమతి తీసుకొని ఉండొచ్చు.

మేడిగడ్డ బ్యారేజీ కోసం రూ.6.67 కోట్లతో సర్వేకు సీఎం ఆమోదంతో జీవో ఇచ్చారు.దానికి క్యాబినెట్ ఆమోదం తీసుకున్నారా?

ఆ జీవో విషయంలో ఏం జరిగిందో తెలియదు. కొన్నిసార్లు జీవోలిచ్చి, తర్వాత అనుమతి తీసుకుంటారు. నా ద్వారా ఏ ఫైలు వచ్చినా బిజినెస్ రూల్ ప్రకారం వచ్చిందా? లేదా? అనేది పరిశీలించి, ఫైలులో అంశాన్ని సీఎంకు నివేదించడమే నా బాధ్యత.

సీఎంవోలో మీ విధులు, బాధ్యతలేంటి?

జీవో నం.747 ద్వారా నాకు 7 శాఖల బాధ్యతలు అప్పగించారు. ఆయా శాఖలకు చెందిన అంశాలపై జిల్లాల్లో పర్యటించి, కలెక్టర్లు, శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టుల పనులు ముందుకు వెళ్లేలా చూడడం నా బాధ్యత.

సీఎంకు వెళ్లే ఫైలులో మీరేమైనా నోట్ రాస్తారా?

లేదు. ఏమైనా రిమార్కులు, ఉల్లంఘనలు జరిగితే పరిశీలించడం నా బాధ్యత.

ఏ శాఖ అయినా కాళేశ్వరంపై నోట్ పంపిందా?

నేను పనిచేసిన సమయంలో రాలేదు.

బ్యారేజీల ప్రారంభం తెలీదు: సోమేశ్

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఎప్పుడు ప్రారంభమయ్యాయో తనకు తెలియదని మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ ఎప్పుడు పూర్తయిందని కమిషన్ ప్రశ్నించగా.. తాను 2019 మే 2 నుంచి ఆగస్టు 18 దాకా మాత్రమే నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించానని సమాధానం ఇచ్చారు. బ్యారేజీ 2019 జూన్ 21న పూర్తవడం గమనార్హం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా చేరే నాటికే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. మీ హయాంలో ఏమైనా సర్క్యులర్/జీవోలు ఇచ్చారా అని కమిషన్ ప్రశ్నించగా.. తెలియదని సోమేశ్ జవాబిచ్చారు. 2019 ఆగస్టు 6న జీవో నం.329ను మేడిగడ్డలో అదనపు పనుల కోసం మీరే జారీ చేశారు కదా? అని జీవోను చూపిస్తూ కమిషన్ ప్రశ్నించగా.. గుర్తులేదని చెప్పారు. మీ హయాంలో బ్యారేజీలు ఆర్థికంగా లాభదాయం కాదని ఏమైనా లేఖలు వచ్చాయా అని ప్రశ్నించగా.. రాలేదని చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ 6, 7, 8, 10, 12ను రెండేళ్లలో పూర్తిచేయాలని జీవో జారీ అయిన విషయం మీకు తెలుసా అని అడగ్గా.. ఆ సమయంలో తాను వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా ఉన్నానని తెలిపారు. పన్నులు ఏ మేరకు వసూలు చేశారని ప్రశ్నించగా.. ఆశాజనకంగానే వసూలు చేశానని సోమేశ్ బదులిచ్చారు. మూడు బ్యారేజీల నిర్మాణాలకు జీవోలను క్యాబినెట్ ఆమోదం తీసుకోకుండానే జారీ చేశారా అని ప్రశ్నించగా.. అన్నింటికీ క్యాబినెట్ ఆమోదం ఉంటుందన్నారు.

మిమ్మల్ని ఇంద్రనీలం కాపాడుతోంది: కమిషన్

ఎగ్జామినేషన్ ముగిశాక జస్టిస్ ఘోష్ సోమేశ్‌ను ఉద్దేశించి సరదాగా వ్యాఖ్యానించారు. 'మిమ్మల్ని ఇంద్రనీలం (వేలికి ఉన్న ఉంగరంలోని వజ్రాన్ని చూసి) కాపాడుతోంది' అని ఘోష్ వ్యాఖ్యానించగా.. 'మీరు అస్ట్రాలజర్' అని సోమేశ్ అన్నారు. దాంతో 'నేను మీ నుదుటిని చూసి చెబుతున్నా' అని ఘోష్ చెప్పారు.

● కమిషన్ విచారణకు శుక్రవారం వెదిరె శ్రీరామ్‌తో పాటు ఎమ్మెల్సీ కోదండరామ్ హాజరుకానున్నారు.

ఎమర్జెన్సీని వాజ్‌పేయి ముందే పసిగట్టారు!

» స్వీయచరిత్ర 'ఉనిక' పుస్తకంలో వెల్లడించిన మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



రాష్ట్రపతితో మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఆయన కుటుంబసభ్యులు

హైదరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించబోతున్నారని.. బీజేపీ అగ్రనేత, మాజీ ప్రధాని వాజ్‌పేయి ముందే పసిగట్టి ఉంటారని మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అభిప్రాయపడ్డారు. ఎమర్జెన్సీ విధించే ముందు కరీంనగర్‌లో జరిగిన బహిరంగ సభకు వాజ్‌పేయి హాజరయ్యారన్నారు. 'ఈ ప్రభుత్వం ఒకడిని పట్టుకుని నువ్వు నేరస్తుడివి అంటుంది. నేరం చేయలేదంటే, ఎలా చేయలేదో రుజువు చేసుకో అంటుంది..' అని వాజ్‌పేయి నాటి బహిరంగ సభలో చెప్పారని గుర్తు చేసుకున్నారు. దేశ జనాభాకు అనుగుణంగా రెండో రాజధాని అవసరమని, అది హైదరాబాద్ అయితే బాగుంటుందని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అభిప్రాయపడ్డారని పేర్కొన్నారు. తన స్వీయ చరిత్రకు సంబంధించి ప్రచురించిన 'ఉనిక' పుస్తకంలో విద్యాసాగర్‌రావు తన అనుభవాలతో పాటు పలు అంశాల్ని ప్రస్తావించారు. గురువారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. 'ఉనిక' ప్రతిని ఆమెకు అందజేశారు. ఆనాడు ఎమర్జెన్సీలో తన నాన్నను మీసా కింద వరంగల్ జైల్లో బంధించారని.. అప్పుడు తనకు కట్టలు తెంచుకున్న దు:ఖం వచ్చిందని.. దానినే 'కాళ్ల మెట్టెలు' పేరిట కథను రాసినట్లు పుస్తకంలో విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. నక్సలైట్లతో ఘర్షణ, పార్టీ అగ్రనేతలు వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ, మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌లతో అనుబంధం వంటి అంశాలను విద్యాసాగర్‌రావు తన స్వీయ చరిత్రలో ప్రస్తావించారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనాన్ని కూడా 'ఉనిక'లో ప్రచురించారు. ఆంధ్రజ్యోతి శ్రీశక్తి పేజీలో 'బహుభార్యాత్వానికి భరతవాక్యం ఎప్పుడు?' అన్న శీర్షికతో ఈ ప్రత్యేక కథనం ప్రచురితమైంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.